సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12 వెల: ₹ 5.00

సంపుటి: 13
సంచిక: 9

బుధవారం 1-4-2020

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు పాడిపంటలతో పులకించాలి'

మీ ఈఎంఐ కట్ చేయొద్దా?
ఆటోమేటిగ్గానే మారటోరియం.. వద్దు అనుకుంటే బ్యాంకుకు చెప్పాలి –బిజినెస్‌లో

ANDHRA BANK

నేడే మెగా విలీనం..
6 బ్యాంకులు కనుమరుగు
ఆంధ్రా బ్యాంకు కూడా... – బిజినెస్‌లో

మర్కజ్ @ 1030

తెలంగాణ నుంచి ఢిల్లీకి వెళ్లొచ్చిన వారి సంఖ్య..

వీరిలో 20 మందికి కరోనా.. ఆరుగురు మృతి

- ఒక్కొక్కరు సగటున పదిమందితో కాంటాక్ట్
- అలా 10 వేల మందితో కాంటాక్ట్ అయ్యుండొచ్చు
- వైద్య, ఆరోగ్య శాఖ ప్రాథమిక అంచనా
- అందరినీ గుర్తించే పనిలో నిఘా బృందాలు
- సెక్రటేరియట్‌కూ కరోనా కుదుపు.. ఐసోలేషన్‌లో ఉద్యోగి

సాక్షి, హైదరాబాద్

తెలంగాణ నుంచి ఢిల్లీలోని నిజాముద్దీన్ మర్కజ్‌లో జరిగిన మత ప్రార్థనలకు 1,030 మంది వెళ్లొచ్చినట్లు వైద్య, ఆరోగ్యశాఖ వర్గాలు నిర్ధారించాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందినవారు ఇందులో ఉన్నారు. వారిలో 20 మందికి కరోనా పాజిటివ్ వచ్చినట్లు తేలింది. వీరిలో ఆరుగురు చనిపోయారు. రాష్ట్రంలో సంభవించిన మరణాలు.. ఢిల్లీ నుంచి వచ్చిన వారివే కావడం ఆందోళన కలిగిస్తోంది. ఢిల్లీ వెళ్లొచ్చిన వారు.. స్నేహితులు, బంధువుల ఇళ్లకు వెళ్లడం, ప్రార్థనల్లో పాల్గొనడంతో వారెందరితో కలిసి తిరిగారన్నది అంతుబట్టడం లేదు. వైద్య, ఆరోగ్యశాఖలో కరోనా కీలక కమిటీలోని ఓ ఉన్నతాధికారి అంచనా ప్రకారం.. ఢిల్లీ నుంచి వచ్చిన వారు ఒక్కొక్కరు పదిమందినైనా కలిసి ఉంటారు. అలా కనీసం 10 వేల మందితో వారు కాంటాక్ట్ అయి ఉండొచ్చని ఆయన చెబుతున్నారు. కొందరైతే రోజువారీ కార్యకలాపాల్లో పాల్గొనడం, ప్రార్థనలకు వెళ్లడం తదితర కారణాల వల్ల ఇంకా ఎక్కువ మందికి అంటుకుందని భావిస్తున్నట్లు ఆయన తెలిపారు.

సెక్రటేరియట్‌లో కరోనా కలకలం

ఢిల్లీ వెళ్లిన వారిలో సెక్రటేరియట్‌లో పనిచేసే పశుసంవర్ధకశాఖ ఉద్యోగి కూడా ఉన్నారు. ఆయన సంబంధితశాఖ ఉన్నతాధికారులను కలవడం, తోటి ఉద్యోగులతో కలసిమెలసి తిరగడం ఇప్పుడు కలకలం రేపుతోంది. ఆయనను గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లి నమూనాలను పరీక్షల కోసం పంపారు. అక్కడే ఐసోలేషన్‌లో ఉంచారు. పరీక్ష ఫలితాలు రావాల్సి ఉంది. అతను సెక్రటేరియట్‌లో ఎంతమందిని కలిశారనే దానిపై ఆరా తీస్తున్నారు. అతనితో మరింత సన్నిహితంగా ఉన్నవారు హోం ఐసోలేషన్‌లో ఉండాలని, లక్షణాలేమైనా ఉంటే సంప్రదించాలని వైద్యాధికారులు కోరుతున్నారు. సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మొదలు, వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, మంత్రులు, వారి పేషీ అధికారులుంటారు. పైగా ప్రస్తుత సచివాలయం ఇరుకుగా ఉండటం, గాలీ వెలుతురు తక్కువగా ఉండటంతో వైరస్ వ్యాప్తిపై ఆందోళన నెలకొంది. దీంతో సచివాలయ

మిగతా 3వ పేజీలో ▶

మంగళవారం ఢిల్లీలో నిజాముద్దీన్ మర్కజ్‌లో ఉన్న వారిని బస్సులో క్వారంటైన్‌కు తరలిస్తున్న అధికారులు

కౌలాలంపూర్ నుంచి అంటుకుందా?

- అక్కడ తబ్లిగి జమాత్ సదస్సుకు హాజరైన వారికి కరోనా
- అక్కడి నుంచి నిజాముద్దీన్ మర్కజ్‌కు ఇండోనేసియన్లు, ఇతర దేశస్తులు
- నిజాముద్దీన్ నుంచి దేశం నలుమూలలా..: కేంద్రం

- ప్రపంచవ్యాప్తంగా మంగళవారం నాటికి 40,673 మంది ఈ మహమ్మారితో ప్రాణాలు కోల్పోగా 8,19,038 మంది వ్యాధి బారినపడ్డారు.
- అమెరికాలో 3,400 మంది కరోనాకు బలికాగా, 1,74,665 మందికి వైరస్ సోకింది.
- భారత్‌లో ఇప్పటివరకు వైరస్‌తో 35 మంది మరణించగా, కేసుల సంఖ్య 1397కు చేరుకుంది
- యూరప్‌లో మొత్తం 4,29,362 కరోనా కేసులు ఉండగా, 27,740 మంది ప్రాణాలు కోల్పోయారు.
- ఆసియాలో కరోనా కేసుల సంఖ్య 1,08,143గా ఉండగా, 3,878 మంది మృతి చెందారు.

- వివరాలు 8లో

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి

కరోనా దెబ్బకు డాలర్ కల చెదురుతోంది. అమెరికాలో రోజురోజుకూ పెరుగుతున్న కరోనా కేసులు అక్కడి భారతీయ ఐటీ నిపుణులకు నిద్రలేకుండా చేస్తోంది. కరోనా నుంచి కాపాడుకోవడానికి అష్టకష్టాలు పడుతున్న మనవాళ్లు రానున్న గడ్డు కాలాన్ని తలుచుకుని తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రపంచ ఆర్థిక రాజధానిగా పేరొందిన న్యూయార్క్.. కరోనా దెబ్బకు విలవిల్లాడుతోంది. న్యూయార్క్, దాన్ని ఆనుకుని ఉన్న న్యూజెర్సీ కనెక్టికట్‌లో 86,361 మందికి కరోనా వైరస్ సోకింది. దీని బారిన పడ్డ వారిలో ఇప్పటికే 1,459 మంది ప్రాణాలు కోల్పోయారు. ఒక్క న్యూయార్క్‌లోనే 38,087 మంది కరోనా బాధితులు ఉండగా, వారిలో 914 మంది మరణించారు. గడిచిన 15 రోజులుగా న్యూయార్క్‌లో అన్ని వాణిజ్య, వ్యాపార కార్యకలాపాలు ఆగిపోయాయి. ఈ రెండు రాష్ట్రాలకు వెళ్లొద్దంటూ అమెరికా ప్రభుత్వం పౌరులను హెచ్చరించిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మరో మూడు నెలల పాటు న్యూయార్క్‌లో పరిస్థితి ఇలాగే ఉంటుందని ఆ రాష్ట్ర గవర్నర్ ఇప్పటికే ప్రకటించారు. దీంతో అక్కడ కార్యకలాపాలు నిర్వహించే పలు కంపెనీలు తమ ఉద్యోగులను తొలగించే పనిలో పడ్డాయి. మార్చి నెలాఖరుతో కాంట్రాక్టు గడువు పూర్తయిన 40 వేల మందికి గడువు పొడిగించలేదు. వీరిలో చాలామంది భారతీయులే. ఇప్పుడు ఉద్యోగాలు పోవడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. 'ఓవైపు కరోనాతో యుద్ధం చేస్తున్నాం. ఉన్న సరుకులను కొద్దికొద్దిగా వాడుకుంటున్నాం. మా కాంట్రాక్టు ముగిసిందంటూ మెయిల్ వచ్చింది. ఈ కఠిన పరిస్థితుల్లో భారత్ రావడమే మేలని భావించాం. అయితే విమానాలు లేకపోవడంతో బిక్కుబిక్కుమంటూ నేను, నా కుటుంబం కాలం గడుపుతున్నాం'అని జీఈ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న మంచిరెడ్డి శ్రీకాంత్ ఆవేదన వ్యక్తం చేశారు.

అమెరికాలో ఊడుతున్న మనవాళ్ల ఉద్యోగాలు
కాంట్రాక్టు ఉద్యోగులను తొలగిస్తున్న కంపెనీలు
40 వేల మందికి తప్పని ఉద్వాసన
ఫుల్ టైం ఉద్యోగుల విషయంలో ఆచితూచి..
లే ఆఫ్ ఉండబోదని ప్రకటించిన ఫేస్‌బుక్, ఆపిల్, మైక్రోసాఫ్ట్

లక్ష మందికి గడ్డుకాలమే..

హెచ్1బీ వీసాలపై అమెరికాలో పనిచేస్తున్న భారతీయుల్లో దాదాపు లక్ష మంది ఉద్యోగాలు కోల్పోతారని న్యూయార్క్ టైమ్స్ అంచనా వేసింది. 'చాలామంది భారతీయులు ఉద్యోగాలు వదిలేసి స్వదేశం వెళ్లిపోవాలనే ఆలోచనలో ఉన్నారు. ఇక్కడ ఇళ్లు, కార్లు వదిలేసి పోవడానికి కూడా సిద్ధపడుతున్నారు. కరోనాతో 2 లక్షల మంది పనిపోతుందని స్వయంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో భారతీయులు తీవ్రమైన ఒత్తిడికి లోనవుతున్నారు. తనను ఎలాగైనా భారతకు పంపాలని బ్యాంక్ ఆఫ్ అమెరికాలో పని చేసే పురాణ పండ గాయత్రి యాజమాన్యాన్ని వేడుకుంటున్నారు. ఇలాంటి వారు చాలామంది న్యూయార్క్ టైమ్స్‌కు మెయిల్స్ ద్వారా వారి ఆందోళనను వెలిబుచ్చారు. ఈ విషయంలో భారత ప్రభుత్వం కూడా సత్వరం ఓ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది'అని న్యూయార్క్ టైమ్స్ తన సోమవారం నాటి సంచికలో ఓ ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ఈ కథనం ప్రకారం వచ్చే మూడు నెలల్లో లక్ష మంది భారతీయులు ఉద్యోగాలు కోల్పోతారు. మార్చి నుంచి జూన్ దాక వివిధ ప్రాజెక్టుల్లో కొనసాగుతున్న ఉద్యోగులను వదిలించుకోవాలని కంపెనీలు నిర్ణయానికి వచ్చాయి. ఈ లెక్కన అమెరికాలో ఎన్ని ఉద్యోగాలు పోతాయో.. వారిలో ఎందరు భారతీయులు ఉంటారని కచ్చితంగా చెప్పలేమని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, బర్కిలీకి చెందిన ప్రొఫెసర్ జాన్ ఎల్ హెలిబ్రాన్ పేర్కొన్నట్లు

మిగతా 3వ పేజీలో ▶

15

మంగళవారం నమోదైన కరోనా పాజిటివ్ కేసులు..

- వీరంతా ఢిల్లీ నుంచి వచ్చిన వారు, వారి బంధువులే
- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ వెల్లడి
- రాష్ట్రంలో మొత్తం 97కి చేరిన కరోనా కేసులు
- తాజా కేసుల వివరాల వెల్లడిపై గోప్యత

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో మంగళవారం మరో 15 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. వీరంతా ఢిల్లీ మర్కజ్ నుంచి వచ్చిన వారు, వారి బంధువులని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో రాష్ట్రంలో మొత్తం కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 97కి చేరింది. అందులో ఇప్పటివరకు 14 మంది డిశ్చార్జి కాగా, ఆరుగురు మరణించారు. ప్రస్తుతం 77 మంది వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని మంత్రి తెలిపారు. మర్కజ్ నుంచి వచ్చిన వారంతా గాంధీ ఆసుపత్రిలో పరీక్ష చేయించుకోవడానికి రావాలని సోమవారం సీఎం సహా వైద్య, ఆరోగ్యశాఖ విజ్ఞప్తి చేసిన విషయాన్ని మంత్రి ప్రస్తావించారు. కరోనా లక్షణాలున్న వారు, తమతోపాటు బంధువులను కూడా పరీక్షలకు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. కరోనా నియంత్రణకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రజలు ఇళ్లలోనే ఉండి సహకరించాలని కోరారు. తాజాగా నమోదైన 15 కేసులకు సంబంధించిన వివరాలను వైద్య ఆరోగ్యశాఖ వెల్లడించలేదు. ఏ జిల్లాకు చెందినవారు? వయసు, ఆరోగ్య పరిస్థితిపై ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. దీంతో వారంతా ఎక్కడి వారనే దానిపై గందరగోళం నెలకొంది. అలాగే, వైద్య ఆరోగ్యశాఖ ఒకరోజు ఇచ్చే బులెటిన్‌కు, మర్నాడు ఇచ్చే బులెటిన్‌కు పొంతన కుదరడం లేదన్న విమర్శలున్నాయి. సమాచారాన్ని స్పష్టంగా ఇస్తే ప్రజలు జాగ్రత్తలు పాటించడానికి అవకాశముంటుందని అంటున్నారు.

వారిని పోలీసులు అడ్డుకోవద్దు..

డయాలసిస్, తలసీమియా, సికెల్ సెల్ జబ్బులున్న వారికి రక్తమార్పిడి అవసరమవుతున్నందున వారు ప్రయాణించడానికి వెసులుబాటు కల్పించాలని సీఎం ఆదేశించారని ఈటల తెలిపారు. పోలీసులు వీరిని అడ్డుకోవద్దని సూచించారు. గర్భిణులకు ఇబ్బందులు లేకుండా మదర్ అండ్ చైల్డ్ కేర్ సెంటర్లు పనిచేస్తాయన్నారు.

జిల్లా అనుబంధం.. 9,10 పేజీల్లో..

..గాంధీ ఆసుపత్రి కన్నా ఎక్కువ దృష్టి ఎర్రగడ్డ ఆసుపత్రి మీదే పెట్టాలి సార్!

21 ఏపీలో ఒక్కరోజే పాజిటివ్ కేసులు

ఇందులో 17 మంది ఢిల్లీ నుంచి వచ్చిన వారే
మొత్తంగా రాష్ట్రంలో కరోనా పాజిటివ్ కేసులు 44

సాక్షి, అమరావతి: ఏపీలో ఒక్కసారిగా ఢిల్లీ నుంచి వచ్చిన ప్రయాణికులు కలకలం రేపారు. ఇప్పటివరకు విదేశాల నుంచి రాష్ట్రానికి వచ్చిన వారి నుంచే కరోనా కేసులు ఎక్కువగా నమోదయ్యాయనుకుంటే, ఢిల్లీలో మత ప్రార్థనలకు వెళ్లి వచ్చిన వారిలో ఎక్కువ మందికి పాజిటివ్‌గా నిర్ధారణ కావడం రాష్ట్రంలో కలకలం రేపుతోంది. మార్చి 30వ తేదీ సోమవారం రాత్రి వరకు 23 పాజిటివ్ కేసులతో ఉన్న రాష్ట్రం.. మంగళవారం నాటికి ఒక్క రోజు వ్యవధిలో ఆ సంఖ్య 44కు చేరింది. ఒకేరోజు 21 కేసులు నమోదయ్యాయి. ఇందులో 17 మంది ఢిల్లీలోని నిజాముద్దీన్ మర్కజ్‌లో ప్రార్థనల కోసం వెళ్లి వచ్చిన వారే కావడం గమనార్హం. ఈ మర్కజ్‌లో అంతర్జాతీయంగా ప్రసిద్ధి గాంచింది. ఏటా మన దేశం నుంచే కాకుండా వివిధ దేశాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఇక్కడికి

మిగతా 2వ పేజీలో ▶

క్వారంటైన్ కష్టాలు..

విదేశాల నుంచి వచ్చి అవస్థలు పడుతున్న తెలుగువాళ్లు
ఫారిన్ రిటర్న్డ్ అని దూరం పెడుతున్న కాలనీవాసులు

ఇంటి కిటికీలు తెరిచినా సహించని ప్రజలు..
క్వారంటైన్‌పై అపోహలు తొలిగితేనే 'విదేశాల' లెక్క తేలేది

సాక్షి, హైదరాబాద్

- రాజధానిలోని ఉప్పల్ ప్రాంతానికి చెందిన నాగరాజు (పేరు మార్చాం) మొన్నటివరకు జర్మనీలో ఉండి వచ్చారు. మొన్నటివరకు ఆ కాలనీలో అతడో సెలబ్రిటీ.. కానీ ఇప్పుడు అతడిని అంటరానివాడిగా ఆ కాలనీవాసులు చూస్తున్నారు.
- గచ్చిబౌలిలో నివసించే అరుణ్ (పేరు మార్చాం) లండన్ నుంచి వచ్చాడు. అతడు ఉండే అపార్ట్‌మెంట్‌లో తీవ్ర వివక్షను ఎదుర్కొంటున్నాడు. ఇతడి ఫ్లాట్ తలుపులు, కిటికీలు తెరిచినా పక్కింటి వారు, అపార్ట్‌మెంట్ వాసులు అంగీకరించట్లేదు. క్వారంటైన్‌లో ఉన్న మనిషిని ఇంట్లో పెట్టుకుని యథేచ్ఛగా తలుపులు తీస్తారా?అని ఆయన కుటుంబసభ్యులతో వాగ్వాదానికి దిగుతున్నారు.



ఇవి రెండే కాదు.. విదేశాల నుంచి హోం క్వారంటైన్‌లో ఉన్న వందలాది మంది విదేశాల నుంచి వచ్చిన వారి గోస ఇది. గతంలో పూలు అమ్మిన చోట ఇప్పుడు రాళ్లు అమ్ముకుంటున్న పరిస్థితులు. గతంలో ఉన్న గౌరవాన్ని కరోనా మింగేయడంతో ఓ రకంగా వివక్షపూరిత జీవనం కొనసాగిస్తున్నారు. ఎంతగా అంటే.. కనీసం వారికి అన్నం పెట్టేందుకు కుటుంబసభ్యులు కూడా భయపడేంత.

మార్పు వస్తేనే మేలు..

ప్రస్తుత పరిస్థితుల్లో విదేశాల నుంచి వారికి దూరంగా ఉండటమే మంచిది. కానీ వారికి కరోనా సోకినా, సోకకున్నా తన చుట్టుపక్కల ఈ వైరస్ వ్యాప్తి చెందకుండా ఉండాలన్న నిబద్ధతతో తమకు తాము 14 రోజుల పాటు స్వీయ నిర్బంధంలో ఉంటున్న వారిని కించపరిచేలా వ్యవహరించడం తగదని అటు ప్రభుత్వ వర్గాలు, ఇటు వైద్యులు

మిగతా 3వ పేజీలో ▶

డ్రైవింగ్ లైసెన్స్ గడువు ముగిసినా పర్లేదు!

జూన్ 30 వరకు వెసులుబాటు

సాక్షి, హైదరాబాద్: మీ డ్రైవింగ్ లైసెన్స్ గడువు ముగిసిందా? రెన్యువల్ వీలుపడలేదా? అయినా పర్లేదు. దీనికి సంబంధించి జూన్ 30 వరకు వెసులుబాటు కల్పించారు. డ్రైవింగ్ లైసెన్సులతోపాటు వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, పర్మిట్లు, రిజిస్ట్రేషన్లు.. ఇలా వాహనాలకు సంబంధించిన పలు రకాల సర్టిఫికెట్ల గడువు ముగిసినవారు, త్వరలో ముగుస్తున్నవారు ఎందరో ఉన్నారు. ఈ విషయం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి వెళ్లటంతో ఆయన సమస్య పరిష్కారానికి చొరవ తీసుకున్నారు. రవాణా శాఖతో ముడిపడిన వివిధ పత్రాలకు సంబంధించి.. ఫిబ్రవరి 1 నుంచి జూన్ 30 వరకు గడువు ముగిసిన, ముగుస్తున్న వాటికి సంబంధించిన వాహనదారులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ఆదేశాలు జారీ చేశారు. ఫిబ్రవరి 1 నుంచి జూన్ 30 వరకు గడువు ముగిసినవాటిని జూన్ 30 తర్వాత రెన్యువల్ చేసుకునే అవకాశం కల్పించారు.

మూడో తారీఖున ఉద్యోగులకు జీతం

1, 2 తేదీల్లో సెలవులు..

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మార్చి నెల జీతం ఏప్రిల్ మూడో తేదీన వచ్చే అవకాశం ఉంది. ఏప్రిల్ 1, 2 తేదీల్లో సెలవులు కావడంతో 3 లోగా ఉద్యోగులకు జీతాల చెల్లింపు ప్రక్రియ పూర్తి చేయాలని రాష్ట్ర ఆర్థిక శాఖ.. అన్ని జిల్లాల ట్రెజరీలను ఆదేశించింది. కరోనా వైరస్ నియంత్రణ చర్యల్లో భాగంగా లాక్‌డౌన్ అమలు చేస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం భారీగా పడిపోయింది. ఈ నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు, పెన్షన్లకు కోత పెట్టాలని సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. లాక్‌డౌన్ అమల్లో ఉన్నంత కాలం ఈ కోత అమలుకానుందని మంగళవారం జిల్లా ట్రెజరీలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఆర్థిక ముఖ్య కార్యదర్శి రొనాల్డ్ రోస్ స్పష్టతనిచ్చారు. కాగా, కరోనా నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న చర్యలకు

మిగతా 2వ పేజీలో ▶

ఒక్కొక్కరికి ఉచితంగా 12 కిలోల బియ్యం

నేటి నుంచి రేషన్ పంపిణీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా బుధవారం నుంచి రేషన్ బియ్యం పంపిణీ మొదలుకానుంది. రాష్ట్రంలోని 2.81 కోట్ల లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 12 కిలోల చొప్పున ఉచితంగా బియ్యం పంపిణీ చేసేలా పౌర సరఫరాల శాఖ ఏర్పాట్లు చేసింది. మొత్తంగా 3.36 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఇప్పటికే రేషన్ దుకాణాలకు సరఫరా చేసింది. పంపిణీ కోసం రేషన్ దుకాణాలు ఉదయం, సాయంత్రం అన్ని వేళలా పనిచేసేలా చర్యలు చేపట్టింది. ఇందుకు ప్రభుత్వం రూ.1,103 కోట్లు ఖర్చు చేయనుంది. బుధవారం నుంచి ప్రారంభమయ్యే పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్లు పర్యవేక్షించాలని పౌరసరఫరాల కమిషనర్ సత్యనారాయణరెడ్డికి మంత్రి గంగుల కమలాకర్ ఆదేశించారు. ఎవరికీ ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. లబ్ధిదారులు రేషన్ దుకాణాల వద్ద గుమికూడకుండా, విడతల వారీగా బియ్యం

మిగతా 2వ పేజీలో ▶

వెంటిలేటర్లు ఎలా పనిచేస్తాయి?

కరోనాపై చేస్తున్న యుద్ధంలో అవి ఎందుకు కీలకం..

వెంటిలేటర్లు రోగి ఊపిరితిత్తులకు ఆక్సిజన్‌ను చేరవేసే యంత్రాలు

కరోనా సోకిన రోగుల్లో ప్రతి ఆరుగురిలో ఒకరు శ్వాస తీసుకోవడంలో చాలా సమస్యలు ఎదుర్కొంటారు. వారిలో కొందరు ఏఆర్‌డీఎస్ (అక్యూట్ రెస్పిరేటరీ డిస్ట్రెస్ సిండ్రోమ్)తో బాధపడవచ్చు. ఇది ప్రాణాంతకం కూడా.. ఇలాంటివారికి వెంటిలేటర్ అవసరమవుతుంది.



వెంటిలేటర్‌కు ప్రత్యామ్నాయం..

బ్యాగ్ వాల్వ్ మాస్క్

అంబ్యు బ్యాగ్ డిజైన్‌లో మార్పు చేస్తే చాలు..

- తక్కువ ఖర్చుతో ఎక్కువ మొత్తంలో తయారీకి అవకాశం
- ఒక్కో బ్యాగ్ వాల్వ్ మాస్క్ తయారీ ఖర్చు రూ.5 వేలలోపే
- విద్యుత్ సౌకర్యం లేని మారుమూల ప్రాంతాల్లోనూ వినియోగం
- కేంద్రానికి ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ల బృందం ప్రతిపాదన

సాక్షి, హైదరాబాద్

అంబ్యు బ్యాగ్ పరికరం డిజైన్‌లో కొన్ని మార్పులు చేయడం ద్వారా వెంటిలేటర్‌కు ప్రత్యామ్నాయాన్ని తయారు చేయొచ్చని ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ల బృందం కేంద్రానికి సూచించింది. అంబ్యు బ్యాగ్ డిజైన్‌ను కొద్దిగా మార్చేసి కొత్తగా తయారుచేసే 'బ్యాగ్ వాల్వ్ మాస్క్' పరికరం ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోవాలని కోరింది. బ్యాగ్ వాల్వ్ మాస్క్ పరికరానికి సంబంధించి ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బీఎస్ మూర్తితో పాటు మెకానికల్, ఏరోస్పేస్ విభాగం ప్రొఫెసర్ ఈశ్వరన్ ఇటీవల పలు ప్రతిపాదనలు చేశారు. వెంటిలేటర్లకు ప్రత్యామ్నాయంగా ఈ మాస్కుల తయారీకి కార్యాచరణ సిద్ధం చేసేందుకు డీఆర్‌డీవో లేదా కేంద్ర శాస్త్ర సాంకేతిక విభాగం నిపుణులతో అత్యున్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. 130 కోట్ల జనాభా ఉన్న మన దేశంలో కరోనా ద్వారా శ్వాస సంబంధ సమస్యలు తలెత్తే అవకాశం ఉందనే విషయాన్ని ప్రొఫెసర్ బృందం గుర్తు చేసింది.

తక్కువ ఖర్చుతోనే..

రోగులకు కృత్రిమ శ్వాస అందించే వెంటిలేటర్ల కొరత, వ్యయాన్ని దృష్టిలో ఉంచుకుని తక్కువ ఖర్చుతో తయారయ్యే వెంటిలేటర్ల నమూనాలపై ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే పలు డిజైన్లపై పరిశోధనలు జరుగుతున్నాయి. ఐఐటీ హైదరాబాద్ బృందం ప్రతిపాదిస్తున్న బ్యాగ్ వాల్వ్ మాస్క్‌లను విద్యుత్ సౌకర్యం లేని మారుమూల ప్రాంతాల్లోనూ ఉపయోగించొచ్చు. కారులోని బ్యాటరీ వంటి వాటికి ఈ మాస్క్‌లను అనుసంధానం చేసి నడిపించొచ్చు. వెంటిలేటర్ తరహాలో భారీ మెషీన్ కాకపోవడంతో దీనికి ఒకచోట నుంచి మరో చోటకు తీసుకెళ్లడం చాలా సులువు. దీని తయారీకి కేవలం రూ.5 వేల లోపు ఖర్చు అయ్యే అవకాశం ఉందని ఐఐటీ హైదరాబాద్ బృందం అంచనా వేస్తోంది. త్రీడీ ప్రింటర్ల ద్వారా తయారు చేసే బ్యాగ్ వాల్వ్ మాస్క్‌ల నమూనాలు కూడా అందుబాటులోకి వచ్చాయి. అయితే త్రీడీ ప్రింటు సాంకేతికత ద్వారా పరిమిత సంఖ్యలోనే తయారుచేసే అవకాశం ఉందని పరిశోధకులు చెబుతున్నారు. కాగా, ఇవి నిరంతరాయంగా పనిచేయకపోవచ్చనే అనుమానాలనూ ఈ బృందం వ్యక్తం చేసింది.

40 లక్షల మందికి అవసరం

మన దేశ జనాభాలో దాదాపు 6 శాతం మందికి అంటే.. 8 కోట్ల మందికి కరోనా వైరస్ సోకుతుందని అంచనా.. చికిత్సలో భాగంగా ఇందులో కనీసం 40 లక్షల మందికి వెంటిలేటర్లు అవసరం అవుతాయని నిపుణులు చెబుతున్నారు. అయితే దేశంలో కేవలం 40 వేల వెంటిలేటర్లు మాత్రమే అందుబాటులో ఉండగా, వచ్చే 10 నెలల్లో మరో 60 వేల వెంటిలేటర్లు మాత్రమే తయారుచేసే సామర్థ్యం మన దేశీయ కంపెనీలకు ఉంది. ఇందుకు దాదాపు రూ.3,600 కోట్లు అవసరం కానున్నాయి. పైగా కంప్యూటర్ సాయంతో నడిచే అత్యాధునిక వెంటిలేటర్ ధర రూ.40 లక్షల మేర పలుకుతుండగా, సాధారణ రకం విదేశీ వెంటిలేటర్‌కు రూ.15 లక్షల వరకు పలుకుతుండగా, దేశీయ వెంటిలేటర్‌కు రూ.6 లక్షల వరకు ఉంది.

'అంబు బ్యాగ్'అంటే..

అత్యవసర సమయాల్లో రోగులకు శ్వాస అందించే సంచిలాంటి పరికరాన్ని వైద్య పరిభాషలో అంబ్యు బ్యాగ్ అంటారు. దీన్ని విద్యుత్ అవసరం లేకుండా చేతి ద్వారానే పనిచేయిస్తారు. ప్రస్తుత పరిస్థితుల్లో దీని డిజైన్‌లో కొన్ని మార్పులు చేయడం ద్వారా 'బ్యాగ్ వాల్వ్ మాస్క్'ను తయారుచేయాలని ఐఐటీ హైదరాబాద్ సూచిస్తోంది. 60 వేల వెంటిలేటర్ల తయారీకి అయ్యే ఖర్చుతో దాదాపు 60 లక్షల బ్యాగ్ వాల్వ్ మాస్కులను త యారు చేయొచ్చని చెబుతోంది.

మరింత చురుగ్గా టాస్క్‌ఫోర్స్‌లు

ఉన్నత స్థాయి సమీక్షలో ఏపీ సీఎం వైఎస్ జగన్ ఆదేశం

సాక్షి, అమరావతి: కరోనా వైరస్ కట్టడికి జిల్లా, నియోజకవర్గాల స్థాయిలో ఏర్పాటైన టాస్క్‌ఫోర్సులు మరింత చురుగ్గా పనిచేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశించారు. మంత్రులు తప్పనిసరిగా క్రమం తప్పకుండా సమీక్షలు చేయాలని చెప్పారు. కరోనా వ్యాప్తి నివారణ చర్యలపై మంగళవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లా, నియోజకవర్గాల స్థాయిలో ఏర్పాటైన టాస్క్‌ఫోర్సులు మరింత సమర్థవంతంగా పని చేయడానికి మార్కెట్ యార్డుల చైర్మన్‌లనూ అందులో భాగస్వాములు చేయాలని ఆదేశించారు. ఖాళీగా ఉన్న మిగతా మార్కెట్ యార్డుల చైర్మన్ పోస్టులను భర్తీ చేసి, వారినీ టాస్క్‌ఫోర్సుల్లో వినియోగించుకోవాలని సూచించారు. ఇంటింటి సర్వే సాగుతున్న తీరును, రైతుల వ్యవసాయ ఉత్పత్తులకు ధరలు, నిత్యావసరాలు, లాక్ డౌన్ కొనసాగుతున్న తీరుపై ఆయన ఆరా తీశారు. పట్టణ ప్రాంతాల్లో ఇంటింటి సర్వే ప్రతి రోజూ నిరంతరాయంగా కొనసాగాలని ఆదేశించారు.

'తబ్లిగి జమాత్' కేసుల పర్యవేక్షణకు ప్రత్యేక విభాగం

'సాక్షి టీవీ'తో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: తబ్లిగి జమాత్ కేసుల వ్యవహారం పర్యవేక్షించేందుకు కేంద్ర హోంశాఖలో ప్రత్యేక విభాగం ఏర్పాటైందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన 'సాక్షి టీవీ'తో మాట్లాడారు. 'ఇప్పటికే సుమారు 1,500 మందిని ఐసోలేషన్ సెంటర్లలో పెట్టాం. ఇందులో స్వదేశీ, విదేశీ ప్రతినిధులు ఉన్నారు. నిన్నటి నుంచి మర్కజ్ పూర్తిగా మూసేశాం. ఆ స్థలాన్ని పోలీసుల అధీనంలోకి తీసుకున్నాం. చుట్టుపక్కల ప్రజలు ఇబ్బందిపడకుండా చూస్తున్నాం. డ్రోన్ల ద్వారా పర్యవేక్షిస్తాం. అందరికీ పరీక్షలు నిర్వహిస్తాం. 14 రోజుల పాటు క్వారంటైన్‌లో ఉంచుతాం. హోం మంత్రి అమిత్‌షా రాష్ట్రాలతో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నారు. తెలంగాణ జిల్లాల్లోని 16 మంది ఎస్పీలతో, నిన్న కలెక్టర్లతో మాట్లాడాను. జరిగిన పొరపాట్లను సరిదిద్దుకుని వైరస్ వ్యాప్తి చెందకుండా చూడాలి. ఇదంతా మతపరంగా, రాజకీయంగా చూడడం లేదు. మానవతా దృక్పథంతో చూస్తున్నాం. ఏపీ, తెలంగాణ సహా అనేక రాష్ట్రాల ప్రతినిధులు మర్కజ్ సమావేశాల్లో పాల్గొన్నారు. దానివల్లే అంటువ్యాధి సోకింది. తెలంగాణలో ఆరుగురు చనిపోయారు. దేశవ్యాప్తంగా మృతుల్లో ఈ సమావేశాలకు హాజరైన వారే ఎక్కువున్నారు. అన్ని రాష్ట్రాల్లో ప్రత్యేక పోలీసు బృందాలు ఏర్పాటుచేసి మర్కజ్ వెళ్లిన వారి కోసం ఆరా తీస్తున్నాం. 90 శాతం పని పూర్తయింది. ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే సమాచారాన్నివ్వాలి 'అని కిషన్‌రెడ్డి తెలిపారు.

రేషన్ బియ్యంపై సమీక్షిస్తున్న మంత్రి గంగుల

ఒక్కొక్కరికి ఉచితంగా 12 కిలోల బియ్యం

▶ మొదటి పేజీ తరువాయి

ఇచ్చే కూపన్లు అందజేస్తారు. కూపన్లు పట్టుకుని చెప్పిన సమయానికే లబ్ధిదారులు రేషన్ దుకాణాల వద్దకు వచ్చి తీసుకోవాల్సి ఉంటుంది. ప్రతి ఒక్కరూ రేషన్ తీసుకునే వరకు దుకాణాలు తెరిచే ఉంచుతామని మంత్రి స్పష్టం చేశారు. ప్రతినెలా క్రమం తప్పకుండా తీసుకునే కార్డుదారులకు బయోమెట్రిక్ అవసరం లేదని, గడిచిన 3 నెలలుగా తీసుకోని వారికి మాత్రమే బయోమెట్రిక్ పాటించాలని స్పష్టం చేశారు. ప్రతి చౌకధరల దుకాణం వద్ద శుభ్రత పాటించేందుకు శానిటైజర్లు, సబ్బు, నీటిని అందుబాటులో ఉంచుతున్నట్లు వెల్లడించారు. రేషన్ బియ్యం పంపిణీపై పౌర సరఫరా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పంపిణీని కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలని ఇందులో సూచించారు. ప్రజలు గుమికూడకుండా టైమ్ స్లాట్‌లో ఇచ్చిన సమయానికే లబ్ధిదారులు దుకాణాలకు వచ్చేలా చూడాలన్నారు. ప్రతి లబ్ధిదారుడు ఇతరులకు కనీసం 3 అడుగుల దూరం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టంచేశారు.

ఏపీలో ఒక్కరోజే 21 పాజిటివ్ కేసులు..

▶ మొదటి పేజీ తరువాయి

వస్తుంటారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మార్చి 14, 15వ తేదీల్లో రాష్ట్రం నుంచి పెద్ద సంఖ్యలో ప్రార్థనల కోసం వెళ్లారు. ఈ సమయంలో వివిధ దేశాల నుంచి మర్కజ్‌కు వచ్చిన వారిలో కొంత మందికి కరోనా వైరస్ అప్పటికే సోకినట్లు తెలుస్తోంది. ఆ విషయం అప్పట్లో ఎవరికీ తెలియక పోవడంతో అందరూ సన్నిహితంగా కలిసిమెలిసి ప్రార్థనల్లో పాల్గొన్నారు. దీంతో రాష్ట్రానికి చెందిన పలువురు కరోనా వైరస్ బారినపడ్డారు. ఆ విషయం తెలియకుండానే తిరిగి వారు మార్చి 17న స్వస్థలాలకు చేరుకున్నారు. 14 రోజుల అనంతరం ఈ మహమ్మారి బారిన పడ్డారని తెలియడంతో అటు అధికారుల్లో, ఇటు ప్రజల్లో ఆందోళనతో పాటు అప్రమత్తతా పెరిగింది. ఢిల్లీ నుంచి వచ్చిన ప్రయాణికుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా జల్లెడ పడుతున్నారు. వారు ఢిల్లీ నుంచి వచ్చాక ఎక్కడెక్కడ తిరిగారు.. ఎవరితో తిరిగారు.. ఎంత మందిని కలిశారు.. ఎక్కడ బస చేశారు.. రైల్లో ఏ బోగీలో ప్రయాణించారు.. వంటి వివరాల కోసం ఆయా జిల్లాల యంత్రాంగం అణువణువూ గాలిస్తోంది. ఢిల్లీ నుంచి వచ్చిన ప్రయాణికుల్లో ఇప్పటి వరకు ప్రకాశం జిల్లా నుంచి ఎక్కువ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి.

మారువేషంలో మార్కెట్‌కు వచ్చి కూరగాయలు కొనుగోలు చేస్తూ ధరలు తెలుసుకుంటున్న విజయనగరం జేసీ

ప్రజల బాగోగులు తెలుసుకోవడానికి పూర్వం రాజులు మారువేషంలో తిరిగేవారని కథల పుస్తకాల్లో చదివే ఉంటారు. కానీ ఇప్పుడు నిజ జీవితంలోనూ ఓ అధికారి అలాగే మారువేషంలో ప్రజల్లోకి వచ్చారు. ఏపీలోని విజయనగరం జాయింట్ కలెక్టర్ కృష్ణ కిశోర్‌కుమార్ సాధారణ వ్యక్తిలా లుంగీ ఎగ్గట్టి, తెల్ల బనీను వేసుకుని తలపాగా చుట్టి స్థానికంగా ఏర్పాటు చేసిన మార్కెట్లలో కూరగాయలు కొన్నారు. అక్కడి రేట్లు అడిగి తెలుసుకున్నారు. కూరగాయల రేట్లు పెంచి అమ్ముతున్నారనే ఫిర్యాదులపై ఆయన ఇలా పర్యటించారు. కొన్ని చోట్ల వ్యాపారులు స్వల్పంగా రేట్లు పెంచి అమ్ముతున్న విషయం స్వయంగా తెలుసుకున్నారు. వచ్చింది జేసీ అని తెలియక కూరలు ఎక్కువకు అమ్మిన వ్యాపారులు ఆ తర్వాత విషయం తెలిసి అవాక్కయ్యారు. స్వల్పంగానైనా సరే అధిక ధరలకు విక్రయించకుండా చర్యలు చేపడతామని జేసీ అన్నారు.

తలపాగా చుట్టి.. లుంగీ ఎగ్గట్టి..

– సాక్షి ప్రతినిధి, విజయనగరం

ఏపీ ఉద్యోగుల వేతనంలో కొంత వాయిదా

- సీఎం, మంత్రివర్గం ఇతర ప్రజా ప్రతినిధులకు మార్చి నెల వేతనం వాయిదా
- ప్రభుత్వ ఉద్యోగులకు 50 శాతం, నాలుగవ తరగతి ఉద్యోగులకు 90 శాతం చెల్లింపు
- పరిస్థితి కుదుట పడ్డాక మిగిలిన మొత్తం చెల్లింపు

సాక్షి, అమరావతి: అసలే అంతంత మాత్రంగా ఉన్న ఏపీ ఆర్థిక స్థితిపై కరోనా వైరస్ వ్యాప్తి తీవ్ర ప్రభావం చూపిస్తోంది. లాక్‌డౌన్ నేపథ్యంలో ఏపీ ప్రభుత్వానికి ఆదాయం పూర్తిగా తగ్గిపోయింది. మరో పక్క కరోనా నియంత్రణతో పాటు ఇతర అత్యవసర వ్యయానికి నిధులు అవసరం ఉంది. ఈ నేపథ్యంలో ఏపీ ముఖ్యమంత్రితో పాటు ఆ రాష్ట్ర మంత్రివర్గం, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర రాజకీయ పదవుల్లోని వారికి, స్థానిక ప్రజా ప్రతినిధులకు, కార్పొరేషన్ల చైర్మన్లకు మార్చి నెల వేతనాలను చెల్లించకుండా వాయిదా వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

- అఖిల భారత సర్వీసు అధికారులైన ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ లాంటి అధికారులందరి మార్చి వేతనాల్లో 40 శాతం చెల్లించనున్నారు. మిగతా 60 శాతం వాయిదా వేయనున్నారు.
- రాష్ట్ర ప్రభుత్వ మిగతా ఉద్యోగులకు మార్చి నెల వేతనాల్లో 50 శాతం చెల్లించి, మిగతా 50 శాతం వాయిదా వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.
- నాలుగవ తరగతి ఉద్యోగులకు 90 శాతం వేతనాలను చెల్లించి, 10 శాతం వేతనాన్ని మాత్రం వాయిదా వేయనుంది.
- అన్ని రకాల పింఛన్లు పొందుతున్న రిటైర్డ్ ఉద్యోగులకు 50 శాతం పెన్షన్‌ను వాయిదా వేశారు.
- అన్ని ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వ గ్రాంట్లు పొందుతున్న సంస్థల ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగుల తరహాలోనే వేతనాలను వాయిదా వేశారు. వాయిదా వేసిన వేతనాలను పరిస్థితి కుదుట పడగానే ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

40 మంది వైద్యాధికారులకు కరోనా పరీక్షలు

- అందరికీ నెగటివ్ వచ్చినట్టు వెల్లడి
- కొందరు ఐఏఎస్‌లకూ వైద్య పరీక్షలు
- విమానాశ్రయం థర్మల్ స్క్రీనింగ్ వద్ద పనిచేసిన నలుగురికి పాజిటివ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కీలకమైన స్థానాల్లో ఉన్న 40 మంది వైద్యాధికారులకు తాజాగా కరోనా ప్రాథమిక నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. వారిలో ఎవరికీ కూడా పాజిటివ్ రాలేదని వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు తెలిపాయి. ఉన్నతస్థాయిలో ఉన్న అనేకమంది వైద్యాధికారులు రేయింబవళ్లు సమీక్షల్లో పాల్గొనడం, మంత్రులు, డాక్టర్లతోనూ సమావేశాల్లో ఉండటం, ఆసుపత్రులకు వెళ్లడం, బయట ఆహారం తీసుకోవడం తదితర కారణాలతో కొందరికి జలుబు, దగ్గు వచ్చింది. మరికొందరు జ్వరంతో బాధపడుతున్నారు. దీంతో వారంతా ప్రాథమిక పరీక్షలు చేయించుకున్నారు. అసలు వైరస్ శరీరంలోకి ప్రవేశించిందా లేదా అన్నదే ఈ వైద్య పరీక్షల ఉద్దేశం. వారితో పాటు పలువురు ఐఏఎస్‌లు, ఇతర అధికారులు కూడా ఇలాగే పరీక్షలు చేయించుకున్నట్లు సమాచారం. వారెవరికీ కూడా పాజిటివ్ రాలేదని అధికారులు తెలిపారు. అయితే హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో థర్మల్ స్క్రీనింగ్ వద్ద పనిచేసిన కొందరు వైద్య సిబ్బందిలో నలుగురికి పాజిటివ్ వచ్చింది. వారిని ఆసుపత్రిలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. వారితోపాటు మరో ఇద్దరిలోనూ లక్షణాలున్నట్లు అనుమానిస్తున్నారు. ఇక గాంధీ, ఫీవర్, ఛాతీ ఆసుపత్రిలో పనిచేసే కొందరు డాక్టర్లు కూడా పరీక్షలు చేయించుకున్నారని, ఎవరికీ పాజిటివ్ రాలేదని వైద్య వర్గాలు తెలిపాయి.

నేరుగా సమీక్షలకు స్వస్తి...

రాష్ట్రంలో కరోనా విజృంభించడంతో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నేరుగా, అందరూ ఒకేచోట ఉండి పలుమార్లు సమీక్షలు చేయడాన్ని నిలిపివేసినట్లు సమాచారం. గంటల తరబడి ఒకేచోట ఏసీ గదుల్లో ఉండి సమీక్షలు, సమావేశాలు నిర్వహించడం వల్ల సమస్యలు వస్తాయని, వైరస్ వ్యాప్తి జరుగుతుందని ఈ నిర్ణయం తీసుకున్నారు. అత్యవసరమైతేనే నేరుగా సమీక్షలు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. అయితే టెలికాన్ఫరెన్స్, ల్యాప్‌ట్యాప్‌ల్లో వీడియో కాల్ ద్వారా నిత్యం అందుబాటులో ఉండేలా, సమీక్షలు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. ఒకవేళ నేరుగా సమీక్షలు, సమావేశాలు నిర్వహించాల్సి వస్తే గాలి, వెలుతురు అధికంగా ఉండే గదుల్లోనే చేయాలని భావిస్తున్నారు. ఇకపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ కూడా విలేకరుల సమావేశాలను తక్కువగా నిర్వహించాలని నిర్ణయించారు. అవసరమైతే ప్రకటన జారీచేయాలని, వీడియో తీసి ఎలక్ట్రానిక్ మీడియాకు పంపించాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఉన్నతస్థాయి వైద్య నిపుణులు సూచనల మేరకే ఈ నిర్ణయాలు తీసుకున్నారు.

మూడో తారీఖున ఉద్యోగులకు జీతం

▶ మొదటి పేజీ తరువాయి

సాయంగా ఒకరోజు వేతనాన్ని సీఎం సహాయ నిధికి విరాళం ఇస్తున్నట్లు ఉద్యోగ సంఘాలు పేర్కొన్నాయి. ఈ మేరకు ఉద్యోగుల వేతనాల నుంచి ఒకరోజు మూలవేతనాన్ని మినహాయించుకోవాల్సి ఉండగా, ఇంతవరకు ఉత్తర్వులు రాలేదు. ఈ నేపథ్యంలో ఏప్రిల్‌లో చెల్లించే మార్చి నెల జీతంలో ఒకరోజు మూల వేతనాన్ని కోతపెట్టాల్సిన అవసరం లేదని రాష్ట్ర ఆర్థిక శాఖ ట్రెజరీలకు సూచించింది. వేతనాల్లో కోతను ఎత్తేసిన తర్వాత ఒకరోజు వేతనాన్ని ప్రభుత్వం మినహాయించుకోనుంది.

అప్పటివరకు 'వాయిదా'అమలు..

కాగా, ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మున్సిపల్ కార్పొరేషన్ల చైర్మన్లు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల వేతనాల్లో 75 శాతం, ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి అఖిల భారత సర్వీసు అధికారుల వేతనాల్లో 60 శాతం, 4వ తరగతి మినహా ఇతర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలను 50 శాతం, 4వ తరగతి, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల్లో 10 శాతం వేతనాన్ని వాయిదా వేయనున్నట్లు రాష్ట్ర ఆర్థిక శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కేటగిరీల వారీగా రిటైర్డు ఉద్యోగుల పెన్షన్లను సైతం ఇలాగే వాయిదా వేయాలని కోరింది. ప్రభుత్వరంగ సంస్థలు, ఎయిడెడ్ సంస్థల ఉద్యోగులు, పెన్షనర్ల వేతనాలనూ ఇదే రీతిలో వాయిదా వేయాలని సూచించింది. తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు ఈ మేరకు వేతనాల్లోని కొంతభాగాన్ని వాయిదా వేస్తున్నట్లు తెలిపింది.

వైద్య, పోలీస్, పారిశుధ్య ఉద్యోగులకు పూర్తి జీతం

కరోనా వైరస్ నియంత్రణకు రాత్రింబవళ్లు కష్టపడుతున్న వైద్య, పోలీస్, పారిశుధ్య ఉద్యోగులు, సిబ్బందికి వేతనాల్లో కోతల్లేకుండా పూర్తిస్థాయిలో వేతనాలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు ఉద్యోగవర్గాల్లో చర్చ జరుగుతోంది. దీనికి సంబంధించి ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉందని సచివాలయ వర్గాలు తెలిపాయి.

ఆపరేషన్ 'ఢిల్లీ రిటర్న్'

ప్రార్థనల్లో పాల్గొన్న వారి గుర్తింపునకు టాస్క్‌ఫోర్స్ | అన్ని జిల్లాలలోనూ ప్రత్యేక పోలీసు బృందాలు | ఢిల్లీ వెళ్లిన వారి సెల్‌ఫోన్లు స్వాధీనం, క్వారంటైన్లకు తరలింపు | ఎక్కడెక్కడ తిరిగారో గూగుల్ మ్యాప్‌తో శోధన

సాక్షి, హైదరాబాద్

ఢిల్లీ నిజాముద్దీన్‌లో జరిగిన తబ్లిగీ జమాత్ ప్రార్థనల్లో పాల్గొని తిరిగొచ్చిన వారిలో ఆరుగురు మరణించారు. అందులోనూ ఐదుగురు ఒకేరోజు మరణించడంతో తెలంగాణ పోలీసులు అప్రమత్తమయ్యారు. సోమవారం అర్ధరాత్రి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో డీజీపీ మహేందర్‌రెడ్డి భేటీ అయ్యారు. అనంతరం అన్ని జిల్లాల ఎస్పీలు, కమిషనర్లతో డీజీపీ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఢిల్లీకి వెళ్లొచ్చిన వారిలో చాలామంది కరోనా బాధితులుండే అవకాశాలు ఉండటంతో వారి ఆచూకీ కనిపెట్టేందుకు రాత్రికి రాత్రి స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. దీంతో అర్ధరాత్రి విధుల్లో ఉన్న పోలీసుల్లో కొందరిని ప్రత్యేక బృందాలుగా విడిదీసి, గాలింపు తీవ్రతరం చేశారు. వైద్యారోగ్య శాఖతో కలిసి పోలీసులు చేపట్టిన ఈ ఆపరేషన్‌ను జిల్లా పోలీసు ఉన్నతాధికారులు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.



మంగళవారం ఉదయానికే అన్ని జిల్లాల్లోని మతపెద్దలతో పోలీసులు సమావేశమయ్యారు. పరిస్థితి తీవ్రతను తెలిపి, ఎవరెవరు ఢిల్లీ వెళ్లారో తెలుసుకునేందుకు యత్నించారు. వెయ్యి మందికిపైగానే ఉంటారన్న అంచనాకు వచ్చారు.

గూగుల్ మ్యాప్ సాయంతో..

ఆచూకీ లభించిన వ్యక్తులతో పాటు వారి కుటుంబ సభ్యులు, సన్నిహితంగా మెలిగిన వారినీ క్వారంటైన్‌కు పంపుతున్నారు. వీరి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని, గూగుల్ మ్యాప్స్ ద్వారా వారు ఢిల్లీ వెళ్లొచ్చాక ఎక్కడెక్కడ తిరిగారో వెతికే పనిలో పడ్డారు. గూగుల్ మ్యాప్‌లో ఉన్న ఈ సదుపాయం ఆధారంగా ఒక వ్యక్తి రోజూ ఏం చేశాడు? ఎక్కడెక్కడ తిరిగాడు? తదితర సమాచారమంతా క్లియర్‌గా మ్యాప్‌లో కనిపిస్తుంది. దీని ఆధారంగా పోలీసులు మిగిలిన వారిని అప్రమత్తం చేసే పనిలోపడ్డారు.

60% మంది హైదరాబాద్ పరిసరాల్లోనే..

ఢిల్లీ వెళ్లొచ్చిన వారి సంఖ్యపై మధ్యాహ్నానికి పోలీసు, ఆరోగ్య శాఖలు ఒక నిర్ధారణకు వచ్చాయి. జిల్లాల వారీగా.. వెయ్యిమందికిపైనే ఉండొచ్చని అంచనా. వీరిలో 60 శాతం మంది హైదరాబాద్ పరిసరాలకు చెందిన వారేనని గుర్తించారు. తాజాగా మంగళవారం ఉదయం ఢిల్లీ నుంచి ప్రార్థనలకు హాజరై వస్తున్న 32 మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని క్వారంటైన్‌కు తరలించారని సమాచారం. తెలంగాణ నుంచి ఈ ప్రార్థనలకు హాజరైన వారి సంఖ్య ఇంకా ఎక్కువే ఉండొచ్చనే అనుమానాలున్నాయి. వీరంతా రైలు, రోడ్డు, విమాన సర్వీసుల్లో తిరిగి వచ్చారు. పైగా అందరూ ఒకేరోజు రాలేదు. తిరుగు ప్రయాణంలో వీరి ద్వారా ఎంతమందికి సంక్రమించి ఉంటుందన్నది ఆందోళన కలిగిస్తోంది.

లక్షణాలున్న వారు ముందుకురండి..

విదేశాలకు లేదా ఢిల్లీ వెళ్లి వచ్చిన వారు, కరోనా లక్షణాలు ఉన్నవారు స్వచ్ఛందంగా ముందుకు రావాలని డీజీపీ కార్యాలయం మంగళవారం మరోసారి విజ్ఞప్తి చేసింది. తబ్లిగీ జమాత్ కోసం ఢిల్లీకి వెళ్లొచ్చిన వారి కోసం గాలిస్తున్నామని, అటువంటి వారంతా స్వచ్ఛందంగా ముందుకు రావాలని, తద్వారా ఎంతో మేలుచేసిన వారవుతారని తెలిపింది. నేరుగా సమాచారం అందించలేని వారు, హెల్ప్‌లైన్ నంబరు 104, డయల్ 100 లేదా సోషల్ మీడియా ద్వారానైనా తెలపాలని కోరింది.

'ఢిల్లీ'అనుమానితులకు గాంధీలో వైద్యపరీక్షలు

గాంధీఆస్పత్రి: ఢిల్లీలో జరిగిన మత ప్రార్థనలకు వెళ్లి తిరిగి నగరానికి చేరుకున్న వారికి గాంధీ ఆస్పత్రిలో మంగళవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. జీహెచ్ఎంసీ పరిధి, మిగతా జిల్లాల నుంచి 1,030 మంది ప్రార్థనలకు వెళ్లినట్టు గుర్తించిన వారితోపాటు వారి కుటుంబసభ్యులను పోలీసులు, జీహెచ్ఎంసీ యంత్రాంగం గాంధీ ఆస్పత్రికి తరలించారు. గాంధీ ఓపీ విభాగంలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి 250 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. కరోనా లక్షణాలు గల 117 మందిని ఐసోలేషన్ వార్డుకు తరలించారు. మిగిలిన వారి వివరాలు సేకరించి హోం క్వారన్‌టైన్‌లో ఉండాలని సూచించారు. బుధవ

సీఎంఆర్ఎఫ్‌కు విరాళాలు పంపాలనుకుంటున్నారా?

- బ్యాంకు ఖాతా లేదా ఆన్‌లైన్ ద్వారా పంపవచ్చు
- వివరాలు వెల్లడించిన ముఖ్యమంత్రి కార్యాలయం

CM RELIEF FUND,
TELANGANA STATE,
Account No. 62354157651,
IFSC code: SBIN0020077
Current Account,
SBI, Secretariat Branch
Hyderabad.

లేకుంటే ఈ కింద పేర్కొన్న లింక్ ద్వారా మీ-సేవ వెబ్‌సైట్‌ను తెరిచి సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఆన్‌లైన్‌లో విరాళాలు పంపించవచ్చు. ఈ మేరకు రాష్ట్ర ఐటీ శాఖ ఏర్పాట్లు చేసింది. https://ts.meeseva.telangana.gov.in/Covid/CovidContribution.htm

సాక్షి, హైదరాబాద్: కరోనా వైరస్ నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు మీ వంతు సహకారం అందించాలని అనుకుంటున్నారా? చిన్న మొత్తం పెద్ద మొత్తం అనే తేడా లేకుండా మీకు తోచినంతగా విరాళాలు అందించి అండగా నిలవాలని భావిస్తున్నారా? అయితే సులువుగా మీరు రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళాలు పంపవచ్చు. ఈ కింద పేర్కొన్న సీఎం సహాయ నిధి బ్యాంకు ఖాతా (కరెంట్ అకౌంట్)కు మీరు డిపాజిట్/ట్రాన్స్‌ఫర్/చెక్కుల ద్వారా డబ్బులు పంపవచ్చని ముఖ్యమంత్రి కార్యాలయం తెలియజేసింది.

సీఎం సహాయనిధికి రూ.8.72 కోట్లు

కేటీఆర్‌కు విరాళాల చెక్కులు అందజేసిన దాతలు

సాక్షి, హైదరాబాద్: కరోనా కట్టడికి తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి మంగళవారం రూ. 8.72 కోట్ల విరాళం అందింది. పలువురు దాతలు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌ను ప్రగతిభవన్‌లో కలిసి విరాళాల చెక్కులు అందజేశారు. సమాజం ఆపదలో ఉన్న సమయంలో ప్రభుత్వానికి సహకరించేందుకు ముందుకు వచ్చిన సంస్థలు, దాతలకు కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. దివీస్ లేబొరేటరీస్ రూ. 5 కోట్లు, గ్రాన్యూల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, విర్చో పెట్రో కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కోటి రూపాయల చొప్పున విరాళం అందజేశాయి. ఐఆర్ఏ రియల్టీ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్, సుచిర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రూ 25 లక్షల చొప్పున విరాళం ఇచ్చాయి. ఎంజీబీ కమోడిటీస్ ప్రైవేట్ లిమిటెడ్, మానవీయ డెవలప్‌మెంట్ అండ్ ఫైనాన్స్ లిమిటెడ్ రూ. 20 లక్షలు చొప్పున అందజేశాయి. మాధవరం కన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్, సింథోకెమ్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఓషన్ స్పార్కిల్స్ ప్రైవేట్ లిమిటెడ్, భూపతిరాజు హెల్పింగ్ హ్యాండ్స్, మిరియాల చిన్న రాఘవరావు రూ.10 లక్షలు చొప్పున సీఎం సహాయనిధికి విరాళాలు అందించారు. వీరితో పాటు మహేశ్వరి మైనింగ్ అండ్ ఎనర్జీ రూ.5 లక్షలు, నిఖిల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రూ. 2 లక్షల చెక్కులను మంత్రి కేటీఆర్‌కు అందజేశాయి.

14 వరకు మద్యం దుకాణాలు బంద్

ఉత్తర్వులు జారీ చేసిన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ

సాక్షి, హైదరాబాద్: ఈనెల 14 వరకు అన్ని మద్యం దుకాణాలను మూసి ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. 14 వరకు రాష్ట్రంలోని అన్ని వైన్‌షాపులు, బార్లు మూసి ఉంచాలని, ఈ విషయంలో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలుంటాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వాస్తవానికి, గతంలో సీఎం కేసీఆర్ ప్రకటించిన విధంగా మద్యం దుకాణాల మూసివేత గడువు మంగళవారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో మళ్లీ మద్యం దుకాణాలు తెరుస్తారని, అమ్మకాలకు కొంత వెసులుబాటు కల్పిస్తున్నారనే ప్రచారం జరిగింది. ఈ ఊహాగానాలకు తెరదించుతూ ఈనెల 14 వరకు రాష్ట్రంలోని అన్ని మద్యం దుకాణాలను మూసే ఉంచాలని ఎక్సైజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

504 ప్రాంతాల్లో మొబైల్ రైతు బజార్లు

వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: 254 వాహనాలతో 504 ప్రాంతాలలో జంట నగరాల్లోని ప్రజలకు మొబైల్ రైతుబజార్ల ద్వారా కూరగాయలు, పండ్లు అందుబాటులో ఉంచినట్లు వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కూరగాయలు కావాల్సిన కాలనీలు, అపార్ట్‌మెంట్ల వాసులు మొబైల్ రైతు బజార్లు నిర్వహించాలనుకునే యువకులు, ఉత్సాహవంతులు 7330733212 నంబర్‌కు వాట్సాప్ లేదా ఫోన్‌కాల్ ద్వారా సంప్రదించాలని పేర్కొన్నారు.

ఆన్‌లైన్‌లో జేఈఈ ప్రిపరేషన్ పాఠాలు

అందుబాటులోకి తెచ్చిన ఐఐటీ ఖరగ్‌పూర్

సాక్షి, హైదరాబాద్: కరోనా నేపథ్యంలో జేఈఈ మెయిన్, జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు ప్రిపేర్ అయ్యే విద్యార్థులు పరీక్షలకు సిద్ధమయ్యేందుకు పలు మాడ్యూల్స్, నోట్స్‌ను ఐఐటీ ఖరగ్‌పూర్ సిద్ధం చేసింది. విద్యార్థులు ఇళ్లలోనే ఉండి వాటిని చదువుకునే లా నేషనల్ డిజిటల్ లైబ్రరీలో అందుబాటులోకి తీసుకువచ్చింది. ఏప్రిల్ 5, 7, 9, 11 తేదీల్లో నిర్వహించాల్సిన జేఈఈ మెయిన్‌ను ఇప్పటికే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) వాయిదా వేయగా మే 17న నిర్వహించాల్సిన జేఈఈ అడ్వాన్స్‌డ్‌నూ వాయిదా వేసేందుకు ఐఐటీల కౌన్సిల్ ఆలోచనలు చేస్తోంది. ఆయా పరీక్షలను తిరిగి మే నెలాఖరులో లేదా జూన్‌లో నిర్వహించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో విద్యార్థులు పరీక్షల కోసం సిద్ధం అయ్యేందుకు రూపొందించిన పాఠాలు, నోట్స్‌ను నేషనల్ డిజిటల్ లైబ్రరీ, ఐఐటీ ఖరగ్‌పూర్ వెబ్‌సైట్‌లలో (https://ndl.gov.in, https://ndl.iitkgp.ac.in) అందుబాటులో ఉంచినట్లు ఐఐటీ ఖరగ్‌పూర్ వెల్లడించింది. ఆయా వెబ్‌సైట్‌లలో కరోనా ఔట్ బ్రేక్: స్టడీ ఫ్రమ్ హోం సెక్షన్ నుంచి విద్యార్థులు ఈ పాఠాలను చదువుకోవచ్చని వెల్లడించింది. అందులో గత ఐదేళ్ల ప్రశ్నాపత్రాలను, వాటి జవాబులను కూడా త్వరలోనే నిపుణులతో మాట్లాడి అందుబాటులో ఉంచనున్నట్లు వివరించింది.

గ్రామాల్లో బయటికొస్తే వడ్డింపే..

లాక్‌డౌన్ ఉల్లంఘనులకు 'ఫైన్' వేస్తున్న గ్రామపెద్దలు

సాక్షి, హైదరాబాద్: కరోనా కట్టడయ్యేవరకు ప్రతీ గ్రామ బాధ్యతను ఆయా గ్రామాల సర్పంచ్‌లే తీసుకోవాలని సీఎం కేసీఆర్ ఇచ్చిన పిలుపుతో సర్పంచ్‌లు చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా బయట తిరుగుతున్నవారికి జరిమానాలు విధిస్తూ లాక్‌డౌన్‌ను విజయవంతం చేయడంలో తమవంతు పాత్ర పోషిస్తున్నారు. గ్రామం నుంచి ప్రజలెవరూ బయటకు రావొద్దని సర్పంచ్‌లు దండోరా వేయించారు. గ్రామాల్లోకి రానివ్వకుండా కొమ్ములు, కందకాలు తవ్వారు. కొందరు ఇవేమీ పట్టించుకోకుండా బయట యథేచ్ఛగా తిరుగుతున్నారు. ఇలాంటి లాక్‌డౌన్ ఉల్లంఘనులపై చర్యలు తీసుకుంటే బాగుంటుందని గ్రామ సభల్లో తీర్మానిస్తున్నారు. ప్రజల బాగుకోసం ఏదైనా చేయడానికి వెనకాడొద్దని గ్రామ పెద్దలు చెబుతున్నారు. గ్రామ నిర్ణయానికి విరుద్ధంగా ఎవరైనా బయటకొస్తే రూ. 500 ఫైన్ వేస్తున్నారు. బయటి నుంచి గ్రామంలోకి ఎవరినీ రానివ్వనపుడు, మనం బయటకు వెళ్తే ఎలా అని పెద్దలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అండగా ఉంటాం

వలస కార్మికులకు మంత్రి హరీశ్‌రావు భరోసా

గజ్వేల్/జోగిపేట/సిద్దిపేటజోన్: రాష్ట్రంలో 4 లక్షల మంది వలస కార్మికులు ఉన్నారని, వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు భరోసా ఇచ్చారు. మంగళవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముట్రాజ్‌పల్లిలో వలస కార్మిక కుటుంబాలకు బియ్యం, రూ. 500 నగదు అందజేశారు. అలాగే జోగిపేటలో అధికారులతో సమీక్షించారు. సిద్దిపేటలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. కార్మికులు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా 100 నంబరుకు డయల్ చేస్తే అధికారులు సాయం చేస్తారని చెప్పారు. కరోనా వ్యాప్తి చెందుతున్న తరుణంలో ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణ పాటించాలని సూచించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడి ప్రాజెక్టుల్లో పని చేస్తున్న వలస కార్మికులంతా తమ ఆత్మీయులేనని, వారిని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని మంత్రి చెప్పారు. ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు.

సిద్దిపేటలో వలస కార్మికులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న మంత్రి హరీశ్‌రావు

సరుకుల పంపిణీ సందర్భంగా 'భౌతిక దూరం' పాటించిన వలస కార్మికులు

మర్కజ్ @ 1,030

▶ మొదటి పేజీ తరువాయి

ఉద్యోగులు, అధికారులు షాక్‌కు గురయ్యారు.

అత్యధికులు హైదరాబాద్ వారే..

ఢిల్లీ నిజాముద్దీన్ ప్రాంతంలోని మర్కజ్ మసీదు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ నెల 13 నుంచి 15 వరకు అక్కడ జరిగిన ప్రార్థనలకు వెళ్లినవారిలో కొందరికి కరోనా పాజిటివ్ అని తేలింది. అక్కడికి తెలంగాణకు చెందినవారు 1,030 మంది వెళ్లగా, వారిలో హైదరాబాద్ జీహెచ్ఎంసీ పరిధికి చెందిన వారు 603 మంది ఉన్నట్టు వైద్య ఆరోగ్యశాఖ వెల్లడించింది. నిజామాబాద్ (80), నల్లగొండ (45), వరంగల్ అర్బన్ (38), ఆదిలాబాద్ (30), ఖమ్మం (27), నిర్మల్ (25), సంగారెడ్డి (22) జిల్లాలతో పాటు మిగిలిన జిల్లాల నుంచీ పలువురు ప్రార్థనలకు వెళ్లినట్టు ఆరోగ్యశాఖ నివేదికలో పేర్కొన్నారు. అక్కడి నుంచి వచ్చిన వారిలో ఆరుగురు చనిపోవడం కరోనా తీవ్రతను తెలియజేస్తోంది.

జల్లెడపడుతున్న నిఘా బృందాలు

ఢిల్లీ వెళ్లొచ్చిన వారిని పట్టుకోవడం ఇప్పుడు ప్రభుత్వానికి సవాల్‌గా మారింది. ఇందులో 3 సమస్యలున్నాయి. ఢిల్లీ వెళ్లిన వారందరినీ గుర్తించి ఐసోలేషన్‌కు తరలించి పరీక్షలు నిర్వహించడం, వారితో కాంటాక్ట్ అయిన 10వేల మందిని గుర్తించడం, వారిలోనూ లక్షణాలున్న వారిని గుర్తించి పట్టుకోవడం. ఇంకా వీరి ద్వారా ఇంకెంతమంది కాంటాక్ట్ అయ్యారన్న దానిపైనా చర్చ జరుగుతోంది. వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు ఇప్పటికే సర్వైలెన్స్ టీమ్‌ల ద్వారా ఢిల్లీ వెళ్లొచ్చిన వారిలో 70 శాతం మందిని గుర్తించి పట్టుకున్నారని అధికారులు చెబుతున్నారు. మరో 30 శాతం మందిని గుర్తించే పనిలో ఉన్నారు. ఇక వారెక్కడెక్కడకు వెళ్లారు? వారితో కాంటాక్ట్ అయిన 10 వేల మందిని గుర్తించడం కీలకంగా మారింది. హైదరాబాద్‌లో ఇప్పటికే 200 బృందాలు, అన్ని జిల్లాల కలెక్టర్లు ఇదే పనిలో ఉన్నారు.

మార్చి 18 నుంచే రంగంలోకి..

రాష్ట్రానికి వచ్చిన ఇండోనేసియా బృందానికి కరోనా పాజిటివ్ వచ్చినట్టు మార్చి 18న గుర్తించారు. అప్పుడే ప్రభుత్వం అప్రమత్తమైంది. ఢిల్లీలో వారు దిగినప్పుడు ఎటువంటి లక్షణాలు కనిపించలేదు. ఢిల్లీలోని ప్రార్థన మందిరానికి వెళ్లొచ్చాకే వారిలో లక్షణాలు బయటపడ్డాయి. దాని ఆధారంగా తీగ లాగితే డొంక కదిలింది. నాటి నుంచి ఇంటెలిజెన్స్ వర్గాలు ప్రతి జిల్లాను జల్లెడ పట్టాయి. ఢిల్లీ వెళ్లొచ్చిన వారి జాడను కనుగొన్నాయి. మార్చి 21న కేంద్రం కూడా ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని అలర్ట్ చేసింది. కాగా, ఇప్పటికే గుర్తించిన వారందర్నీ ఆయా జిల్లాల్లోని ఐసోలేషన్ కేంద్రాలకు తరలించారు. లక్షణాలున్న వారికి కరోనా పరీక్షలు నిర్వహిస్తున్నారు. వారి కుటుంబాలను కూడా క్వారంటైన్‌లో ఉంచారు. అవసరమైతే వారికీ కరోనా పరీక్షలు నిర్వహించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా ఢిల్లీ వెళ్లొచ్చిన వారి కుటుంబాల నుంచి ఇతరులకు ఇన్‌ఫెక్ట్ కాకుండా దృష్టిపెట్టారు.

మూడో దశలోకి వెళ్లినట్టేనా!

మొదట్లో విదేశాల నుంచి వచ్చిన వారితోనే సమస్య నెలకొందని భావించిన సర్కారు, ఇప్పుడు ఢిల్లీ వెళ్లొచ్చిన వారితో తలలు పట్టుకుంటోంది. ఈ 1,030 మంది ఇంకెందరిని కలిసి ఉంటారనేది వైద్యాధికారులను ఆందోళనకు గురిచేస్తోంది. మొదటి కరోనా కేసుగా నమోదైన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ 86 మందితో క్లోజ్‌గా ఉన్నా, ఎవరికీ పాజిటివ్ రాలేదు. బయటి నుంచి వచ్చిన పాజిటివ్ కేసులు, వారి ద్వారా అంటించుకున్న వారు ఆరోగ్యంగానే ఉన్నారు. కానీ ఢిల్లీ వెళ్లొచ్చిన వారిలో 20 మందికి సోకడం, వారిలో ఆరుగురు చనిపోవడంతో వైరస్ జన సమూహంలోకి ఏ మేరకు వెళ్లిందోననేది వైద్య, ఆరోగ్యశాఖ వర్గాల్లో వణుకు పుట్టిస్తోంది. ఇలా వైరస్ జన సమూహంలోకి పోవడాన్నే కరోనా మూడో దశగా వైద్యాధికారులు చెబుతున్నారు. ఈ దశలో బాధితుల్ని గుర్తించడం కష్టంగా మారుతుందని అంటున్నారు.

బంజారాహిల్స్‌లో ఓ వాహనదారుడిని హెచ్చరిస్తున్న ట్రాఫిక్ పోలీస్

3 కోట్ల మందికి డీజీపీ సందేశం

సాక్షి, హైదరాబాద్: ''ఇప్పటి వరకూ లాక్‌డౌన్‌కు సహకరించిన తెలంగాణ ప్రజలకు ధన్యవాదాలు. మరో 15 రోజులపాటు ఇలాగే సహకరించి ఇదే స్ఫూర్తి కొనసాగించండి. స్వీయ నియంత్రణతో మన కుటుంబాలను, రాష్ట్రాన్ని కరోనా బారిన పడకుండా కాపాడుకుందాం''అంటూ సాగే సందేశాన్ని తెలంగాణ వ్యాప్తంగా మూడుకోట్ల మంది మొబైల్ ఫోన్లకు చేరవేసినట్లు డీజీపీ కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది.

కేసుల కొరడా!

- లాక్‌డౌన్‌ను లైట్ తీసుకుంటున్న పౌరులు
- ఉల్లంఘించిన 3,359 మందిపై కేసుల నమోదు
- 16,360 వాహనాల సీజ్, రూ.75 లక్షల చలానాలు

సాక్షి, హైదరాబాద్: కరోనా వైరస్ కట్టడికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన లాక్‌డౌన్‌ను ఉల్లంఘించిన వారిపై పోలీసులు కేసుల కొరడా ఝుళిపిస్తున్నారు. గత ఆదివారం జనతా కర్ఫ్యూ తర్వాత ఎపిడమిక్ డిసీసెస్ యాక్ట్ 1897ను ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చింది. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే కేసు పెడతామని హెచ్చరించింది. ప్రాణాలు తీసే మహమ్మారి పొంచి ఉందన్న ప్రచారాన్ని కొంతమంది పట్టించుకోవడం లేదు. నిత్యావసరాలు, అత్యవసరాల పేరిట అకారణంగా నిబంధనలను ఉల్లంఘిస్తూ రోడ్ల మీదకు వస్తున్నారు. దీంతో పోలీసులు కేసుల కొరడా బయటికి తీశారు. దొరికిన వారిని దొరికినట్లుగా కేసులు నమోదు చేస్తున్నారు. సీసీ కెమెరాల సాయంతోనూ పలు కేసులు నమోదు చేస్తుండటం గమనార్హం.

కేసుల వివరాలు ఇవీ..

సోమవారం నుంచి మంగళవారం వరకు తొమ్మిది రోజుల్లో అకారణంగా బయటికి వచ్చిన వారి సంఖ్య అధికంగానే ఉంది. ఇందులో నిబంధనలకు విరుద్ధంగా వ్యాధి ఉన్న విషయాన్ని బయటికి వెల్లడించకుండా, విదేశాల నుంచి వచ్చి హోంక్వారంటైన్‌లో ఉండని వారు కూడా ఉన్నారు. ఇటీవల క్వారంటైన్ నిబంధనలు పాటించకుండా పలు వేడుకలు, విందులకు హాజరై కొత్తగూడెంకు చెందిన పోలీసు ఉన్నతాధికారి, అతని కుమారుడు కూడా ఉండటం గమనార్హం. ఈ కేసుల్లో ఎక్కువగా ఐపీసీ సెక్షన్ 188, 269, 270 లే ఉండటం గమనార్హం.

అకారణంగా బయటికి వస్తూ..లాక్‌డౌన్ నిబంధనలను ఉల్లంఘిస్తున్న పలు వాహనాలను ఆటోమేటిక్ నంబర్‌ప్లేట్ రికగ్నిషన్ (ఏఎన్‌పీఆర్) ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత ద్వారా గుర్తిస్తున్న సంగతి తెలిసిందే. ఈ కేసుల్లో హైదరాబాద్ కమిషనరేట్ ముందంజలో ఉంది. గత సోమవారం నుంచి ఈ వివరాలను పరిశీలించగా.. సీసీ కెమెరాల ద్వారా గుర్తించి ఫైన్ వేసే వాహనాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ప్రారంభంలో రోజుకు ఆరువేల నుంచి మొదలు కాగా, 30వ తేదీ వరకు ప్రతీరోజు ఈ సంఖ్య 10 వేలను అధిగమించడం విశేషం. ఈ లెక్కన రాజధానిలోనే దాదాపు లక్ష వరకు చలానాలు వేయగా..మిగిలిన జిల్లాలు, కమిషనరేట్లలో ఈ సంఖ్య రెట్టింపు సంఖ్యలో ఉంటుందని పోలీసు అధికారులు చెబుతున్నారు.

కేసుల నమోదు ఇలా..

నమోదు చేసిన కేసులు:	3,359
పోలీసులు సీజ్ చేసిన వాహనాలు:	16,360
నమోదైన ఎఫ్.ఐ.ఆర్‌లు:	1,572
అరెస్టయినవారు:	1,790
విధించిన చలానాలు:	రూ.75 లక్షలు
అధికంగా హైదరాబాద్‌లోనే..	

ఉద్యోగాలు ఊడుతున్నాయ్!

▶ మొదటి పేజీ తరువాయి

కాలిఫోర్నియా టైమ్స్ ప్రచురించింది.

ఫుల్‌టైమ్ ఉద్యోగులకూ లేని గ్యారంటీ

అమెరికాలోని పలు కంపెనీల్లో పనిచేస్తున్న ఫుల్‌టైం ఉద్యోగులకూ ఉద్యోగ భద్రత ఉండకపోవచ్చని స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ సోషియాలజీ విభాగం ప్రొఫెసర్ డేనియల్ ఎ. మెక్‌ఫార్లాండ్ అభిప్రాయపడ్డారు. న్యూయార్క్‌కు చెందిన బ్లూమ్‌బర్గ్, బ్యాంక్ ఆఫ్ అమెరికా వంటి అత్యంత పటిష్టమైన సంస్థలు ఇప్పుడు లే ఆఫ్‌ల విషయంలో దృష్టి సారిస్తున్నాయని పేర్కొన్నారు. అయితే, మెజారిటీ భారతీయులు ఇప్పుడు ఉద్యోగాల గురించి ఆలోచించట్లేదని, , కరోనా గండం నుంచి గట్టెక్కితే చాలని అనుకుంటున్నారని కాలిఫోర్నియా టైమ్స్ సూచించింది. దాదాపు వంద మంది భారతీయ ఐటీ నిపుణుల నుంచి ఈ పత్రిక అభిప్రాయాలు రాబట్టింది. వారిలో 67 మంది తమకు ఇప్పుడు ఉద్యోగాల కంటే కరోనా నుంచి బయటపడటమే ముఖ్యమని భావిస్తున్నారు. అమెరికా నుంచి బయటపడితే చాలని అనుకుంటున్నామని 17 మంది పేర్కొన్నారు. తమకు ఉద్యోగం పోయినా సరే 6 నెలలు ఇక్కడే ఉండటానికి వీలు కల్పిస్తే చాలని 16 మంది అభిప్రాయపడ్డారు. లే ఆఫ్‌లు (ఉద్యోగుల తొలగింపు) ఉండబోవని కాలిఫోర్నియా కేంద్రంగా పని చేస్తున్న ఫేస్‌బుక్, ఆపిల్, వాషింగ్టన్ (సియాటిల్) కేంద్రంగా ఉన్న మైక్రోసాఫ్ట్ ప్రకటించాయి. వచ్చే ఏడాది పాటు తమ వ్యాపార కార్యకలాపాలను దృష్టిలో ఉంచుకుని పరిమితంగా లే ఆఫ్ ప్రకటించే విషయాన్ని పరిశీలిస్తున్నామని గూగుల్, అమెజాన్ పేర్కొన్నాయి. కరోనా కారణంగా ప్రపంచవ్యాప్తంగా తమ కంపెనీ కార్యకలాపాల్లో కొంత మందగమనం ఏర్పడిందని అమెజాన్ అంటోంది. అయితే సీనియర్ ఉద్యోగుల స్థాయిలోనే (3 లక్షల డాలర్ల వార్షిక వేతనం దాటిన) లే ఆఫ్‌లు ఉండే అవకాశం ఉందని ఎకనామిక్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (ఈడీఏ) పేర్కొంది.

క్వారంటైన్ కష్టాలు..

▶ మొదటి పేజీ తరువాయి

చెబుతున్నారు. విదేశాల నుంచి వచ్చిన వారందరిలో ఈ వైరస్ లేదని, అయినా ముందు జాగ్రత్తగా మాత్రమే వారిని స్వీయ నిర్బంధంలో ఉంచామని, వారి పట్ల అమానుషంగా వ్యవహరించొద్దని విజ్ఞప్తి చేస్తున్నాయి. కరోనా వైరస్ సోకిన వారిని తాకినప్పుడు ఈ వైరస్ వస్తుందని, అది కూడా ఆ వ్యక్తి తన ముఖ భాగాలను చేతితో తాకితేనే శరీరంలోకి ప్రవేశిస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఎవరికి వారు వారి ఇళ్లల్లో ఉన్నా.. ఒకవేళ బయటకు వచ్చినా వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ చేతులు తరచూ కడుక్కున్నా.. తన ముఖ భాగాలను తాకకపోయినా ఈ వైరస్ శరీరంలోకి ప్రవేశించదన్న వాస్తవాన్ని గుర్తించాలని సూచిస్తున్నారు. క్వారంటైన్‌లో ఉన్న వారు తమ పరిసరాల్లో ఉన్నంత మాత్రాన భయపడాల్సిన పని లేదనే విషయాన్ని గ్రహించాలని కోరుతున్నారు. ఈ వైరస్ గాలి ద్వారా వ్యాపించేది కాదు కాబట్టి క్వారంటైన్‌లో ఉన్న వారు నివసించే ప్లాట్లు, ఇళ్ల తలుపులు తెరచి ఉన్నంత మాత్రాన ప్రమాదమేమీ లేదని వివరిస్తున్నారు. విదేశాల నుంచి వచ్చిన వారు క్వారంటైన్‌లో ఉండటంపై సమాజం అపోహలు తొలగించుకోవాలని, వారిలో ధైర్యం కల్పించినప్పుడే విదేశాల నుంచి వచ్చిన వారంతా ఇళ్లకు పరిమితమవుతారని, అప్పుడే ఈ వైరస్ నియంత్రణలోకి వస్తుందనే వాస్తవాన్ని మాత్రం విస్మరించొద్దని సూచిస్తున్నారు. రాష్ట్రంలో తొలి కరోనా వైరస్ బాధితుడు రామ్‌తేజ్ మన్ కీ బాత్‌లో ప్రధాని నరేంద్ర మోదీతో చెప్పిన విధంగా క్వారంటైన్ అంటే జైలు జీవితం కాదని, అలాంటి వివక్షను ఈ సమాజం విదేశాల నుంచి వచ్చిన వారికి ఇవ్వడం వల్ల వారు మరింత భయపడితే అసలుకే ఎసరు వస్తుందని గుర్తుంచుకోవాలి. అందుకే సాటి మనిషిని గౌరవించడం నేర్చుకోండి.. క్వారంటైన్‌లో ఉన్నవారినే కాదు కరోనా వైరస్ సోకిన వారిని కూడా అవమానించొద్దని చెబుతున్నారు.

అందుబాటులోకి మరిన్ని పోస్టాఫీసులు

- పోస్టల్ సేవలతోపాటు ఆసరా పింఛన్ల చెల్లింపు
- అత్యవసర వస్తువుల తరలింపునకు పోస్టల్ వ్యాన్లు సిద్ధం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా పోస్టాఫీసులు తెరుచుకుంటున్నాయి. మంగళవారం 633 డెలివరీ పోస్టాఫీసులు తెరుచుకోగా, బుధవారం నుంచి 4,967 బ్రాంచి తపాలా కార్యాలయాలు సేవలు ప్రారంభించబోతున్నాయి. డిపాజిట్స్, విత్‌డ్రాయల్స్ లాంటి సేవింగ్స్ బ్యాంక్ ఆపరేషన్స్ అందుబాటులో ఉంటాయి. వీటితో పాటు స్పీడ్‌పోస్టు, పార్శిల్ సర్వీసులు కూడా ప్రారంభమవుతాయి. లాక్‌డౌన్ నేపథ్యంలో వాహనాల రాకపోకలు లేనందున స్పీడ్ పోస్టులాంటి సేవల్లో జాప్యం జరుగుతుందన్న విషయాన్ని గుర్తించాలని తపాలా శాఖ పేర్కొంది. ఇప్పటికే లాక్‌డౌన్ సమయంలో 4,400 బ్యాగ్స్ పరిమాణంలో పోస్టల్ డెలివరీలు నిర్వహించగా, పదోతరగతి, ఇంటర్మీడియెట్‌కు సంబంధించి 5,525 పరీక్ష పత్రాల పార్శిళ్లను తరలించినట్టు పేర్కొంది. 22 లక్షల మంది ఆసరా లబ్ధిదారులకు పింఛన్ల చెల్లింపునకు ఏర్పాట్లు చేసినట్టు పేర్కొంది. 33 జిల్లాలకు 20 మెయిల్ మోటారు వాహనాల ద్వారా అత్యవసర మందులు, వైద్య పరికరాలను పంపిణీ చేస్తున్నట్టు పేర్కొంది. వలస కార్మికులు వంటి వారికి అవసరమైన సరుకులను కూడా పంపిణీ చేసేందుకు వాహనాలను సిద్ధంగా ఉంచామని పేర్కొంది. ఈ మేరకు ఇప్పటికే కొన్ని స్వచ్ఛంద సంస్థలతో ఒప్పందం చేసుకున్నట్టు వెల్లడించింది. కూరగాయలకు సంబంధించి మొబైల్ మార్కెట్లుగా వాటిని వాడేందుకు కూడా వ్యవసాయ శాఖతో ఒప్పందం చేసుకున్నట్టు వెల్లడించింది.

ఐసోలేషన్ గదులుగా రైలు కేబిన్లు

- రెండింటిని సిద్ధం చేసిన రైల్వే
- అవసరాన్ని బట్టి కొత్తవి ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కరోనా వైరస్ లక్షణాలతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతుండటంతో రైళ్లను ఐసోలేషన్, క్వారంటైన్ వార్డులుగా మార్చే ప్రక్రియ ప్రారంభమైంది. తొలుత లాలాగూడ వర్క్‌షాపులో ఓ రైలు బోగీలోని రెండు కేబిన్లను ఐసోలేషన్ గదులుగా మార్చారు. డిమాండ్ ఆధారంగా ఇలాంటి మరిన్ని కేబిన్లను రూపొందించనున్నట్టు రైల్వే అధికారులు పేర్కొన్నారు. కేబిన్‌లో అప్పర్, మిడిల్, సైడ్ బెర్తులను తొలగించి 2 లోయర్ బెర్తులను మాత్రమే ఉంచారు. ప్రత్యేకంగా లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. దోమలు రాకుండా కిటికీలకు మెష్‌లు ఏర్పాటు చేశారు. ఒకవైపు ఉన్న టాయిలెట్‌ను తొలగించి బాత్‌రూమ్‌గా మార్చారు.

నగరంలో ఢిల్లీ తరహా అల్లర్లకు కుట్ర

- ప్రార్థన స్థలంపై కిరోసిన్ బాంబులతో దాడి
- ఇద్దరు యువకుల్ని పట్టుకున్న టాస్క్‌ఫోర్స్

సాక్షి, హైదరాబాద్: సీఏఏ, ఎన్నార్సీలకు వ్యతిరేకంగా ఢిల్లీలో జరిగిన తరహాలో నగరంలోనూ అల్లర్లు సృష్టించడానికి ప్రయత్నించిన ఇద్దరు యువకుల్ని దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్ పట్టుకుంది. సిటీలో మత ఘర్షణలు రేపేందుకు వీరు ఓ ప్రార్థన స్థలంపై 3 కిరోసిన్ బాంబులు విసిరారు. అంతకుముందే రెండు ఏటీఎంలకు నిప్పుపెట్టగా, ఆర్టీసీ బస్సు దగ్ధానికి యత్నించారు. ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉన్న ఓ వివాదాస్పద వ్యక్తి ప్రసంగా

సాక్షి
బుధవారం, ఏప్రిల్, 1

అపాయంలో అమెరికా

కరోనా వైరస్‌తో రాగల ముప్పు గురించి ఎందరు హెచ్చరించినా మొదట్లో బేఖాతరు చేసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్వాకానికి ఆ దేశం భారీ మూల్యం చెల్లించుకోవాల్సిన స్థితిలో పడింది. లక్ష నుంచి 2 లక్షలమంది వరకూ ఈ వ్యాధికి బలయ్యే ప్రమాదం వున్నదని 'చావు కబురు' చల్లగా చెప్పినట్టు ఆయన ఇప్పుడు ప్రకటిస్తున్నారు. సరిగ్గా నెలక్రితం ఆయన కరోనా ప్రమాదం గురించి కొట్టిపడేశారు. మార్చి 3న ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ వ్యాధి గురించి హెచ్చరిస్తూ, దీని బారిన పడినవారిలో 3.4 శాతం మంది బలయ్యే అవకాశం వున్నదని తెలిపింది. కానీ ట్రంప్ అదంతా అబద్ధమని తోసిపుచ్చారు. మరణాల రేటు మహావుంటే ఒక శాతం ఉండొచ్చునని వాదించారు. అతిగా అంచనాలు వేసి భయపెట్టొద్దని సలహా కూడా ఇచ్చారు. ఇన్నాళ్లకు ఆయనకు జ్ఞానోదయమైంది. ఇందుకు వైద్య రంగ నిపుణుల్ని, శాస్త్రవేత్తల్ని మొదటగా అభినందించాలి. నెలరోజులుగా వారు ఎంతో శ్రమపడితే తప్ప ట్రంప్ ఈ స్థాయికి వచ్చివుండరని ఆయన మొండివైఖరి గురించి తెలిసినవారందరికీ అర్థమవుతుంది. ప్రమాద తీవ్రతను అంగీకరించిన ఈ సమయంలో కూడా 'ఇంత తక్కువ మరణాలు' తన ప్రభుత్వం తీసుకునే చర్యలవల్లేనని ట్రంప్ చెప్పుకున్నారు. మృతుల సంఖ్య ఒకేరోజు 500 దాటాక తన ప్రథమ ప్రాధాన్యత కరోనాయేనని, ఆర్థిక వ్యవస్థ ఆ తర్వాతే వస్తుందని తెలిపారు. కొన్ని రోజులు వెనక్కి వెళ్లి చూస్తే ట్రంప్ దీనికి విరుద్ధమైన ప్రకటనలు చేశారు. కరోనా వ్యాధి పెద్ద సమస్యకాదని, ఆర్థిక వ్యవస్థ సక్రమంగా నడపడమే తన కర్తవ్యమని ఆయన చెప్పిన సంగతి ఎవరూ మరిచిపోరు. సరిగదా... చాలా త్వరలోనే ఈ వ్యాధికి వ్యాక్సిన్ రాబోతోందని కూడా ట్రంప్ మార్చి 7న భరోసా ఇచ్చారు. మంగళవారం నాటికి ప్రపంచవ్యాప్తంగా కరోనా వ్యాధిగ్రస్తుల సంఖ్య 8,00,000 దాటి ముందుకుపోగా, ఇందులో ఒక్క అమెరికాలోనే 1,65,000 మంది వున్నారు. ట్రంప్ నిలకడలేని ప్రకటనలు అమెరికా ప్రజల్ని భ్రమల్లో ముంచెత్తాయి. ఆయన మాటలతో సంబంధం లేకుండా వివిధ రాష్ట్రాలు ముందు జాగ్రత్త చర్యలు అమల్లోకి తెచ్చినా పౌరులెవరూ వాటిని తీవ్రంగా తీసుకోలేదు. వివిధ రాష్ట్రాల గవర్నర్లను ట్రంప్ ఎగతాళి కూడా చేశారు. అదే ఇప్పుడు కొంపముంచిందని రోజురోజుకీ పెరుగుతున్న వ్యాధిగ్రస్తుల సంఖ్యను చూస్తే అర్థమవుతుంది.

అమెరికా చరిత్ర తిరగేస్తే అచ్చం ట్రంప్ మాదిరే సంక్షోభం ముంచుకొచ్చినప్పుడు నిమ్మకు నీరెత్తినట్టు చోద్యం చూసిన పాలకుడు మరొకరు కనిపిస్తారు. 80వ దశకంలో ఆ దేశాన్నేలిన రొనాల్డ్ రీగన్ అప్పట్లో బయటపడిన హెచ్ఐవీ/ఎయిడ్స్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆ వైరస్ గురించి చెప్పినప్పుడు అతిగా స్పందించొద్దని రీగన్ కొట్టిపడేశారు. ఎనిమిదేళ్లు అధికారంలో వుంటే చిట్టచివరి సంవత్సరంలో మాత్రమే ఆయన అయిష్టంగా ఈ వ్యాధిగ్రస్తుల విషయంలో పూర్తి స్థాయి చర్యలకు ఉపక్రమించారు. కానీ ఈలోగా 4 లక్షలమంది పౌరులు ఆ వ్యాధికి బలైపోయారు. ఆ అనుభవాలు తన కళ్లముందే వున్నా ట్రంప్ సైతం అదే తరహా నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారు. ఫలితంగా మొదట్లో కరోనా వెల్లడైన చైనాను మించి మరణాలు సంభవించే ప్రమాదం కనబడుతోంది. ట్రంప్ తనంత తానే 'దాదాపు 2 లక్షలమంది వరకూ మరణించే అవకాశం ఉన్న'దని చెప్పారు. కానీ ఆ దేశంలోని ఇంపీరియల్ కాలేజీ అధ్యయనం చూస్తే ఎవరైనా బెంబేలెత్తడం ఖాయం. ప్రభుత్వం చురుగ్గా వ్యవహరించి సకాలంలో చర్యలు తీసుకోవడానికి సిద్ధపడకపోతే 22 లక్షలమంది మృత్యువాత పడే అవకాశం వున్నదని ఆ అధ్యయనం అంచనా వేసింది. ప్రాథమిక పరీక్షలు మొదలుకొని చికిత్స వరకూ వేర్వేరు అంశాల్లో ప్రభుత్వాలు స్పందించే తీరుతెన్నుల్ని ఊహించి, ఏరకంగా స్పందిస్తే ఏ తరహా పరిస్థితులు ఏర్పడతాయో కంప్యూటర్ ఆధారిత నమూనాల ద్వారా ఈ అంచనా వేసింది. వాటి ఆధారంగా ఈ నివేదిక రూపొందించింది. ఎవరి అంచనాలెలా వున్నా పాలకులు మాత్రం అత్యుత్సాహంతో ఇంతమంది చనిపోతారంటూ లెక్కలు చెప్పి హడలెత్తించకూడదు. మొదట్లో నిపుణుల సూచనల్ని, సలహాల్ని బేఖాతరు చేసి ఏ తప్పు చేశారో...ఇప్పుడు వెనకా ముందూ చూడకుండా కొన్ని అంకెలు వల్లెవేయడం ద్వారా కూడా ఆయన అదే తప్పు చేస్తున్నారు. ప్రభుత్వానికి నిపుణులు అనేకానేక సూచనలు చేస్తారు. పరిస్థితి తీవ్రత గురించి అవగాహన కలిగిస్తారు. తెలివైన పాలకులు వాటిని అర్థం చేసుకుని పౌరులకు ఎంతవరకూ చెప్పాలో అంతే చెబుతారు. ప్రభుత్వాల చర్యలే సమస్య తీవ్రతను అర్థం చేయించాలి. అదే సమయంలో పాలకులు భరోసా ఇవ్వాలి. ఈ మహమ్మారిని ఎదుర్కొనడానికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో అన్ని చర్యలూ తీసుకుంటున్నదన్న అభిప్రాయం పౌరుల్లో కలగజేయాలి. అప్పుడు మాత్రమే వారు తమ వంతు క్రమశిక్షణతో మెలిగి, ఎలాంటి సంక్షోభాన్నయినా అవలీలగా జయించగలుగుతారు. కరోనా వ్యాప్తికి సంబంధించి ఫిబ్రవరి–మార్చి నెల మధ్య సమయం ఎంతో కీలకం. దాన్నంతటినీ ట్రంప్ వృథా చేశారు. చెప్పడానికి ప్రయత్నించినవారిని గేలి చేశారు. తన మాటే సరైందని వాదించారు. ఫిబ్రవరి 26న ఆయన చేసిన ప్రకటనే ఇందుకు రుజువు. అప్పటికి 15 కేసులు బయటపడ్డాయి. ఇవి రెండుమూడు రోజుల్లో సర్దుకుంటాయని, ఆ తర్వాత కరోనా కేసులే వుండవని ఆయన చెప్పారు. ఆయనకు ఇప్పుడు తత్వం బోధపడింది. కానీ ఆ కేసుల సంఖ్య 1,65,000 కు చేరుకుంది. ఈమధ్య కాలమంతా ఆయన అబద్ధాలతో, దబాయింపులతో కాలక్షేపం చేశారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఏ దేశానికి వచ్చిన విపత్తయినా ప్రపంచ పౌరులందరికీ దుఃఖం కలిగిస్తుంది. అందునా చదువుకో, కొలువుకో అమెరికా వెళ్లినవారు ఇప్పుడు మన దేశంలో దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ గణనీయంగా వున్నారు. అందువల్లే ఆ అగ్రరాజ్యం త్వరగా కోలుకోవాలని అందరూ ఆకాంక్షిస్తున్నారు.

గ్రహం అనుగ్రహం

శ్రీ శార్వరి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, తిథి శు.అష్టమి రా.10.01 వరకు తదుపరి నవమి, నక్షత్రం ఆరుద్ర ప.2.30 వరకు తదుపరి పునర్వసు, వర్జ్యం రా.2.24 నుంచి 4.01 వరకు, దుర్ముహూర్తం ప.11.38 నుంచి 12.28 వరకు అమృతఘడియలు... లేవు.

సూర్యోదయం : 5.59
సూర్యాస్తమయం: 6.09
రాహుకాలం : ప. 12.00 నుంచి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుంచి 9.00 వరకు

దురాచారమే అతిపెద్ద రోగం

వైరస్ రోగులకు సేవలందిస్తున్నారనే కారణంతో డాక్టర్లను, నర్సులను అద్దె ఇళ్లలోంచి ఖాళీ చేయాలని ఒత్తిడి చేస్తున్న ఘటనలు మనలో కొత్త తరహా స్వార్థానికి సంకేతాలు. ఇలా అద్దె ఇళ్లలోంచి గెంటేసినవారే రేపు రోగం బారిన పడితే.. ఆ డాక్టర్లు, నర్సులే వారికి సేవ చేయాల్సి వస్తుంది. మానవ అస్పృశ్యత, సామాజిక సామూహిక బాధ్యత లేని భయంకరమైన స్వార్థపరత్వం అనేవి భారతదేశాన్ని మరిన్ని మరణాలు, విధ్వంసం వైపు నెడతాయి. అసాధారణవేగంతో ప్రపంచంపై విరుచుకుపడుతూ ఆర్థిక వ్యవస్థలను ధ్వంసం చేస్తున్న కరోనా వైరస్ నివారణ అనంతరం ప్రపంచం పూర్తిగా మారిపోతుందన్న వాస్తవాన్ని కుల, మత ఛాందసవాదులకు అర్థం చేయించాలి.

విశ్లేషణ

ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

కరోనా వైరస్ మానవజాతిపై యుద్ధం అనే ఆలోచనతో ప్రపంచం వణికిపోతుండగా, సామాజిక దూరం ఒక్కటే ఈ మహమ్మారికి రక్షణ సాధనం అనే ప్రచారం మోతాదుకు మించి సాగుతోంది. అయితే వెయ్యేళ్లపాటు దేశాన్ని పట్టి పీడించిన మానవ అస్పృశ్యత దేశాన్ని ఇప్పుడు మరింత ప్రమాదకర స్థితిలోకి నెట్టే అవకాశాలు పెరుగుతున్నాయి. అందుకే భారత ప్రభుత్వం, మీడియా సామాజిక దూరం అనే భావనను వదిలిపెట్టి రోగానికి దూరంగా ఉండటం అనే పదబంధాన్ని ఉపయోగించాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే వెయ్యేళ్లపాటు మనది కులపరమైన అస్పృశ్యతతో కూడిన సమాజంగా కొనసాగింది. ఏ కరోనా రోగి కూడా సామాజికంగా అస్పృశ్యుడు కాదు. అతడు/ఆమెను కొంచెం దూరంగా ఉంచాల్సిన అవసరం ఉంది. అప్పుడే వారి నోటినుంచి, ముక్కునుంచి వెలువడే తుంపరలు ఆరోగ్యవంతులను చేరలేవు. ఒకసారి రోగి దేహం నుంచి వైరస్ వెళ్లిపోయాక, ఆ వైరస్ బారిన పడని వారికంటే ఎక్కువ రోగ నిరోధకశక్తిని కలిగి ఉంటారు. అంతేకాకుండా వైరస్ నుంచి బయటపడిన వారు మామూలు మనుషులుగా జీవించవచ్చు కూడా. అందుకే రోగాన్ని దూరం పెట్టడమే కానీ మనుషులను దూరం పెట్టే భావన కాదిది.

సామాజిక దూరం అనే భావనమీద ఛాందసవాదులు మొదలు పెట్టిన ప్రచారంపై ఆధారపడి కులాన్ని దూరంగా ఉంచడమే కరోనాకు చికిత్స అనే ఆలోచనను చాలామంది ముందుకు తీసుకొస్తున్నారు. ఇది వేల సంవత్సరాల క్రితమే వీరు కనుగొన్న విధానమే మరి. చివరకు అత్యంత హేతువాదంతో వ్యవహరించే ద్రవిడియన్ రాష్ట్రమైన తమిళనాడులో సైతం కులపరమైన దూరం పాటించడమే కరోనా చికిత్సకు మంత్రం అనే భావన ఉన్నట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

అలాగే పూర్తిగా శాకాహారం తీసుకునే వారి కంటే మాంసాహారం (గొర్రె, బీఫ్, కోడి, చేప, గుడ్డు) తినేవారికి మాత్రమే కరోనా వైరస్ సోకుతుందంటూ ఇవే శక్తులు ప్రచారం చేస్తున్నాయి. తెలంగాణలో ఈరకమైన చెత్త ప్రచారం వల్లే కొంతకాలంపాటు చికెన్, మటన్ షాపులన్నీ మూతబడిపోయాయి. అయితే మాంసాహారం రూపంలో ప్రొటీన్ అధికంగా కలిగిన ఆహారంతో పాటు సీ విటమిన్ ఎక్కువగా ఉండే ఆహారాన్ని ప్రజలు తప్పనిసరిగా తీసుకోవాలంటూ డాక్టర్లు చెబుతున్న సలహాల గురించి సీఎం కేసీఆర్ ఇటీవల ఒక ప్రెస్ కాన్ఫరెన్స్‌లో నొక్కి చెప్పారు. రోగనిరోధక శక్తి బలంగా ఉన్న వారే ఎలాంటి ప్రాణాంతక వ్యాధి నుంచయినా తమను తాము కాపాడుకోగలరని సీఎం స్పష్టం చేశారు. ఆయన అలా చెప్పిన మరుసటి రోజు నుంచే తెలంగాణ వ్యాప్తంగా చికెన్, మటన్, గుడ్ల షాపుల ముందు భారీగా జనం క్యూ కట్టారు. కోడిమాంసం గురించి జరుగుతున్న దుష్ప్రచారం నేపథ్యంలో కేసీఆర్ చేసిన ఒక్క ప్రకటనతో అనేక మంది జీవితాలను నిలబెట్టారు. అన్ని మాంసాలకంటే కోడి మాంసం చౌక. అందుకే ఇప్పుడు పేదప్రజలు కూడా కోడి మాంసం తింటున్నారు.

ఒక మనిషి బ్రాహ్మణుడా, దళితుడా, మగవాడా, మహిళా, ముస్లిమా లేక క్రిస్టియనా అనే విషయాన్ని కరోనా వైరస్ పట్టించుకోదు. మనుషులు మాంసాహారులా, శాకాహారులా అనే విషయాన్ని

కూడా అది పట్టించుకోదు. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారి ఊపిరితిత్తులను కబళించడం ద్వారా మానవ శరీరంలో పాతుకుపోయే పరాన్నజీవే కరోనా వైరస్. రోగనిరోధక శక్తి స్థాయి బలంగా ఉన్న వారు కరోనాను ఓడించగలరు. చైనా ఆహార అలవాట్లే వారిపై కరోనా వైరస్ దాడికి ఆస్కారమిస్తూన్నాయని జోకులేస్తున్న వారంతా ఒక వాస్తవాన్ని పరిశీలించాలి. చైనా ఈ ప్రాణాంతక వ్యాధిని సైన్స్, మందుల సహాయంతో, మొత్తం సమాజాన్ని అప్రమత్తం చేసిన లీ వెన్ లియాంగ్ వంటి గొప్ప డాక్టర్ల సేవలతో ఓడించగలిగింది. పైగా చైనా ప్రజలు వైరస్ బారినుంచి తప్పించుకోవడానికి వారిలో ఉన్న అత్యున్నతమైన రోగనిరోధక స్థాయిలు కూడా తోడ్పడ్డాయి.

ప్రపంచంలోని అన్ని మతధార్మిక సంస్థలూ మూతబడిపోయి, మతంమీద ఆధారపడిన వారందరూ వైద్యులు, మందులపై ఆధారపడుతున్న ప్రస్తుత తరుణంలో శాస్త్రీయంగా పరీక్షించిన, రోగనిరోధక స్థాయిలు బాగా ఉన్న ఆహారంపై ప్రచారం జరగాల్సిన తరుణంలో ఛాందసవాద భావజాలం, మానవ అస్పృశ్యత ప్రచారంలో బలం పుంజుకోవడమే జాతికి మరింత నష్టం చేకూర్చగలదు. నిజానికి కరోనా వైరస్ బారిన పడిన అనంతర భారతదేశం.. ఆహారం, మందులు, గృహ వసరులు తదితరాలను అన్ని కులాలు, సామాజిక బృందాలు, మతాలు, స్త్రీపురుషులు పంచుకుంటూ మానవ అస్పృశ్యత, కులతత్వ చరిత్రను పాతరేయవలసి ఉంది. మానవ సమానత్వం, సైన్స్‌ను అమలు చేస్తున్న శాస్త్రీయ తత్వాన్ని అభివృద్ధి చేసే దిశగా మనం అడుగేయాల్సి ఉంది.

గొడ్డుమాంసం తింటున్న బౌద్ధ కమ్యూనిటీలపై మానవ అస్పృశ్యతను విధించారని, తర్వాత వీరిని అస్పృశ్యులుగా ముద్రించారని డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ నిశిత పరిశోధనతో మనకు తెలియజెప్పారు. కానీ 1897లో ప్రాణాంతకమైన బ్యుబోనిక్ ప్లేగు మహమ్మారికి కోటిమంది భారతీయులు బలైన సమయంలో ఈ తొలి అస్పృశ్యులైన దళితులే బతికి బయటపడ్డారు. కారణం బలమైన గొడ్డు మాంసం తినడం ద్వారా వారికి లభించిన రోగనిరోధక శక్తే. ఆరోజుల్లో వారికి గొడ్డు మాంసం తప్ప మరే ఆహారం లభించేది కాదు. పైగా ప్లేగువ్యాధి బారినపడి జనం పిట్టల్లాగా రాలిపోతున్నప్పుడు అగ్రకులాలకు చెందిన కుటుంబ సభ్యులు.. చనిపోయిన తమ సన్నిహితుల మృతదేహాలను తాకడానికి కూడా భయపడుతున్న తరుణంలో దళితులే మృతదేహాలను మోసుకుపోయి పూడ్చిపెట్టేవారు లేక దహనం చేసేవారు.

పైగా, 1897లో దేశంపై దాడి చేసిన బ్యుబోనిక్ ప్లేగు ప్రస్తుత కరోనా కంటే ప్రమాదకరమైనది. కరోనా వైరస్ సమసిపోయిన తదుపరి భారతదేశంలో తిండిపై ఉన్న ఆంక్షలను నిలిపివేయాలి. వ్యక్తులను, సామాజిక బృందాలను వేరు చేసి వివక్ష ప్రదర్శించే విధానాలను ఆపివేయాలి. ఎందుకంటే భారతీయులను మంచి ఆహారంతోనూ (వారు ఎలాంటి ఆహారం స్వీకరిస్తున్నా సరే), మెరుగైన వైద్య, ఆరోగ్య శాస్త్రాలతోనూ కాపాడుకోవాల్సిన అవసరం ఉందని కరోనా వైరస్ నూతన జాతీయతా పాఠాలను మనకు నేర్పుతోంది. 1897లో పాకిస్తాన్, బంగ్లాదేశ్‌తో కలగలిసి ఉన్న భారతదేశంలోని 20 కోట్ల మంది ప్రజల్లో ఒక కోటిమందికి పైగా ప్లేగు బారినపడి చనిపోయారు. అయితే 2020లో ప్రాణాంతక కరోనా వైరస్ దాడి చేసినప్పుడు 130 కోట్లమంది భారత ప్రజారాశులు తమ సొంత ఆహారంతో, శారీరక శ్రమతో, సామర్థ్యంతో తమను తాము బలోపేతం చేసుకున్నారు.

ఇప్పుడు జాతీయవాదం అంటే శాస్త్రీయ, సాంకేతిక, వైద్య, సాంకేతిక ఆవిష్కరణలపై మరింత శ్రద్ధపెడుతూ అన్ని రంగాల ఆహార సంస్కృతులను గౌరవించడమే అని అర్థం. వైరస్ యుద్ధం అనేది అణు యుద్ధం కంటే ప్రమాదకరమైనదని ఇప్పుడు రుజువైపోయింది. వైరస్‌తో పోరాడేటప్పుడు మనం మరింత సామాజిక సంఘీభావంతో, మానవ సమానత్వంతో, గౌరవంతో మెలగాల్సి ఉంటుంది. వ్యాధికి దూరంగా ఉండటం తాత్కాలింగా ఉండే సమస్యే కానీ కులపరమైన అస్పృశ్యతలాగా సామాజిక దూరం అనే భావనను కూడా వ్యవస్థీకృతంగా మనుషుల మనస్తత్వాల్లోకి ఇంకింపజేస్తే భారతదేశం ఎన్నటికీ భవిష్యత్ వైరస్ యుద్ధాలకు సిద్ధం కాలేదు, నిలదొక్కుకోలేదు. పర్యావరణ మార్పుల సంక్షోభ సమయంలో భవిష్యత్తులో ఎలాంటి వైరస్‌లు మనపై దాడి చేస్తాయో ఎవరికీ తెలీదు. అలాంటి సందర్భాల్లో మతపరమైన పిడివాద సూత్రాలు మనల్ని ఏమాత్రం కాపాడలేవు. కానీ రియల్ టైమ్ సైన్స్ మాత్రమే తప్పకుండా మనల్ని రక్షిస్తుంది.

వైవిధ్యపూరితమైన ఆహార సంస్కృతులు, బహుళ ఆధ్యాత్మిక ఆచరణలు, మానవ అస్పృశ్యత పూర్తిగా కనుమరుగైపోవడం ఆ నూతన ప్రపంచపు సహజతత్వంగా మారతాయి. అన్ని కులాలకు, మతాలకు చెందిన.. వైరస్ బారిన పడిన రోగులనే కాదు.. దేశంలో ఏ ఒక్కరినీ అంటరానితనంతో చూడని కొత్త సంస్కృతి ఏర్పడాలి. తమ ప్రాణాలను పణంగా పెట్టి కరోనా రోగులకు సేవ చేస్తున్న ఆసుపత్రులు, వైద్యులు, నర్సులు ఒక సరికొత్త సామాజిక–ఆధ్యాత్మిక విలువను మనందరికీ బోధిస్తున్నారు. ప్రతి ప్రాణం సమానమైందే, మానవులంతా దైవం ప్రసాదించిన బహుమతే. వైరస్‌పై యుద్ధం నుంచి ఆవిర్భవిస్తున్న ఈ కొత్త ప్రపంచ రూపం నుంచి మనందరం పాఠాలు నేర్చుకుందాం.

వ్యాసకర్త డైరెక్టర్, సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇంక్లూజివ్ పాలసీ

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సోషల్ మీడియా

నటి

మరో యువ నటి తనలోని గొప్ప మానవత్వాన్ని చాటుకుంది. కరోనా మహమ్మారి సోకినవారికి సేవలందించడానికి తన శక్తి మేరకు శిఖామల్హోత్రా ముందుకు రావడం విశేషం. ఆమె నటి మాత్రమే కాదు... అన్ని అర్హతలూ వున్న నర్స్ కూడా. ఈ సంక్షోభకాలంలో ఆ నైపుణ్యాన్ని బాధితుల సేవకు వెచ్చించాలని ఆమె నిర్ణయించుకుంది. బీఎంసీ నిర్వహిస్తున్న ఆసుపత్రిలో నర్సుగా సేవలందిస్తోంది. తెలియని శత్రువుపై మనం చేస్తున్న పోరాటంలో ఒక వలంటీర్ గా భాగం కావాలని ఆమె సామాజిక బాధ్యతతో తీసుకున్న నిర్ణయం అనితరసాధ్యమైనది. నిస్వార్థంగా సేవ చేస్తున్న ఆమెకు మరింత శక్తి నివ్వాలని కోరుకుంటున్నా. జాతి మొత్తం నిన్ను దీవిస్తుంది.

– శత్రుఘ్న సిన్హా, నటుడు

కంపెనీ

పదహారు మంది ఉద్యోగులకు కరోనా పాజిటివ్ రావడంతో నోయిడాలోని ఓ కంపెనీని అధికారులు సీజ్ చేశారు. కంపెనీలోని కొందరు ఆఫీసర్లు తమ ప్రయాణ వివరాలను దాచి పెట్టారు. తిరిగొచ్చిన అనంతరం ఇతరులకు వ్యాధి సోకడానికి కారణమయ్యారు. దీంతో కంపెనీపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

– సోనియా సింగ్, జర్నలిస్ట్

బ్లాక్ లిస్ట్

మన దేశంతోపాటు ఇండోనేసియా, మలేసియా, కిర్గిజిస్తాన్, బంగ్లాదేశ్ తదితర దేశాల నుంచి ఎనిమిది వేల మంది నిజాముద్దీన్‌లో జరిగిన తబ్లిగి జమాత్ ప్రార్థనలకు హాజరయ్యారు. విసా నిబంధనలను వ్యతిరేకించినందుకు ఈ కార్యక్రమానికి హాజరైన వారందరినీ బ్లాక్ లిస్ట్ లో పెడుతున్నట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

– ఆదిత్యా రాజ్‌కౌల్, జర్నలిస్ట్

శిక్ష

మతంతో సంబంధం లేకుండా లాక్ డౌన్ నిబంధనలను ఏ మాత్రం లెక్క చేయకుండా ఉల్లంఘించినవారిని ఇక్కడి చట్టం ప్రకారం శిక్షించాలి. కానీ, నిజాముద్దీన్ ఘటనలో మీరందరూ నాపై ఎందుకు విరుచుకుపడుతున్నారు? కరోనా సోకినవారికి చికిత్స చేయడం సాధ్యమే కానీ, ఇస్లామోఫోబియాతో బాధపడేవారికి ఎటువంటి చికిత్స లేదు.

– అర్ఫా ఖనుమ్ షెర్వాణీ, జర్నలిస్ట్

అత్యవసరం

రోజులు గడుస్తున్న కొద్దీ ప్రజలందరికీ కరోనా పరీక్షలు నిర్వహించడం చాలా అత్యవసరం. లాక్ డౌన్ సమయంలో మనకు చిక్కిన సమయంలో అది వ్యాప్తి కాకుండా మాత్రమే మనం అడ్డుకున్నాం. అది ఒక రోగిని వెంటిలేటర్ పై పెట్టడం లాంటిది. దాని వలన వ్యాధి నయం కాదు. కానీ, పరిస్థితిని చక్కదిద్దడానికి సమయం చిక్కుతుంది. వెంటిలేటర్ లేకపోతే రోగి కుప్పకూలిపోవచ్చు. కరోనాకు ఎటువంటి చికిత్సా లేదు. పాజిటివ్ వచ్చినవారికి తగిన చికిత్స అందించడం, వ్యాధి సోకకుండా నిరోధించడమే అసలైన చర్య.

– సుమంత్ రామన్, యాంకర్

మంచి ఆలోచన

రైలు బోగీలను ఆసుపత్రి వార్డులుగా మార్చాలన్న ఆలోచన చాలా మంచిది. దీంతో మన దగ్గర వేలాది ఆసుపత్రి బెడ్లు ఎక్కడ అవసరమైతే అక్కడకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నట్టే.

– సచిన్ బన్సాల్, సాంకేతిక నిపుణుడు

ఇన్‌బాక్స్

క్రిమి కాలం

నా ఇంటి గోడలన్నీ
ఇప్పుడిప్పుడే నన్ను
గుర్తు పడుతున్నాయ్...
నా ఇంటి తలుపులకు
నా స్పర్శ ఇప్పుడిప్పుడే
అలవాటౌతోంది...
నా వంట గది
నా నెమ్మదితనాన్ని
చూస్తూ ఆలోచిస్తోంది...
నా గిన్నెల బుగ్గలపై
పడిన సొట్టల్ని నిమురుతుంటే
వాటి వింత చూపులకు
నవ్వొస్తుంది...

విడి విడి బతుకుల్ని
కలిపి కుట్టేసింది...
పనుల మధ్య పొడి నవ్వుల్లో
పుప్పొడి కలిపేసింది...
హడావుడి నడకలకు
కళ్లెం వేసింది...
ఉరుకుల పరుగుల
నడుముకి సాంత్వన
ఇచ్చేసింది...
కరోనా ఇంటింటిని
వెంటాడుతున్న క్రిమి...
చీకటిలా విస్తరిస్తూ
వణికిస్తున్న క్రిమి...

ప్రపంచం ఒక యుద్ధభూమి
అయ్యాక మనిషే మానవ బాంబు..
దగ్గు, జలుబు, శ్వాసే
అణ్వాయుధాలు....
సైన్స్‌కి, శాస్త్రానికి మధ్య
ప్రత్యక్ష యుద్ధమిది...
ప్రేమించినట్టే ప్రేమించి
చుట్టపుచూపుగా వచ్చి
కాటేస్తోంది...

మనిషికి ప్రాణం తీపి చెప్పింది...
పాత కుటుంబాలని కొత్తగా
పరిచయం చేసింది... చీకటి
చివరి క్షణాల్లోని
భయాన్ని రుచి చూపించింది...
అమాయకత్వాన్ని జయించి
అపజయాన్ని ఎదిరించే శక్తినిచ్చింది..
చెట్టు నీడలోని అమ్మ ఒడి
అర్థాన్ని చెప్పింది...
జీవితాన్ని కొత్తగా
కలగనడం నేర్పింది...
మనిషికి అర్థమేంటో
మనిషి తెలుసుకోవాలంటే
ఇలాంటి ఒక క్రిమి
కాలం కావాల్సిందే...

– అమూల్య చందు
మొబైల్ : 90598 24800

అమెరికాలో మనవాళ్లు క్షేమమే

సందర్భం

చెన్నూరి వేంకట సుబ్బారావు

ఇదివరకు అమెరికా తుమ్మితే, ప్రపంచానికి జలుబు చేస్తుంది అనేవారు. కానీ ఇప్పటి పరిస్థితి అలాగా లేదు. అమెరికాకు జలుబు చేయడమే కాకుండా మంచం ఎక్కే పరిస్థితి వచ్చినా, ఇండియా లాంటి దేశాలు తుమ్ములు కూడా రాకుండా జాగ్రత్త పడుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమెరికా మొత్తానికి ఏప్రిల్ 30 వరకు సామాజిక దూరం పాటించాలని ప్రకటించారు అంటే అమెరికా ఎలాంటి సంక్షోభంలో ఉందో అర్థం అవుతోంది.

అమెరికాలో కూడా సామాజిక మాధ్యమాల్లోనూ, చానెళ్లలోనూ కరోనా వ్యాధిగ్రస్తుల గురించి, మరణాల గురించి రకరకాల సంఖ్యలు వస్తున్నా అధికారికంగా సెంటర్ ఫర్ డిసీజ్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ (సీడీసీ) ఇచ్చే లెక్కలనే అందరూ విశ్వసిస్తారు. కరోనా వైరస్ బాగా ఎక్కువగా ఉన్న కాలిఫోర్నియా, న్యూయార్క్, న్యూజెర్సి రాష్ట్రాల గవర్నర్లు కూడా కరోనా సంక్షోభంలో తమ తమ విధులను నిర్వర్తిస్తూనే మరోవైపు ఎప్పటికప్పుడు వాళ్ళ వెబ్‌సైట్‌లలో ఈ వైరస్ విషయమై గందరగోళం లేకుండా వివరాలు ఇస్తుంటారు. మార్చి 31 నాటికి అమెరికా 1,65,000 కేసులతో 3000కు పైగా మరణాలతో అగ్రస్థానంలో ఉంది.

అమెరికాలోని 50 రాష్ట్రాలలో కరోనా వైరస్ విజృంభించింది. ఈరోజుకీ న్యూయార్క్ రాష్ట్రం లో ఎక్కువగా కరోనా కేసులు నమోదవుతూనే ఉన్నాయి. మాన్ హట్టన్ నగరం ప్రపంచ వాణిజ్యానికి మూలస్తంభం లాంటిది..

అక్కడ జన సాంద్రత కూడా ఎక్కువే.. అలాంటి నగరంలో కరోనా కట్టడి చేయకపోవటంతో కరోనా పూర్తిగా ప్రబలింది. ఓ వారం రోజుల క్రితమే సైన్యాన్ని దింపి నగరాన్ని కట్టడి చేయడం మొదలు పెట్టారు కానీ అది చేతులు కాలాక ఆకులు పట్టుకొన్న చందాన వుంది అని అంటున్నారు.

ప్రస్తుత పరిస్థితికి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్లక్ష్యమే కారణమని ప్రతిపక్షం డెమోక్రాటిక్ పార్టీ విరుచుకుపడుతోంది. ఆ పార్టీ అధికారంలో ఉన్న కాలిఫోర్నియా రాష్ట్రంలో స్పీకర్ నాన్సి పెలోసి సీఎన్ఎన్ఎన్‌తో మాట్లాడుతూ ట్రంప్ ప్రభుత్వ నిర్లక్ష్యమే ఈ దుస్థితికి కారణమని చెప్పారు. ఈ వ్యాఖ్యలకు రిపబ్లిక్ పార్టీ కూడా వెంటనే స్పందించి ట్రంప్ ప్రభుత్వం ఇప్పటివరకు ఎవరూ చేయని విధంగా 2లక్షల కోట్ల డాలర్లను కేటాయించారని గుర్తు చేశారు.

అమెరికాలో పేదవారికి, నిరుద్యోగులకు, సీనియర్ సిటిజన్‌లకు ప్రభుత్వం సాయం మొదలుపెట్టిందని, అంతే వేగంతో చిన్న, మధ్యతరగతి వ్యాపారులకు, పరిశ్రమలకు కూడా అనేక వెసులుబాట్లు కల్పించి ఆదుకునే

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
బుధవారం ॥ 1-4-2020

ఆదర్శం

అన్నం పంచే అబ్బాయి

కరోనా కారణంగా ప్రస్తుతం జనతా కర్ఫ్యూ, లాక్‌డౌన్ నడుస్తోంది. అనాథలు, బిచ్చగాళ్లు, వీధి బాలలకు, రోడ్డు మీద నివసించేవారికి ఇది ఒక గడ్డుకాలంగా ఉంది. ప్రభుత్వాలు ఎన్నో రకాలుగా ఆదుకుంటున్నారు. ఇదే సమయంలో స్వచ్ఛంగా సేవ చేసేవారు కూడా ముందుకు వచ్చి, చేతనైనంత సహాయం చేస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన మల్లేశ్వరరావు అనే వ్యక్తి చాలాకాలంగా హోటల్స్‌లోను, పెద్ద పెద్ద ఇళ్లలోనూ మిగిలిన ఆహారాన్ని సేకరించి, ఫుట్‌పాత్‌ల మీద నివసిస్తున్న అనాథలకు ఆ ఆహారాన్ని సుమారు నాలుగు సంవత్సరాలుగా అందిస్తున్నారు. తన స్నేహితులతో కలిసి ఈ సేవా కార్యక్రమం చేస్తున్నారు. ఇందుకుగాను అనేక అవార్డులు కూడా అందుకున్నారు.

మల్లేశ్వరరావు

రెండు నెలల క్రితం triporey అనే ఒక ట్రావెల్ స్టార్టప్ కంపెనీ ప్రారంభించాను. కరోనా వల్ల వచ్చిన బుకింగ్స్ అన్నీ క్యాన్సిల్ అయిపోయాయి. మా కంపెనీ ప్రారంభదశలోనే ఆగిపోయింది. నేను గతంలో జోష్ టాక్‌లో ఉద్యోగం చేసి సంపాదించిన డబ్బుతో ప్రస్తుతం నా జీవనం సాగిస్తున్నాను. త్వరలోనే అందరికీ మంచి రోజులు రావాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను.

– మల్లేశ్వరరావు,
సోషల్ వర్కర్, హైదరాబాద్

ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో మరో అడుగు ముందుకు వేసి, ఫేస్‌బుక్ మిత్రుల ద్వారా ఆహార పొట్లాలు, సబ్బులు వంటివి సేకరించి, కష్టాలలో ఉన్నవారికి అందచేస్తున్నారు. ఈ విపత్కర పరిస్థితుల్లో కరోనా సోకుతుందనే భయం కూడా లేకుండా సేవలు అందిస్తున్న మల్లేశ్వరరావుని సాక్షి పలకరించింది. అతను తన అనుభవాలను సాక్షితో పంచుకున్నారు...

'నేను నా జీవితంలో ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నాను. ఒక అనాథ ఎన్ని ఇబ్బందులు పడాలో అన్ని ఇబ్బందులూ పడ్డాను. ఎన్నో రోజులు ఆకలితో అలమటించాను. నాలాగ ఎవ్వరూ బాధపడకూడదు అనుకున్నాను. నాకు ఎప్పుడు అవకాశం వచ్చినా, వీలైనంత వరకు ఇతరులకు సహాయపడాలనుకున్నాను. మనసుంటే మార్గం ఉంటుంది అని భావించాను. నా మిత్రుల సహకారంతో ఫేస్‌బుక్‌లో నా పేరున పేజీ ఓపెన్ చేసి, నా ఆలోచనను అందరితో పంచుకున్నాను. ఈ విపత్కాలంలో అందరూ సహకరిస్తున్నారు. ఐదు వందల ఆహార పొట్లాలు తయారుచేసి నాకు ఇస్తున్నారు. నేను నా మిత్రుడు అంకూర్ శ్రీవాత్సవ్ కలిసి ఉదయం పదకొండు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట లోపు ఈ ఆహారం పొట్లాలు అందచేస్తున్నాం. వీధులలో ఉండేవారినందరినీ ఒక షెల్టర్‌లో ఉంచారు. మాకు చేతనైనంత వరకు ఎవ్వరూ ఆకలితో అలమటించకుండా ఉండేందుకు ప్రయత్నిస్తున్నాం. హైదరాబాద్ ఎర్రగడ్డ ప్రాంతం నుంచి హైటెక్ సిటీ వరకు మేం మా సేవా కార్యక్రమాలు నిర్వర్తిస్తున్నాం. అందరికీ స్నానానికి అవసరమైన సబ్బులు కూడా అందచేస్తున్నాం.

ఇంతటి విపత్కర సమయంలో మేం ప్రాణాలకు తెగించి, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవటానికి ప్రయత్నిస్తుంటే, కొందరు ఆకతాయిలు మాకు ఇబ్బంది కలిగిస్తున్నారు. కొందరు సంపన్నులు కార్లలో దిగి, మా దగ్గరకు వచ్చి, వారంతా తిండి లేక బాధపడుతున్నామని, వారికి కూడా ఆహారం పొట్లాలు ఇవ్వమని దౌర్జన్యంగా తీసుకోవటానికి ప్రయత్నిస్తున్నారు. వారందరికీ మేం చేతులెత్తి ప్రార్థిస్తున్నాం, ఇటువంటి పరిస్థితుల్లో అల్లరిచిల్లరి పనులు చేయొద్దని మొక్కుతున్నాం. ఈ సమయంలో నిర్విరామంగా పనిచేస్తున్న పోలీసులకు కూడా మేం ఆహారం అందిస్తుంటే వారు, 'మేం ప్రజల కోసం పనిచేస్తున్నాం. మీరు మా కోసం పనిచేస్తున్నారు' అంటూ మమ్మల్ని ప్రశంసిస్తున్నారు.

ఇక మేం వ్యక్తిగత శుభ్రత పాటిస్తున్నాం. ఇంటికి వెళ్లేసరికి, ఓ మిత్రుడు మా కోసం నీళ్లు, దుస్తులు సిద్ధం చేసి ఉంచుతున్నాడు. శుభ్రంగా స్నానం చేసిన తరవాత ఇంట్లోకి అడుగు పెడుతున్నాం. దయచేసి మాకు ఈ విషయంలో అందరూ సహకరించండి' అంటూ ఎంతో బాధ్యతగా అర్థిస్తున్నాడు 28 సంవత్సరాల మల్లేశ్వరరావు.

– సంభాషణ: వైజయంతి పురాణపండ

కరోనా పుట్టుకను కనిపెట్టింది మహిళ.
కరోనా వైరస్‌ను గుర్తుపట్టింది మహిళ.
కరోనా నుంచి అలెర్ట్ చేసింది మహిళ.
కరోనా కిట్‌ను తయారుచేసింది మహిళ.
కరోనా వ్యాక్సిన్‌కు టెస్ట్‌డోస్ వేయించుకున్నది మహిళ.
కరోనా వైద్య సేవలకు ముందుంది మహిళ.
ఆఖరికి.. కరోనా లాక్‌డౌన్‌లో...
ఇంటిల్లపాదినీ కనిపెట్టుకుని ఉన్నదీ మహిళే.
తల్లీ నీకేమిచ్చి తీర్చుకోవాలి రుణం.
నలుదిక్కుల కరోనాపై నీదే కదా రణన్నినాదం.

మోదీ కాలింగ్ ఈజ్ దట్ సిస్టర్ ఛాయ?

కరోనాకు ముందు నిఫా, నిఫాకు ముందు ఎబోలా, ఎబోలాకు ముందు సార్స్.. విలయతాండవం చేసిన ప్రతి ఆరోగ్యవిపత్తులోనూ తనుకు తానుగా హారతి కర్పూరమై క్రిమిని సంహరించి మనిషిని ఒడ్డున పడేసింది మహిళలే.

సిస్టర్ ఛాయ : ప్రధాని ఫోన్ చేశారు.

మార్చి 28. దేశం లాక్‌డౌన్ అయిన నాలుగో రోజు. పుణెలోని నాయుడు ఆసుపత్రిలో నర్సుగా పని చేస్తున్న ఛాయకు ఫోన్ కాల్! ''అవసరమైతే తప్ప నేను ఇంటికి రాను. మీరూ అవసరమైతే తప్ప నాకు ఫోన్ చేయకండి'' అని ఇంట్లో చెప్పే వచ్చారు ఛాయ. మరి ఫోన్ చేసింది ఎవరై ఉంటారు? ''ప్రధానమంత్రి నివాసం నుంచి చేస్తున్నాం. సిస్టర్ ఛాయతో మాట్లాడాలని ప్రధాని ఆశిస్తున్నారు..'' అటువైపు నుంచి!

''నేనే సిస్టర్ ఛాయ'' చెప్పారు ఛాయ. వెంటనే నరేంద్ర మోదీ లైన్‌లోకి వచ్చారు. ''నమస్తే.. సిస్టర్ ఛాయ'' అన్నారు. ప్రతి నమస్కారం చేశారు ఛాయ. ''సిస్టర్ ఛాయా.. మీ కుటుంబ సభ్యులు ఎలా ఉన్నారు? మీ గురించి ఆందోళన చెందుతూ ఉంటారేమో కదా'' అన్నారు మోదీ. ''నిజమే సర్. కానీ ఇలాంటి సమయాల్లో ఫ్యామిలీ కన్నా డ్యూటీ ముఖ్యం అవుతుంది కదా'' అన్నారు నవ్వుతూ ఛాయ.

శాస్త్ర పరిశోధకురాలు

గత వారంరోజులుగా ప్రధాని రోజుకు కనీసం 150 నుంచి 200 మంది వరకు ఛాయ వంటి 'ఫ్రంట్‌లైన్ ఫైటర్స్'తో ఫోన్‌లో మాట్లాడుతున్నారు. ఆ ముందువరుస పోరాట యోధులలో ఎక్కువ మంది మహిళలే! నర్సులు, టీచర్లు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగినులు, గృహిణులు.. అంతా అత్యవసర విధులలో ఉన్నవారు. మాట్లాడి, వాళ్లకు ధైర్యం చెప్పడంలేదు మన ప్రధాని. ధన్యవాదాలు చెబుతున్నారు. ఎందుకంటే ఆ మహిళా యోధులే తమ సేవలతో ఈ దేశానికి ధైర్యం చెబుతున్నారు. సేవలు మాత్రమేనా! కరోనా వైరస్‌ను ముందుగా పసిగట్టిందీ, వైరస్ పరీక్షకు ముందుగా కిట్‌ను కనిపెట్టిందీ, వైరస్ వాక్సిన్ ప్రయోగాలకు మొదట ముందుకొచ్చిందీ.. అందరూ మహిళలే. కరోనాకు ముందు నిఫా, నిఫాకు ముందు ఎబోలా, ఎబోలాకు ముందు సార్స్.. విలయతాండవం చేసిన ప్రతి ఆరోగ్యవిపత్తులోనూ తనుకు తానుగా హారతి కర్పూరమై క్రిమిని సంహరించి మనిషిని ఒడ్డున పడేసింది మహిళలే. 2004లో సార్స్ ఈ భూగోళాన్ని వణికిస్తున్నప్పుడు సార్స్ వైరస్‌కు మూలం చైనా గుహల్లోని గబ్బిలాలేనని మొదట కనిపెట్టింది కూడా ఒక మహిళా శాస్త్రవేత్తే! నాటి సార్స్ వైరస్‌కి మరో రూపమే నేటి కరోనా వైరస్ అని ప్రపంచానికి చెప్పిందీ ఆ మహిళా శాస్త్రవేత్తే. ఆమె పేరు షీజెంగ్లీ.

షీజెంగ్లీ, శాస్త్ర పరిశోధకురాలు : మూలాలను గుర్తించారు.

వైద్య సేవిక

ఒక కొత్త వైరస్‌కు మూలాలను కనిపెట్టడం, ఒక వ్యక్తిలో ఉన్న ఆ కొత్త వైరస్‌ను గుర్తించడం రెండూ ఒకటే. అంతుచిక్కని జబ్బుతో వెంటవెంటనే చైనాలోని వుహాన్ ఆసుపత్రికి వచ్చిన ముగ్గురు రోగుల్లో కరోనా వైరస్‌ను మొదట సందేహించి, గుర్తించింది కూడా అక్కడి ఒక నర్సే! అప్పటికింకా కరోనా వ్యాపించబోతోందని వుహాన్‌కి గానీ, మిగతా ప్రపంచానికి గానీ తెలీదు. కానీ ఏదో ఉపద్రవమైతే రాబోతుందని వుహాన్ నగరానికి 4,500 కి.మీ. దూరంలో ఉన్న కేరళలో ఒక మహిళ కనిపెట్టేశారు! ఆమె.. కె.కె.శైలజ. కేరళ ఆరోగ్య, సాంఘిక శాఖ మంత్రి. గతంలో కెమిస్ట్రీ టీచర్.

కె.కె.శైలజ, ఆరోగ్యశాఖ మంత్రి : అప్రమత్తం చేశారు.

రాత్రి బాగా పొద్దుపోయే వరకు చదువుతూ కూర్చోవడం శైలజకు అలవాటు. ఆరోజు కూడా ఆన్‌లైన్‌లో ఏదో చదువుతుంటే వుహాన్‌లో కరోనా ప్రబలుతున్న వార్త తొలిసారి ఆమె దృష్టికి వచ్చింది. వుహాన్‌లో ఉన్న కేరళ విద్యార్థులను వెంటనే స్వదేశానికి రప్పించమని అప్పటికప్పుడు ఆమె ఆరోగ్యశాఖ కార్యదర్శికి ఆదేశాలు ఇచ్చారు. విద్యార్థులు వుహాన్ నుంచి వచ్చీ రాగానే అప్పటికే నిఫా కోసం అందుబాటులో ఉన్న వైరస్ పరీక్షలు చేయించారు. ఆ వెంటనే.. రాబోతున్నది గడ్డుకాలం అని రాష్ట్రం మొత్తాన్ని అప్రమత్తం చేశారు. 2018లో కేరళలో నిఫా వైరస్ రోగికి వైద్యసేవలు అందిస్తూ అతడి నుంచి సోకిన వైరస్‌తో లినీ అనే నర్సు మరణించడం శైలజకు గుర్తుంది. మళ్లీ అలాంటి విషాదాలను జరగనివ్వకూడదని ఆమె గట్టిగా తీర్మానించుకున్నారు.

మినాల్ దాఖవే భోస్లే, వైరాలజిస్ట్, కిట్ కనిపెట్టారు

క్రిమి అధ్యయనవేత్త

కరోనా వ్యాప్తి వేగాన్ని మన దేశంలో మొదట అంచనా వేసింది శైలజ అయితే, కరోనా టెస్ట్ కిట్‌ను మొదట కనిపెట్టింది మినాల్ దాఖవే భోస్లే. వైరాలజిస్టు ఆమె. పుణెలోని మై ల్యాబ్స్ డిస్కవరీ సంస్థలో చీఫ్ రిసెర్చ్ ఆఫీసర్‌గా చేస్తున్నారు. గర్భిణి అయి ఉండి, నెలలు నిండుతున్నా కూడా విశ్రాంతి తీసుకోకుండా కరోనా నిర్ధారణ కోసం 'పాథో డిటెక్ట్' అనే పరికరాన్ని ఆమె తయారు చేశారు. విదేశీ కిట్‌లలో పోలిస్తే నాలుగింట ఒక వంతు మాత్రమే ధర ఉండే ఈ మినాల్ ఆవిష్కరణకు వెంటనే ప్రభుత్వ ఆమోదం కూడా లభించింది. కరోనాపై సగం విజయం కూడా ఖాయం అయింది.

టీకా దేహధారి!

ఇప్పటివరకు జరుగుతున్నదంతా నివారణ కోసం. మరి నిర్మూలన మాటేమిటి? వ్యాక్సిన్ తయారవ్వాలి. వ్యాక్సిన్ కోసం ఆరోగ్యవంతులైన మనుషులపై ప్రయోగాలు జరగాలి. కరోనా అంటేనే భయపడి పారిపోతున్నవాళ్లు కరోనా బలిపీఠంపై కూర్చోడానికి ఎందుకు ముందుకొస్తారు? ఇద్దరు ముగ్గురు మాత్రం వచ్చారు. వారిలో అందరికన్నా ముందు జెన్నిఫర్ హాలెర్ అనే యు.ఎస్. మహిళ ముందుకొచ్చారు. ఇప్పుడు ఆమె ఒంట్లో 'ఎం.ఆర్.ఎన్.ఎ. 1273' అనే వైరస్ నివారణ టీకా మందు ఉంది. ఆ ముందు ఎలా పనిచేస్తున్నదీ తెలియాలంటే ఇంకొంత సమయం పడుతుంది. ఆ తర్వాత జెన్నిఫర్‌కు రెండో టీకా ఇస్తారు. అదీ చక్కగా పనిచేస్తే.. కరోనా పని అయిపోయినట్లే. 43 ఏళ్ల జెన్నిఫర్‌కు ఇద్దరు టీనేజ్ పిల్లలు. భర్త, ఆమె ఇద్దరూ సాఫ్ట్‌వేర్ నిపుణులే.

జెన్నిఫర్ హాలెర్: టీకాకు ప్రయోగం అయ్యారు

ఇంటింటి గృహిణి

అమెరికన్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్, మొడెర్నా పరిశోధన సంస్థ కలిసి వృద్ధి చేస్తున్న కరోనా టీకా పని తీరును కనిపెట్టేందుకు తనను తను ప్రయోగశాలగా మార్చుకున్న జెన్నిఫర్‌కు, ఇంకా.. కరోనాపై యుద్ధంలో మానవాళి తరపున కొంగు బిగించి ముందు వరుసలో నిలబడిన ప్రతి మహిళకూ.. ఈ జాగ్రత్తల కాలంలో రోగుల చేయి వీడని 'సిస్టర్ ఛాయ'లకు.. కుటుంబాలను కనురెప్పల్లా కాచుకుంటున్న ప్రతి గృహిణికీ.. యేటా వేడుకగా ధన్యవాదాలు సమర్పించుకునే ఒక ఇంటర్నేషనల్ డే ను ప్రపంచం తనకై తాను ప్రకటించాలి. ఆ ప్రకటనకు రుణం తీర్చుకునే శక్తి లేకపోయినా.. కృతజ్ఞతలు తెలియజెయ్యడానికి ఒక సందర్భం అయినా అవుతుంది.

కరోనా హీరో డాక్టర్ అపూర్వ

అపూర్వ విన్నపం

ప్రాణాలను కాపాడే శక్తి డాక్టర్ల చేతిలో మాత్రమే ఉండేది.
ఇప్పుడు ఆ శక్తి అందరి చేతుల్లోకి వచ్చింది.
కరోనా మీద పోరాటం డాక్టర్లుగా మాకు పెద్ద చాలెంజ్.
ఈ చాలెంజ్‌లో మమ్మల్ని గెలిపించగలిగింది మీరే.
బాధ్యతాయుతమైన పౌరులని నిరూపించుకోండి.
స్నేహితులకు చెప్పండి... ఇంట్లో వాళ్లకు చెప్పండి.
అందరినీ ఇంట్లోనే ఉండమని చెప్పండి.
మనల్ని మనం కాపాడుకుందాం. మన తోటి వారిని కాపాడుదాం.
ఇది ఒక డాక్టర్ చేస్తున్న విన్నపం.
డాక్టర్ అపూర్వ చేస్తున్న అపూర్వమైన విన్నపం.

డాక్టర్ అపూర్వ

డాక్టర్ అపూర్వ చేసిన మూడున్నర నిమిషాల వీడియో పది రోజులుగా వైరల్ అవుతోంది. కరోనా వైరస్‌కంటే వేగంగా విస్తరిస్తోంది. జనతా కర్ఫ్యూ, లాక్‌డౌన్ నేపథ్యంలో రూపొందించిన వీడియోను ఫేస్‌బుక్‌లో లక్షమందికి పైగా వీక్షించారు. యూట్యూబ్‌లో ఇరవై గంటల్లో నాలుగు లక్షల వ్యూస్ వచ్చాయి. జనమంతా ఇంత ఘనం చూడడానికి అందులో ఏముంది? అంటే... కరోనా గురించిన పూర్వాపరాలతోపాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలున్నాయి. వాట్సాప్ యూనివర్సిటీ వెదజల్లుతున్న సొంత పరిజ్ఞానాన్ని, ఇతర సోషల్ మీడియాలో నడుస్తున్న ఫేక్ న్యూస్ సునామీని అదుపు చేయడం కోసమే ఆ వీడియో చేశానన్నారు గైనకాలజీ, ఇన్‌ఫెర్టిలిటీ స్పెషలిస్టు డాక్టర్ అపూర్వ. తన దగ్గరకు వచ్చిన పేషెంట్‌ల సందేహాలకు సమాధానాలే తన వీడియోలని చెప్పారు అపూర్వ. తన దగ్గరకు వచ్చిన పేషెంట్‌లకయితే ఒక్కొక్కరికీ ఓపిగ్గా ఆద్యంతం వివరించడం సాధ్యమవుతోంది. తరచూ డాక్టర్ దగ్గరకు రాలేని గర్భిణులు మనదేశంలో చాలా మంది ఉన్నారు. వాళ్లకు అందుబాటులో ఉన్న డాక్టర్లకు ఈ మహిళల సందేహాలన్నింటికీ సమాధానం చెప్పే సమయం, సహనం ఉన్నాయో లేదో కూడా అనుమానమే. అందుకే తానే వాళ్లందరి దగ్గరకు వెళ్లాలనుకున్నారు డాక్టర్ అపూర్వ. కాలనీకు వెళ్లి, గర్భిణుల కోసం అవగాహన సదస్సులు పెట్టి స్వయంగా మాట్లాడవచ్చు. ఇప్పుడా పరిస్థితి లేదు, అంత సమయమూ లేదు. అందుకే డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా దేశంలోని మారుమూల ప్రాంతాలకూ చేరుకున్నారు. ఆ వీడియోల్లో ఆమె కరోనా మొదట ఎలా బయటపడింది అనే వివరాల నుంచి, ఎలా విస్తరించింది, ప్రభుత్వాలు కట్టడి చేసినప్పుడు ఎంత అదుపులో ఉండింది? దక్షిణ కొరియా మహిళ బాధ్యత రాహిత్యం వల్ల ఎంత మందికి ఎంత త్వరగా వ్యాధి వ్యాప్తి చెందిందనే వివరాలతోపాటు, వ్యాధి లక్షణాలు కనిపిస్తే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? ఐసోలేషన్ ఆవశ్యకత, ఈ విపత్కాలంలో ఇంట్లోనే ఉండడాన్ని మించిన మంచిపని మరొకటి లేదనే సూచనలతో 'స్టే హోమ్... బీ సేఫ్' అనే సందేశంతో ముగుస్తుందీ వీడియో. చివరగా మలయాళం, తమిళ, గుజరాతీ, మరాఠీ, బెంగాలీ భాషల్లో డాక్టర్‌ల సూచనలు కూడా ఉన్నాయి. ఆమె సేవలకు డబ్ల్యుహెచ్‌వో 'రికార్డ్ ఆఫ్ అచీవ్‌మెంట్' సర్టిఫికేట్ ప్రదానం చేసింది.

నెలలు నిండక ముందే ప్రసవం

''కరోనా తొలిదశలో ఉన్నప్పుడు ఈ వ్యాధి గర్భిణులకు సోకదనే అనుకున్నారు. కానీ విదేశాల్లో రెండు కేసులు నమోదయ్యాయి. వ్యాధి కారక వైరస్ స్వరూపం మార్చుకుంటూ ఉంటుంది. కాబట్టి ఎప్పటికప్పుడు మార్పులకు అనుగుణంగా వీడియోలు చేస్తున్నాను. గర్భిణులకు వ్యాధి సోకితే ప్రీ టర్మ్ డెలివరీలయ్యే ప్రమాదం ఉంటుంది. ఈ విషయంలో ప్రభుత్వం పెద్దగా దృష్టి పెట్టడం లేదు. కానీ ప్రైవేట్ హాస్పిటళ్లు మాత్రం ముందస్తు డెలివరీలను దృష్టిలో పెట్టుకుని బెడ్‌లను సిద్ధంగా ఉంచుకుంటున్నాయి. ఒక కరోనా పాజిటివ్ పేషెంట్‌ను పరీక్షించిన డాక్టర్, ఇతర పారా మెడికల్ స్టాఫ్ ఇతర రోగులను పరీక్షించకుండా ఉండేటట్లు మా డాక్టర్లం కూడా కేటగిరైజ్ చేసుకుని పని చేస్తున్నాం. పాజిటివ్ పేషెంట్‌లను చూసిన మెడికల్ టీమ్ ఒక వారం డ్యూటీ చేసి, రెండు వారాలు క్వారంటైన్‌లో ఉంటోంది. ఈ డిసీజ్‌కి సరిహద్దుల్లేవు, మన జాగ్రత్తలతోనే దీనికి అడ్డుకట్ట వేయాలి'' అని డాక్టర్‌లుగా తాము కరోనా వ్యాధిని ఎదుర్కొంటున్న తీరును వివరించారామె.

– వాకా మంజులారెడ్డి

వీడియో సందేశం

కరోనా వీడియోని మొదట ఇంగ్లిష్ వెర్షన్ చేశాను. అది చూసి మా అమ్మ 'తెలుగమ్మాయివై ఉండి, తెలుగు వాళ్లను ఎడ్యుకేట్ చేయకుండా ప్రపంచమంతటినీ ఎడ్యుకేట్ చేస్తావా? తెలుగులో కూడా చెయ్యి' అన్నారు. ఆ మాటతో నాకు మనసులో ఏదో గుచ్చుకున్నట్లయింది. వెంటనే తెలుగులో స్క్రిప్టు రాసుకుని తెలుగులో షూట్ చేశాను. మా అమ్మ ఆ మాట అన్న మూడు గంటల్లో తెలుగు వెర్షన్ చేసి అమ్మకి చూపించాను. ఆశ్చర్యం ఏమింటే... ఇంగ్లిష్ వెర్షన్ ఎంత వేగంగా విస్తరించిందో, అంతే వేగంగా తెలుగు వెర్షన్ కూడా విస్తరించింది. సింగపూర్, యూఎస్‌లో ఉన్న తెలుగు వాళ్ల నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. 'స్వయంగా డాక్టర్ మాటల్లోనే వినడంతో మాకు ధైర్యంగా ఉంది. మీరు చెప్పినట్లు వ్యాధి అదుపులోకి వచ్చే వరకు ఇంట్లోనే ఉంటాం' అని హామీ కూడా ఇస్తున్నారు.

– డాక్టర్ అపూర్వ పల్లంరెడ్డి,
ఫీనిక్స్ క్లినిక్, బెంగళూరు

క్వారంటైన్

ఇటలీలో మన గాయని

ప్రతిభతో పదిమందిలో గుర్తింపు వచ్చాక వ్యక్తిత్వమే ప్రధానమవుతుంది. ప్రతిభ కన్నా మనకున్న సామాజిక బాధ్యతనే ప్రామాణికంగా తీసుకుంటారు! అలా చూసినప్పుడు ప్రతిభతో పాటు తన సామాజిక బాధ్యతను కూడా చాటుతున్నారు ప్రముఖ సినీ గాయని, నటి శ్వేతా పండిట్.

కరోనా వైరస్ స్వేచ్ఛగా విహరిస్తున్న వాతావరణంలో మనం ఇంటి నుంచి అడుగు బయట పెట్టకపోవడమే సామాజిక బాధ్యతగా.. దేశసేవగా మారుతోంది. దీనికి ప్రాక్టికల్ ఎగ్జాంపుల్ శ్వేతా పండిట్. గాన గంధర్వుడు పండిట్ జస్‌రాజ్‌కు మనవరాలు (మేనకోడలి కూతురు) శ్వేతా పండిట్. నెల రోజుల కిందట ఇటలీకి వెళ్లిన ఆమె రోజురోజుకి అక్కడ కరోనా వ్యాప్తి తీవ్రమవడంతో స్వీయ నిర్బంధంలోకి వెళ్లిపోయారు. అప్పటికి మన దేశంలో కరోనా ప్రభావం లేకపోయినప్పటికీ.. ఇక్కడికి వచ్చే అవకాశం ఉన్నప్పటికీ రాలేదు. 'కరోనా ప్రభావం తీవ్రంగా ఉన్న ఇక్కడి (ఇటలీ) నుంచి నేను అక్కడికి రావడం బాధ్యతారాహిత్యమే అవుతుంది. విమాన ప్రయాణం అంత సేఫ్ కాదు. నాకే కాదు భారతదేశంలో నేను చేరుకునే ప్రదేశానికి కూడా.

శ్వేతా పండిట్

అందుకే నెల రోజులుగా ఇటలీలో నేనుంటున్న ఇంట్లోంచి బయటకు రాకుండా కాలక్షేపం చేస్తున్నాను. ఇక్కడ భయంకరమైన పరిస్థితి. అంబులెన్స్ సైరన్ వింటూ నిద్రపోతున్నాను. మళ్లీ తెల్లవారి ఆ సైరన్‌తోనే నిద్రలేస్తున్నాను. అంబులెన్స్ శబ్దం తప్ప ఇంకేదీ వినిపించడం లేదు. రోడ్ల మీద అవి తప్ప ఇంకేవీ తిరగడం లేదు. ఫ్రెండ్స్.. మీరంతా కూడా జాగ్రత్తగా ఉండండి.. గవర్నమెంట్ చెప్పే సూచనలు పాటించండి.. ఇంట్లోంచి బయటకు రాకండి.. ఇవి మనకు కీలకమైన రోజులు. జాగ్రత్తగా ఉంటే పెద్ద గండం నుంచి గట్టెక్కిన వాళ్లమవుతాం. లేదంటే.. పరిస్థితులు ఎంత దారుణంగా ఉంటాయో ఇక్కడ ప్రత్యక్షంగా చూస్తున్నాను. ఆ దుస్థితి మనకు రావద్దు' అంటూ అక్కడి విషయాలను, వార్తలను, తన క్వారంటైన్ కాలాన్ని ఎప్పటికప్పుడు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తూ, మన క్షేమాన్ని కోరుతున్నారు శ్వేత.

ఈ దేశానికి రాకుండా అక్కడే ఉండిపోయిన శ్వేత నిర్ణయాన్ని, ఆమె సాహసాన్ని అభినందిస్తున్నారు పలువురు సినీప్రముఖులు, రాజకీయ నేతలు.

ప్రతిభాశాలి శ్వేతా పండిట్ బాలీవుడ్‌తో పాటు తెలుగు, తమిళ భాషల్లోనూ పాటలు పాడారు.. పాడుతున్నారు. నాలుగేళ్ల వయసులోనే మణిరత్నం 'అంజలి'తో సినిమాల్లో పాటల ప్రయాణం మొదలుపెట్టారు. హిందీలోకీ డబ్ అయిన అంజలీలో కూడా ఆమే పాడారు. దాంతో బాలీవుడ్ మ్యూజిక్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన అతి పిన్న వయస్కురాలు అనే కితాబునూ పొందారు శ్వేత. తబలా వాద్యకారుడు ఉస్తాద్ జాకిర్ హుస్సేన్‌తో కలిసి తొమ్మిదో యేటనే సింగీత దర్శకురాలిగా మారారు . 'సాజ్' అనే హిందీ సినిమాకు. సాయి పరాంజ్‌పే దర్శకత్వం వహించిన ఈ సినిమాను లతా మంగేష్కర్ బయోగ్రఫిగా చెప్తారు.

శ్వేత క్షేమంగా ఇటలీ నుంచి మన దేశానికి చేరుకోవాలని కోరుకుందాం.

ధోనికంటే 'దాదా'నే నాకు గొప్ప!

కెప్టెన్‌గా అండగా నిలిచాడన్న యువరాజ్

న్యూఢిల్లీ: ఒక కెప్టెన్‌గా తన కెరీర్‌లో సౌరవ్ గంగూలీ అందరికంటే ఎక్కువగా మద్దతుగా నిలిచాడని భారత మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ వ్యాఖ్యానించాడు. ధోనితో పోలిస్తే దాదా నాయకుడిగా ఉన్న సమయంలోనే తన కెరీర్ బాగా సాగిందని అతను గుర్తు చేసుకున్నాడు. భారత్ తరఫున యువీ 304 వన్డేలు ఆడగా ఇందులో గంగూలీ సారథ్యంలో 110 మ్యాచ్‌లు, ధోని కెప్టెన్సీలో 104 మ్యాచ్‌లు ఆడాడు. 'సౌరవ్ కెప్టెన్సీలో నేను ముందుగా ఆడాను. ఆ సమయంలో అతను నాకు చాలా అండగా నిలిచాడు. ఆ తర్వాత ధోని కెప్టెనయ్యాడు. ఇద్దరిలో ఎవరు అత్యుత్తమమో చెప్పడం కొంత కష్టమే అయినా... సౌరవ్ మద్దతుగా నిలిచిన సమయంలోనే నా కెరీర్ మధురానుభూతులు ఉన్నాయి. ధోని నుంచి గానీ ఆ తర్వాత కోహ్లి నుంచి గానీ నాకు ఆ తరహా మద్దతు ఎప్పుడూ లభించలేదు' అని యువీ వ్యాఖ్యానించాడు. తన కెరీర్‌లో ముత్తయ్య మురళీధరన్ బౌలింగ్‌లో ఎక్కువగా ఇబ్బంది పడ్డానని, అయితే ఆ తర్వాత సచిన్ సలహాతో స్వీప్ చేయడం మొదలు పెట్టాక పరిస్థితి మెరుగైందని యువరాజ్ అన్నాడు. గ్లెన్ మెక్‌గ్రాత్ బౌలింగ్‌లో కూడా ఆడలేకపోయేవాడినని, అయితే

టెస్టు జట్టులో రెగ్యులర్ కాకపోవడం వల్ల మెక్‌గ్రాత్‌ను ఎక్కువగా ఎదుర్కొనే అవకాశం రాలేదని అతను అన్నాడు. ఐపీఎల్ వచ్చిన తర్వాత కుర్రాళ్లకు చాలా డబ్బు వచ్చిపడుతోందని, దాంతో వారు తమ సీనియర్లకు కనీస గౌరవం కూడా ఇవ్వడం లేదని యువరాజ్ ఆవేదన వ్యక్తం చేశాడు. 'ఐపీఎల్ లేని రోజుల్లో నేను అరంగేట్రం చేశాను. నేను టీవీలో ఆరాధించే హీరోలతో కలిసి ఆడే అవకాశం వచ్చినప్పుడు వారంటే ఎంతో గౌరవం చూపించాను. ఎలా ప్రవర్తించాలో, మీడియాతో ఎలా మాట్లాడాలో వారు నేర్పించారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. కొందరు ఈతరం కుర్రాళ్లతో మాట్లాడుతుంటే వారు సీనియర్లను ఏమాత్రం లెక్క చేయరని అర్థమైంది. నేను ద్రవిడ్, వెంకటేశ్ ప్రసాద్, కుంబ్లేలాంటి వారితో తిట్లు కూడా తిన్నాను. కానీ వారి ద్వారా ఎంతో నేర్చుకున్నాను కూడా' అని యువీ విశ్లేషించాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో తాను ధరించిన '12' నంబర్ జెర్సీకి బీసీసీఐ రిటైర్మెంట్ ఇవ్వాలని, మరెవరూ దానిని వాడరాదంటూ కొందరు అభిమానులు కోరడం తనకు 'అతి'గా అనిపించిందని యువరాజ్ అన్నాడు. టెస్టుల్లో '12' నంబర్‌ను ఇప్పుడు పృథ్వీ షా ధరిస్తున్నాడు. 'జెర్సీ సంఖ్య అనేది సమస్యే కాదు. పృథ్వీలాంటి ప్రతిభావంతుడు దానిని ధరించడం సంతోషకరమే. అతనిలో ఎంతో సత్తా ఉంది. పృథ్వీ ఎప్పుడు బరిలోకి దిగినా మనం అండగా నిలవాలి' అని యువీ స్పష్టం చేశాడు.

రోహిత్ విరాళం రూ. 80 లక్షలు

ముంబై: మహమ్మారి 'కోవిడ్-19'పై పోరు కోసం క్రీడా లోకం తరలివస్తోంది. విరాళాల రూపంలో క్రీడాకారులు కరోనా కట్టడికి తమకు సాధ్యమైనంత సహాయ సహకారాల్ని అందజేస్తున్నారు. భారత క్రికెట్ వన్డే జట్టు వైస్ కెప్టెన్ రోహిత్ శర్మ మంగళవారం రూ. 80 లక్షల విరాళం ప్రకటించాడు. పీఎం-కేర్స్ నిధికి రూ. 45 లక్షలు, మహారాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ. 25 లక్షలు, 'జొమాటో ఫీడింగ్ ఇండియా' కార్యక్రమం కోసం రూ. 5 లక్షలు, వీధి శునకాల సంక్షేమం కోసం రూ. 5 లక్షలు కేటాయించినట్లు రోహిత్ ట్విట్టర్ ద్వారా తెలిపాడు. భారత మాజీ కెప్టెన్, కోచ్, దిగ్గజ లెగ్‌స్పిన్నర్ అనిల్ కుంబ్లే కూడా ప్రధానమంత్రి, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలకు విరాళమిచ్చాడు. అయితే ఇచ్చిన మొత్తాన్ని మాత్రం వెల్లడించలేదు. భారత స్టార్ జావెలిన్ త్రోయర్, ఆసియా క్రీడల స్వర్ణ పతక విజేత నీరజ్ చోప్రా రూ.3 లక్షలు కేంద్రం, హరియాణా రాష్ట్ర ప్రభుత్వాల కోసం కేటాయించాడు. భారత టేబుల్ టెన్నిస్ సమాఖ్య పీఎం రిలీఫ్ ఫండ్ కోసం రూ. 5 లక్షలు ప్రకటించింది.

గుండుతో వార్నర్....

వైద్య సిబ్బందికి మద్దతుగా షేవ్ చేసుకున్న ఆసీస్ ఓపెనర్

మెల్‌బోర్న్: ప్రపంచవ్యాప్తంగా కరోనా సృష్టిస్తోన్న అలజడి ఎంత తీవ్రంగా ఉందో అందరికీ తెలిసిందే. ఈ మహమ్మారిని కట్టడి చేసేందుకు పోలీస్, వైద్య సిబ్బంది తమ ప్రాణాలను పణంగా పెట్టి నిరంతరం ప్రజల్ని కాపాడుతున్నారు. ఈ నేపథ్యంలో వీరి సేవకు ఆస్ట్రేలియా డాషింగ్ బ్యాట్స్‌మన్, ఓపెనర్ డేవిడ్ వార్నర్ వినూత్నంగా మద్దతు తెలిపాడు. అత్యంత కఠిన పరిస్థితుల్లో విధులు నిర్వర్తిస్తోన్న వారికి సంఘీభావంగా వార్నర్ ట్రిమ్మర్ సహాయంతో స్వయంగా గుండు గీసుకున్నాడు. జుట్టును షేవ్ చేసుకుంటున్న వీడియోను మంగళవారం ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్న వార్నర్... మరో ఎనిమిది మందికి ఈ చాలెంజ్‌ను విసిరాడు. ఇందులో భారత క్రికెట్ జట్టు కెప్టెన్ కోహ్లి, స్టీవ్ స్మిత్, కమిన్స్, జో బర్న్స్, స్టాయినిస్, జంపా కూడా ఉన్నారు.

ఐపీఎల్ లేకపోతే ఎలా?

పలువురు యువ క్రికెటర్ల ఆందోళన ● డబ్బులు ఇవ్వలేమన్న ఫ్రాంచైజీలు

ముంబై: కరోనా కారణంగా ఈసారి 2020 ఐపీఎల్ నిర్వహించడం దాదాపు అసాధ్యంగా మారింది. అంతా చక్కబడితే సెప్టెంబరు-అక్టోబరు సమయంలో లీగ్ జరగవచ్చని వినిపిస్తున్నా... అది అంత సులువు కాదు. తాజా పరిణామాల నేపథ్యంలో ఆటగాళ్లకు రూపాయి కూడా చెల్లించలేమని ఫ్రాంచైజీలు చెబుతున్నాయి. లీగ్ నిబంధనల ప్రకారం ఒక ప్లేయర్ జట్టుతో పాటు ఉన్న మ్యాచ్‌లకే లెక్కగట్టి డబ్బులు ఇస్తారు. ఇక టోర్నీనే ఉండకపోతే సహజంగానే డబ్బులు చెల్లించేందుకు ఫ్రాంచైజీలు ఇష్టపడవు. 'ఐపీఎల్‌కు సంబంధించి బీసీసీఐ నిబంధనలు స్పష్టంగా ఉన్నాయి. దీని ప్రకారం లీగ్ ఆరంభానికి వారం ముందు కాంట్రాక్ట్ మొత్తంలో 15 శాతం, టోర్నీ జరిగే సమయంలో 65 శాతం, టోర్నీ ముగిశాక మిగిలిన 20 శాతం ఇవ్వాల్సి ఉంటుంది. తాజా పరిస్థితి అందరికీ తెలుసు. కాబట్టి ఇప్పుడు ఒక్క ఆటగాడికి కూడా రూపాయి ఇవ్వలేం' అని ఒక టీమ్ యజమాని స్పష్టం చేశారు. కరోనాలాంటి విపత్తు గురించి ఇన్సూరెన్స్ ఒప్పందాల్లో కూడా లేదు. 'బీమా నిబంధనల్లో కరోనా గురించి ప్రస్తావనే లేదు. కాబట్టి ఇన్సూరెన్స్ కంపెనీలు కూడా ఎలాంటి చెల్లింపులు జరపవు. ప్రతీ ఫ్రాంచైజీ ఆటగాళ్లకు చెల్లించాల్సిన మొత్తం సుమారు రూ. 75 కోట్లనుంచి రూ. 80 కోట్ల వరకు ఉంటుంది. ఆటనే జరగకపోతే మేం ఎక్కడినుంచి తెస్తాం' అని మరో ఫ్రాంచైజీ యజమాని వెల్లడించారు.

> *ఐపీఎల్ అంటే కొత్త కుర్రాళ్లకు ఒక కలల ప్రపంచం... తొలిసారి లీగ్‌లో ఆడే అవకాశం రావడంతో పాటు గుర్తింపు కోసం ఇది మంచి అవకాశం. ఆర్థికంగా ఆయా ఆటగాళ్లను ఆర్థికంగా స్థిరపరిచేందుకు ఒక్క సీజన్ సరిపోతుంది. అలాంటిది లీగ్ జరగకపోతే ఇక ఈ ఏడాది ఆట గురించి, డబ్బు గురించి మరచిపోవడమే!*

చర్చించాల్సి ఉంది!

కరోనా వల్ల ఆర్థిక వ్యవస్థ దెబ్బ తినడంతో ఆదాయం తగ్గి ఇప్పటికే ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ క్రికెట్ బోర్డులు తమ క్రికెటర్ల వేతనాల్లో కోత విధించేందుకు సిద్ధమవుతున్నాయి. భారత్‌లోనూ అలా జరిగితే ఐపీఎల్ మాత్రమే కాదు, దేశవాళీ క్రికెటర్లకు కూడా పూర్తి మొత్తం అందకపోవచ్చు. ప్రపంచంలో అత్యంత ధనిక బోర్డు అయిన బీసీసీఐ యువ ఆటగాళ్ల సంక్షేమం గురించి ఆలోచించాలని ఒక మాజీ క్రికెటర్ అభిప్రాయపడ్డాడు. 'ఐపీఎల్ రద్దయితే కోహ్లి, ధోనిలాంటి వారికి కూడా దెబ్బే. అయితే దానిని వారు తట్టుకోగలరు. మొదటి సారి లీగ్ ఆడబోతున్నవారికే ఆర్థికంగా సమస్య. ఏడాదంతా కష్టపడి అవకాశం దక్కించుకున్న రూ. 20 లక్షలు, రూ. 30 లక్షలు, రూ. 40 లక్షల కేటగిరీలో ఉన్న క్రికెటర్లకు మాత్రం చాలా కష్టం. బోర్డు వీరి గురించి ఆలోచిస్తే బాగుంటుంది' అని ఆయన సూచించారు. అయితే బోర్డు కోశాధికారి అరుణ్ ధుమాల్ మాత్రం దీనిపై ఇంకా స్పష్టత రాలేదని చెప్పారు. 'బీసీసీఐకి సంబంధించి ఐపీఎల్ అతి పెద్ద టోర్నమెంట్. అయితే కోతల గురించి ఇంకా చర్చ జరగలేదు. ముమ్ముందు మాట్లాడతాం. ఎందుకంటే ఇప్పుడున్న పరిస్థితుల్లో లెక్కలు, నష్టాల గురించి అంచనాలు వేయడం అంత సులువు కాదు. ఆఫీస్ బేరర్లందరూ సమావేశమైతే తప్ప గణాంకాల గురించి ఇప్పుడే చెప్పలేం' అని ఆయన స్పష్టం చేశారు. ఐపీఎల్ జరగకపోతే బీసీసీఐకి సుమారు 3 వేల కోట్ల వరకు నష్టం జరుగుతుందని ఒక అంచనా. ఈ నేపథ్యంలో మాజీ క్రికెటర్ అశోక్ మల్హోత్రా మాత్రం బోర్డును సమర్థించారు. 'బోర్డుకు డబ్బు వచ్చేదే క్రికెట్ నుంచి. అసలు ఆట జరగకపోతే ఆదాయం ఎలా. మనం కాస్త బుర్ర పెట్టి ఆలోచించాలి. ఆటగాళ్లపైనే కాదు దీని ప్రభావం చాలా మందిపై ఉంటుంది. అయితే ఇది బోర్డు తప్పు కాదు. ఎవరూ ఏమీ చేయలేని పరిస్థితి' అని ఆయన అభిప్రాయపడ్డారు.

'మహమ్మారి'తో పోలిస్తే కోత ఏపాటి: ఆసీస్ సారథి టిమ్ పైన్

మెల్‌బోర్న్: ప్రస్తుత పరిస్థితుల్లో ప్రపంచానికి కరోనా వైరసే అతి పెద్ద సమస్య అని... దాంతో పోల్చితే మా వేతనాల కోత చాలా చిన్న అంశమని ఆస్ట్రేలియా టెస్టు కెప్టెన్ టిమ్ పైన్ తేలిగ్గా కొట్టిపారేశాడు. తమ ఆటగాళ్లంతా కోతకు సిద్ధమేనని చెప్పాడు. క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) ఆటగాళ్ల వార్షిక కాంట్రాక్టుల ప్రకటనను వాయిదా వేసింది. కోవిడ్-19 వల్లే ఓ నెలపాటు వాయిదా వేసినట్లు తెలిపింది. ఇన్ని సమస్యల మధ్య కోత ఏపాటిది' అని అన్నాడు. మంగళవారం పైన్ వ్యాలెట్ (పర్సు) చోరీకి గురైంది. హోబర్ట్‌లోని తన ఇంటికి సమీపంలో రోడ్డుపై కారును పార్క్ చేయగా... కారులోనుంచే వ్యాలెట్‌ను మాయం చేశారు.

యూఎస్ ఓపెన్ ఎరీనా ఇప్పుడు హాస్పిటల్!

న్యూయార్క్: ప్రతియేటా ఆఖరి గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్‌కు వేదికయ్యే యూఎస్ ఓపెన్ ఎరీనా ఇప్పుడు కరోనా ఆసుపత్రిగా మారనుంది. అమెరికాలో 2 లక్షలకు పైగానే కరోనా బారిన పడ్డారు. దీంతో న్యూయార్క్ సిటీలోని యూఎస్ ఓపెన్ స్టేడియం ఇండోర్ సౌకర్యాలను 350 పడకల హాస్పిటల్‌గా మార్చాలని అక్కడి ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ ఆఫీస్ నిర్ణయించింది. లూయిస్ ఆర్మ్‌స్ట్రాంగ్ స్టేడియాన్ని పాకశాలగా మార్చనున్నారు. ఇందులో రోజూ డాక్టర్లు, ఇతర సహాయక సిబ్బందితో కలిపి మొత్తం 25 వేల మందికి భోజనాలు పెడతారు.

చేతులు కడుక్కొని వినండి

● రామ్‌గోపాల్ వర్మ

కరోనా వైరస్ గురించి దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ ఓ పాట రాసి, పాడారు. "కనిపించని పురుగు' అని కరోనా వైరస్ పై నేనే రాసి, పాడిన పాటని రేపు (బుధవారం) బయట పడేయబోతున్నాను... చేతులు కడుక్కొని వినండి" అని మంగళవారం సోషల్ మీడియాలో పేర్కొన్నారు రామ్‌గోపాల్‌వర్మ.



● యం.యం. కీరవాణి

● వందేమాతరం శ్రీనివాస్

స్ఫూర్తి నింపేలా...

కరోనా వైరస్ గురించి ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి పాటలు సిద్ధం చేస్తున్నారు మన సంగీత దర్శకులు. కోటి ''లెటజ్ ఫైట్ కరోనా..'' అంటూ వీడియో సాంగ్ విడుదల చేస్తే, యం.యం. కీరవాణి, వందేమాతరం శ్రీనివాస్ కూడా స్ఫూర్తి నింపే పాటలను కంపోజ్ చేసి, ఆడియోను విడుదల చేశారు. 'వియ్ విల్ స్టే ఎట్ హోమ్' అనే పాటను కీరవాణి స్వయంగా రాసి, ట్యూన్ చేసి ఆలపించారు. ఈ పాట కోసం ఆయన గతంలో 'స్టూడెంట్ నెం. 1' సినిమాకి కంపోజ్ చేసిన 'ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి' పాట ట్యూన్‌నే మళ్లీ తీసుకున్నారు. వందేమాతరం శ్రీనివాస్ ట్యూన్ చేసి, పాడిన 'కరోనా కరోనా నీతో యుద్ధం చేస్తాం..' పాటను నిజార్ రచించారు.

ప్రజల కోసం చేసిన పాట ఇది



● కోటి

''కరోనా వైరస్ ప్రభావం నేపథ్యంలో ప్రజల్ని చైతన్యపరిచేలా ఓ పాట చేస్తే బాగుంటుందనే ఆలోచన వచ్చింది. గిటార్ వాయిస్తూ ట్యూన్ చేయడం మొదలుపెట్టాను. ఆ ట్యూన్‌ని ఫోన్‌లో రికార్డు చేసి రచయిత శ్రీనివాస్ మౌళికి పంపించాను. మేమిద్దరం కలిసి ఓ సినిమాకి పని చేశాం. కానీ, ఆ సినిమా ఇంకా విడుదల కాలేదు.. పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. ఆ చిత్రంలోని పాటలన్నీ తనే రాశాడు. ఆ లిరిక్స్, అందులోని పదాలు నాకు బాగా నచ్చాయి. అందుకే నా ట్యూన్‌ని ఆయనకి పంపించి, కరోనా నేపథ్యంలో ప్రజల్ని బాగా చైతన్యపరిచేలా మంచి లిరిక్స్ రాయాలని చెప్పా.. అలా 'లైటజ్ ఫైట్ కరోనా' పాట చేశాం'' అని చెప్పారు సంగీతదర్శకుడు కోటి. ఇంకా ఈ పాట గురించి ఆయన మరిన్ని విశేషాలు చెప్పారు.

- నా ట్యూన్ విని శ్రీనివాస్ చరణం రాసి పంపించాడు. అప్పటికి ఇంగ్లిష్ పదాల్లేవు. ఈ పాట గురించి చర్చిద్దామని ఇంటికి రమ్మన్నాను. అప్పుడు ఇంగ్లిష్ పదాలు వచ్చాయి. ట్యూన్ కూడా చక్కగా కుదిరింది. నేను, మా అబ్బాయి రోషన్ కలిసి రికార్డ్ చేశాం. సమర్థ్ అనే కీ బోర్డ్ ప్లేయర్ కూడా నాకు రికార్డింగ్‌లో సహాయం చేశాడు.
- గిటార్‌తోనే ఈ పాటని కంపోజ్ చేశాను. చాలా బాగా వచ్చింది. కానీ, కొంచెం పెద్దగా ఉండటంతో నేను, రోషన్ కూర్చుని షార్ట్ చేశాం. గిటార్, వయొలిన్.. ఇలాంటి వాటితో మిక్స్ చేసి ఫైనల్ రికార్డింగ్ కోసం కృష్ణానగర్‌లోని ఓ రికార్డింగ్ స్టూడియోకి మెయిల్‌లో పంపించాను. అతను మొత్తం రికార్డింగ్ చేసి, క్లీన్‌గా అన్ని లెవల్స్ చూసుకుని తర్వాత నాకు పంపించాడు.
- ఈ పాటని ముందు నా స్నేహితులకు పంపించాను.. అందరూ చాలా బాగుందని అభినందించారు. అదే రోజు రాత్రి చిరంజీవిగారికి కూడా పంపించాను. ఉదయాన్నే ఆయన ఫోన్ చేసి, 'పాట చాలా బాగుంది. నాకు చాలా బాగా నచ్చింది. ఈ పాటకి వీడియో చేద్దాం' అన్నారు. 'మీరు మెగాస్టార్.. మీరు వీడియో చేస్తే ఇంకేం కావాలి.. అందరికీ బాగా చేరువవుతుంది' అన్నాను.
- చిరంజీవిగారే నాగార్జునగారికి ఫోన్ చేశారు. అలాగే ఆయనే వరుణ్ తేజ్, సాయిధరమ్‌తో పాడమని చెప్పారు. నిజానికి వెంకటేశ్‌గారు, మహేశ్‌బాబు, రామ్‌చరణ్.. ఇలా చాలామంది చేయాల్సింది. కానీ కుదరలేదు. అందుకే చిరంజీవిగారు, నాగార్జునగారు, వరుణ్‌తేజ్, సాయిధరమ్‌లతో రికార్డ్ చేశాం. చిరంజీవిగారు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో ఈ పాట ఇంత పాపులర్ అయింది.
- ఈ వెర్షన్ రిలీజ్ చేయకముందే నేను గిటారుతో చేసిన పాటను రిలీజ్ చేశాను. దానికి కూడా మంచి స్పందన వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మన తెలుగువారందరూ అభినందించారు. ఆ తర్వాత ఈ నలుగురితో చేసిన వీడియో యూట్యూబ్, వాట్సాప్ ఇలా.. సోషల్ మీడియాలోనూ బాగా వైరల్ అయింది.
- కమర్షియల్ సాంగ్స్ ఎన్నో చేశాను. కానీ మానవాళికి నా వంతు ప్రయత్నంగా ఈ పాట చేశాను. అందుకే చిరంజీవిగారు 'మా వంతు సాయం చేయాలి కదా' అన్నారు. ఆయన నాకు ఓ బ్రదర్‌లాగా అన్నమాట. మేము కలసి ఎన్నో సినిమాలు చేశాం.. అయితే అవి కమర్షియల్. కానీ, ఈ పాట ప్రజల కోసం. అందరి కోసం చేసిన ఈ పాటకి మంచి స్పందన రావడం చాలా సంతోషంగా ఉంది.
- మన తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డిగారు, కేసీఆర్‌గారు ప్రజల క్షేమం కోసం ఈ 'లాక్‌డౌన్‌ని' పక్కాగా అమలు చేస్తున్నారు. అందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరుకుంటున్నాను.

సినిమా

మిస్ యు

లాక్ డౌన్ కారణంగా తనకి, విష్ణు విశాల్‌కి మధ్య ఏర్పడ్డ దూరాన్ని అయిష్టంగా భావిస్తున్నారు బ్యాడ్మింటన్ క్రీడాకారిణి గుత్తా జ్వాల. ''మిస్ యు'' అంటూ బాయ్ ఫ్రెండ్ విష్ణు విశాల్‌తో దిగిన ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారామె. ఆ పోస్ట్‌కి స్పందిస్తూ.. ''ప్రస్తుతం సామాజిక దూరం పాటించాలి'' అని సరదాగా అన్నారు విష్ణు విశాల్. తమిళ నటుడు విష్ణు విశాల్, గుత్తా జ్వాల ప్రేమలో ఉన్నారు. ఆ విషయాన్ని ఇద్దరూ అధికారికంగా చెప్పకపోయినా ఇలాంటి ట్వీట్లు చెబుతున్నాయి. ఈ ఇద్దరూ ఈ ఏడాది పెళ్లి చేసుకోబోతున్నారని టాక్.

● విష్ణు విశాల్, గుత్తా జ్వాల



● అజయ్ దేవ్‌గన్

ఆ వార్తలు నిజం కాదు

''కాజోల్, నైసా గురించి అడుగుతున్న అందరికీ ధన్యవాదాలు. వాళ్లిద్దరూ బాగానే ఉన్నారు. వారి ఆరోగ్యం గురించి ప్రచారంలో ఉన్న వార్తలు నిజం కాదు'' అన్నారు అజయ్ దేవగన్. అసలు విషయం ఏంటంటే.. అజయ్-కాజోల్‌ల కుమార్తె నైసా సింగపూర్‌లో చదువుకుంటోంది. కుమార్తెను చూడడానికి కాజోల్ ఆ మధ్య సింగపూర్ వెళ్లారు. చదువు పూర్తి కావడంతో కుమార్తెను తీసుకుని ఇండియా వచ్చారామె. అయితే కాజోల్, నైసాకి కరోనా సోకిందనే వార్తలు మొదలయ్యాయి. ''ఆ వార్తలు నిజం కాదు. మా ఫ్యామిలీలో అందరి ఆరోగ్యం బాగుంది'' అని స్పష్టం చేశారు అజయ్ దేవగన్.

● శ్రీకాంత్

● సప్తగిరి

● సి.వెంకట గోవిందరాజులు

సినిమా కార్మికుల కోసం ఇటీవల ఏర్పాటు చేసిన 'సీసీసీ మన కోసం'' (కరోనా క్రైసిస్ చారిటి మనకోసం) కు ఇప్పటికే పలువురు తారలు విరాళాలు ఇచ్చారు. మంగళవారం శ్రీకాంత్ 5 లక్షలు, సప్తగిరి 2 లక్షలు, సి. వెంకట గోవింద రాజులు 2 లక్షలు ప్రకటించారు. ఇప్పటి వరకు 6 కోట్లపైనే విరాళం అందినట్లు ట్వీటర్‌లో తెలియజేశారు చిరంజీవి.

● కాజల్ అగర్వాల్, విజయ్

హిట్ కాంబినేషన్ రిపీట్

తమిళంలో హీరో విజయ్- హీరోయిన్ కాజల్ ది సూపర్ హిట్ కాంబినేషన్. ఈ ఇద్దరూ గతంలో 'తుపాకీ', 'జిల్లా', 'మెర్సల్' సినిమాల్లో కలసి నటించారు. తాజాగా ఈ సూపర్ హిట్ కాంబినేషన్ మరో సినిమాలో నటించబోతున్నారని సమాచారం. ప్రస్తుతం విజయ్ - మురుగదాస్ కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కనుంది. 2012లో వీరి కాంబినేషన్‌లో వచ్చిన 'తుపాకీ'కి ఇది సీక్వెల్ అని సమాచారం. 'తుపాకీ'లో నటించిన కాజల్‌నే కథానాయికగా తీసుకుంటే బాగుంటుందని మురుగదాస్ భావించారట. సన్ నెట్‌వర్క్ నిర్మించనున్న ఈ సినిమా విజయ్ కెరీర్లో 65వ సినిమా.

సాక్షి భవిత
సోమవారం నుంచి శుక్రవారం వరకు
స్వర్థయా వర్ధతే విద్య
బుధవారం
1-4-2020

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

ఫిన్‌టెక్.. కొలువులు భేష్!

ఫైనాన్షియల్ టెక్నాలజీ.. సంక్షిప్తంగా ఫిన్‌టెక్! ఇది ఇటీవల కాలంలో ఎంతో సుపరిచితంగా మారింది. నేటి డిజిటల్ యుగంలో ఫిన్‌టెక్ సంస్థల సంఖ్య ఏటేటా భారీగా పెరుగుతోంది. లోన్స్ మొదలు మ్యూచువల్ ఫండ్స్ వరకు.. డిజిటల్ విధానంలో కార్యకలాపాలు నిర్వహించుకునేలా.. వినియోగదారులకు సేవలం దిస్తున్నాయి ఫిన్‌టెక్ సంస్థలు! దాంతో ఫిన్‌టెక్ రంగం ఇప్పుడు యువతకు సరికొత్త కెరీర్‌గా వేదికగా నిలుస్తోంది. బ్యాచిలర్ డిగ్రీ నుంచి టెక్నికల్, ప్రొఫెషనల్ కోర్సుల అభ్యర్థుల వరకు.. వారి అర్హతలు, నైపుణ్యాలకు తగిన ఉద్యోగావకాశాలు కల్పిస్తోంది ఫిన్‌టెక్ రంగం! ఈ నేపథ్యంలో.... ఫిన్‌టెక్ ఉద్యోగాలు, అవసరమైన అర్హతలు, నైపుణ్యాల గురించి తెలుసుకుందాం...

- ఫిన్‌టెక్ సంస్థల్లో భారీగా ఉద్యోగావకాశాలు
- ఫిన్‌టెక్ విభాగంలో టాప్-5లో భారత్
- దాదాపు 2.5 వేల ఫిన్‌టెక్ సంస్థలు
- శరవేగంగా వృద్ధి చెందుతున్న రంగం

డిజిటల్ యుగం.. ఏ రంగంలో చూసినా.. టెక్నాలజీ ఆధారిత సేవలు. ప్రధానంగా స్మార్ట్‌ఫోన్స్‌తో.. వ్యక్తులు తమకు సంబంధించిన ఆర్థిక వ్యవహారాలన్నీ కాలు కదపకుండా చక్కబెట్టుకునే అవకాశం లభిస్తోంది. రుణాలు తీసుకోవడం మొదలు.. బీమా చెల్లింపులు, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్, మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు.. ఇలా అన్నిరకాల సేవలు స్మార్ట్‌ఫోన్‌లో ఒక్క క్లిక్‌తో జరిగిపోతున్నాయి. ఇదంతా సాధ్యమయ్యేలా చేస్తున్నాయి ఫిన్‌టెక్ సంస్థలు. మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ తరహా సేవలు అందించడంలో ముందుంటున్నాయి.

యాప్స్ ఆధారంగా.. ఒకే విండో

ఫిన్‌టెక్ సంస్థలు అందించే సేవలు అధికంగా మొబైల్ యాప్స్ రూపంలో ఉంటున్నాయి. ఉదాహరణకు ఇన్సూరెన్స్ పేమెంట్స్, అసెట్ మేనేజ్‌మెంట్, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్‌కు సంబంధించిన పలు రకాల సేవలను ఫిన్‌టెక్ సంస్థలు యాప్స్ ఆధారంగా వినియోగదారులకు అందిస్తున్నాయి. ఇప్పుడు మనందరికీ సుపరిచితమైన మొబైల్ వ్యాలెట్‌లు, ఆన్‌లైన్ పీర్ టు పీర్ లెండింగ్ వంటివి ఫిన్‌టెక్ సేవల పరిధిలోకే వస్తాయి.

మిలియన్ డాలర్ల రంగం

దేశంలో ఐదారేళ్ల క్రితమే ఫిన్‌టెక్ సేవలు ప్రారంభమయ్యాయి. ఈ రంగం ఏటేటా శరవేగంగా వృద్ధి చెందుతోంది. దేశంలో ఫిన్‌టెక్ రంగం ఈ ఏడాది 1520 మిలియన్ డాలర్లకు చేరుకోనుంది. 2023 నాటికి ఈ విలువ 2,580 మిలియన్ డాలర్లుగా ఉంటుందని అంచనా. ప్రధానంగా డిజిటల్ పేమెంట్స్, ఆల్టర్నేటివ్ ఫైనాన్సింగ్, పర్సనల్ ఫైనాన్స్, ఆల్టర్నేటివ్ లెండింగ్‌ల విభాగాల్లో ఫిన్‌టెక్ సంస్థల సేవలు విస్తరిస్తున్నాయి.

వినియోగదారులు

ఫిన్‌టెక్ సేవల వినియోగదారుల సంఖ్య కూడా పెరుగుతోంది. గతేడాది డిజిటల్ పేమెంట్స్ విభాగంలో 513.84 మిలియన్ల మంది ఫిన్‌టెక్ సంస్థల ద్వారా సేవలు పొందారు. వీరిసంఖ్య 2023 నాటికి 625.53 మిలియన్లకు చేరుకుంటుందని అంచనా. ఫిన్‌టెక్ సేవలకు పెరుగుతున్న ఆదరణను దృష్టిలోపెట్టుకొని కొత్త సంస్థలు పుట్టుకొస్తున్నాయి. ప్రస్తుతం జాతీయ స్థాయిలో దాదాపు రెండున్నర వేలకు పైగా సంస్థలు ఫిన్‌టెక్ విభాగంలో సేవలందిస్తున్నాయి. ఆయా సంస్థలకు నిపుణులైన మానవ వనరుల అవసరం ఏర్పడుతోంది.

రెండు లక్షల ఉద్యోగాలు

రానున్న రెండేళ్లలో ఫిన్‌టెక్ రంగంలో దాదాపు రెండు లక్షల ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని అంచనా. ఈ రంగంలో లభించే ఉద్యోగాల వివరాలు... » కస్టమర్ ఎక్విజిషన్ » ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ » బిగ్‌డేటా అనలిటిక్స్ » అప్లికేషన్ డెవలప్‌మెంట్ » ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ » సొల్యూషన్ ఆర్కిటెక్ట్స్ » హార్డ్‌వేర్ నెట్‌వర్కింగ్ » యూఐ/యూఎక్స్ డిజైనర్ » ప్రొడక్ట్ మేనేజర్ » ప్రొడక్ట్ ఇంజనీర్ » సేల్స్ అండ్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ » సోషల్ మీడియా మేనేజర్స్

ఫిన్‌టెక్ సేవలు

ఫిన్‌టెక్ సంస్థలు ప్రధానంగా ఆరు విభాగాల్లో వినియోగదారులకు సేవలందిస్తున్నాయి. అవి.. -డిజిటల్ లెండింగ్, -పేమెంట్ సర్వీసెస్, -సేవింగ్స్ అండ్ వెల్త్ మేనేజ్‌మెంట్, -రెమిటెన్సెస్, -పాయింట్ ఆఫ్ సేల్, -ఇన్సూరెన్స్. ప్రస్తుతం డిజిటల్ పేమెంట్స్, ఆన్‌లైన్ సర్వీసెస్‌కు విపరీతమైన ప్రాధాన్యం కనిపిస్తోంది. గత ఏడాది ఫిన్‌టెక్ రంగంలో 20శాతం వృద్ధి నమోదు కావడమే ఇందుకు నిదర్శనం. వచ్చే మూడేళ్లలో ఇది రెట్టింపు అవుతుందని.. కేవలం నగరాలు, పట్టణాలే కాకుండా.. గ్రామీణ ప్రాంతాలకు సైతం విస్తరించనుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆల్టర్నేటివ్ లెండింగ్, వెల్త్ మేనేజ్‌మెంట్, ఇన్సూర్ టెక్ పేరుతో ఫిన్‌టెక్ సంస్థలు తమ సేవలను ఈ ఏడాది చివరికి రెట్టింపు చేసే యోచనలో ఉన్నట్లు డెలాయిట్ సర్వేలో తేలింది.

ఉద్యోగ విభాగాలు

నాస్‌కామ్, మ్యాన్‌పవర్ గ్రూప్, డెలాయిట్ వంటి సంస్థలు కొన్ని రోజుల క్రితం నిర్వహించిన సర్వే ప్రకారం- ఫిన్‌టెక్ సంస్థల్లో ఉద్యోగాలు లభిస్తున్న ముఖ్యమైన విభాగాలు.. » సాఫ్ట్‌వేర్ -51 శాతం, » సేల్స్ అండ్ బిజినెస్ డెవలప్‌మెంట్ 16 శాతం » కోర్ ఫైనాన్స్-11శాతం » ప్లానింగ్ అండ్ కన్సల్టింగ్-4 శాతం » టాప్ మేనేజ్‌మెంట్ -4 శాతం. ఇటీవల కాలంలో ఫిన్‌టెక్ స్టార్టప్‌ల సంఖ్య కూడా పెరుగుతోంది. తాజాగా ప్రకటించిన 2020-21 బడ్జెట్‌లో సైతం ఫిన్‌టెక్ సంస్థలకు పలు ప్రోత్సాహకాలను ప్రకటించింది. దీంతో ఫిన్‌టెక్ స్టార్టప్ సంస్థల సంఖ్య సైతం పెరిగే అవకాశం ఉంది.

స్టార్టప్స్

ఫిన్‌టెక్ సంస్థల్లో సగటున 150 నుంచి 200 మంది వరకు ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఫిన్‌టెక్ స్టార్టప్‌ల్లో ఒక్కో సంస్థలో కనీసం పది మందికి ఉద్యోగాలు లభిస్తాయి. ఫిన్‌టెక్ రంగంలో పరోక్ష ఉపాధి అవకాశాలు సైతం అందుబాటులోకి వస్తున్నాయి. ప్రతి సంస్థలో కోర్ విభాగంలో ఒక కొలువుకు కొనసాగింపుగా అయిదు ఉద్యోగాలు లభిస్తున్నాయి. అంటే.. ఒక ప్రొడక్ట్ డిజైన్ స్థాయిలో ఒక నిపుణుడు ఉంటే.. ఆ తర్వాత దాన్ని వినియోగదారులకు చేర్చే వరకు ఐదు మంది ఉద్యోగుల అవసరం ఉంటుంది.

ప్రోత్సాహకాలు

ఫిన్‌టెక్ సంస్థల ఏర్పాటుకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు కూడా దోహదం చేస్తున్నాయి. పేమెంట్ బ్యాంక్స్‌కు అనుమతి ఇవ్వడం.. పేటీఎం, ఎయిర్‌టెల్ వంటి సంస్థలు పేమెంట్ బ్యాంక్స్‌ను ఏర్పాటు చేసి.. డిజిటల్ సేవలు అందిస్తుండటం తెలిసిందే. ప్రభుత్వ ఆధ్వర్యంలోనూ మొబైల్ ఆధారిత బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి రావడం కూడా ఫిన్‌టెక్ రంగంలో ఉద్యోగాల కల్పనకు అవకాశం కల్పిస్తోంది.

అర్హతలు

ఇంజనీరింగ్, టెక్నికల్ డిగ్రీలతోపాటు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ కోర్సులు పూర్తిచేసుకుంటే.. ఫిన్‌టెక్ రంగంలో కొలువులు దక్కించుకోవచ్చు. అదే విధంగా డేటా అనలిటిక్స్, బిగ్‌డేటా, రోబోటిక్స్ వంటి అంశాలను అకడమిక్ స్థాయిలోనే అభ్యసిస్తే మెరుగైన అవకాశాలు లభిస్తాయి. మరోవైపు సంప్రదాయ డిగ్రీ కోర్సుల ఉత్తీర్ణులు కస్టమర్ సపోర్ట్ విభాగాల్లో కొలువులు సొంతం చేసుకోవచ్చు.

నైపుణ్యాలు

ఫిన్‌టెక్ సంస్థల్లో కొలువులు ఖాయం చేసుకోవాలంటే.. ప్రస్తుతం అవసరమవుతున్న ప్రధాన నైపుణ్యాలు.. » ఐఓఎస్ డెవలప్‌మెంట్ » ఆండ్రాయిడ్ డెవలప్‌మెంట్ » సైట్ రిలయబిలిటీ ఇంజనీరింగ్(ఎస్ఆర్ఈ) » ఫుల్‌స్టాక్ డెవలప్‌మెంట్ నాలెడ్జ్ » అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్‌ఫేస్(ఏపీఐ) » బ్లాక్‌చైన్ టెక్నాలజీ. వీటిని పెంపొందించుకోవడానికి అభ్యర్థులు అడ్వాన్స్‌డ్ సర్టిఫికేషన్ కోర్సులను పూర్తిచేయడం ప్రయోజనకరంగా ఉంటుంది.

వేతనాలు ఆకర్షణీయం

ఫిన్‌టెక్ సంస్థల్లో ఆకర్షణీయ వేతనాలు లభిస్తున్నాయి. కోర్ టెక్నాలజీ సంబంధిత విభాగాల్లో.. ఏఐ ఇంజనీర్స్, డిజైనర్స్‌కు రూ.50వేల వరకు వేతనం లభిస్తోంది. ఇక యాప్ డెవలపర్స్, ఎస్ఈఓ, ఎస్ఈఎం విభాగాల్లో రూ.30వేల వరకు వేతనం ఖాయం. మార్కెటింగ్, సేల్స్ విభాగాల్లో పనిచేసే వారికి రూ.20 వేల నెల వేతనం అందుతోంది.

ఉద్యోగాన్వేషణ

ప్రస్తుతం ఫిన్‌టెక్ సంస్థల్లో నియామకాలు కొనసాగుతున్నాయి. కానీ.. వీటి గురించి ఎక్కువ మందికి అవగాహన ఉండట్లేదు. ఫిన్‌టెక్ కంపెనీల్లో ఉద్యోగాన్వేషణకు అనువైన సాధనం.. జాబ్ పోర్టల్స్. జాబ్ పోర్టల్స్‌లో తమకు ఆసక్తి ఉన్న విభాగంలోని ఫిన్‌టెక్ సంస్థల్లో ఉద్యోగాల గురించి తెలుసుకోవచ్చు.

ఫిన్‌టెక్.. ముఖ్యాంశాలు

- రెండేళ్లలో దాదాపు రెండు లక్షల కొత్త ఉద్యోగాలు.
- ఏఐ, ఎంఎల్ నిపుణులు, యాప్ డెవలపర్స్‌కు డిమాండ్.
- అంతేస్థాయిలో ఎస్ఈఎం, ఎస్ఈఓలకు అవకాశాలు.
- నెలకు రూ. 20 వేల నుంచి రూ. 70 వేల వరకు వేతనం.
- ప్రస్తుతం జాతీయ స్థాయిలో దాదాపు రెండున్నర వేల ఫిన్‌టెక్ సంస్థలు.

ఉద్యోగ సమాచారం

ఐఐసీఏలో ఖాళీలు

గురుగ్రామ్‌లోని భారత ప్రభుత్వ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ ఒప్పంద ప్రాతిపదికన పోస్టుల భర్తీకి వాక్ ఇన్‌లు నిర్వహిస్తోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 04
- **పోస్టుల వివరాలు:** సీనియర్ రీసెర్చ్ అసోసియేట్-01, పీహెచ్‌డీ స్కాలర్-01, రీసెర్చ్ అసోసియేట్-01, కన్సల్టెంట్- 01.
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ, పీజీ, ఐసీఎస్ఐ ఫైనల్ ఎగ్జామ్స్ ఉత్తీర్ణతతో పాటు అనుభవం ఉండాలి.
- **వాక్ ఇన్ తేదీ:** 01.04.2020
- **వేదిక:** ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్,ఐఎంటీ మనేసర్, గురుగ్రామ్
- **వెబ్‌సైట్:** https://iica.nic.in

ఎన్‌బీటీలో పోస్టులు

ఢిల్లీలోని నేషనల్ బుక్ ట్రస్ట్(ఎన్‌బీటీ) ఇండియా.. ఒప్పంద ప్రాతిపదికన ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 05
- **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ అసిస్టెంట్, కన్సల్టెంట్, ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్, అడ్మినిస్ట్రేటివ్ ఎగ్జిక్యూటివ్, మార్కెటింగ్ అసిస్టెంట్.
- **అర్హత:** పదో తరగతి, సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ, అనుభవం ఉండాలి.
- **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక జరుగుతుంది.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 13.04.2020
- **వెబ్‌సైట్:** https://www.nbtindia.gov.in

క్లాట్ 2020.. వాయిదా

- దరఖాస్తులకు కొత్త గడువు: 25 ఏప్రిల్ 2020
- క్లాట్ పరీక్ష కొత్త తేది: 24 మే 2020

కరోనా వైరస్ కారణంగా కామన్ లా అడ్మిషన్ టెస్ట్ (క్లాట్) 2020 పరీక్ష వాయిదా పడింది, దరఖాస్తు తేదీని పొడిగించారు. క్లాట్ 2020 పరీక్షను 22 జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాలు(ఎన్ఎల్‌యూ-నేషనల్ లా యూనివర్సిటీలు), 2538 అండర్ గ్రాడ్యుయేట్, 742 పీజీ సీట్లలో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్నాయి. దేశంలో 67 నగరాల్లో క్లాట్ 2020 పరీక్షను నిర్వహిస్తారు.

అందిస్తున్న కోర్సులు

బీఏ ఎల్ఎల్‌బీ, బీఎస్సీ ఎల్ఎల్‌బీ, బీకామ్ ఎల్ఎల్‌బీ, బీఎస్‌డబ్ల్యూ ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం

యూజీ పరీక్ష అర్హతలు

- అభ్యర్థి గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం లేదా బోర్డు నుంచి 10+2 లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి.
- క్లాట్ పరీక్షకు హాజరుకావాలంటే.. కనీసం 45 శాతం మార్కులతో డిగ్రీ పూర్తిచేసుకోవాలి.
- ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు డిగ్రీలో 40 శాతం మార్కులతో పాసయ్యుండాలి.
- ఎలాంటి గరిష్ట వయోపరిమితి నిబంధన లేదు.
- 2020 మార్చి/ఏప్రిల్‌లో ఇంటర్ పరీక్షలు రాసే అభ్యర్థులు కూడా అర్హులే.
- ప్రశ్నాపత్రం ఇంటర్ స్థాయిలో ఉంటుంది.

పీజీ పరీక్షకు అర్హతలు

- అభ్యర్థి గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఎల్ఎల్‌బీ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి.
- జనరల్/ఓబీసీ/పీబ్ల్యూడీ వర్గాలకు చెందిన అభ్యర్థులకు కనీసం 55 శాతం మార్కులు రావాలి.
- ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు కనీస మార్కులలో 5 శాతం సడలింపు లభిస్తుంది.
- గరిష్ట వయో పరిమితి నిబంధన లేదు
- 2020 మార్చి/ఏప్రిల్‌లో ఫైనల్ పరీక్షలు రాసే అభ్యర్థులు కూడా అర్హులే.

పరీక్ష విధానం

క్లాట్ పరీక్ష ఆఫ్‌లైన్ (పెన్, పేపర్ విధానం)లో రెండు గంటల వ్యవధిలో జరుగుతుంది. పరీక్షలో ఆబ్జెక్టివ్ తరహాలో 150 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి సరైన సమాధానానికి ఒక మార్కు లభిస్తుంది. నెగిటివ్ మార్కుల విధానం ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కుల్లో కోత వేస్తారు. క్లాట్ యూజీలో ఇంగ్లిష్, మ్యాథమెటిక్స్, జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, లాజికల్ రీజనింగ్, లీగల్ అప్టిట్యూడ్ అంశాలపై ప్రశ్నలు అడుగుతారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ /ఓబీసీ అభ్యర్థులు రూ.4000/-; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.3500/- దరఖాస్తు ఫీజు చెల్లించాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ముగింపు పాత తేది:** 31 మార్చి 2020
- **దరఖాస్తులకు ముగింపునకు కొత్త తేది:** 25 ఏప్రిల్ 2020
- **క్లాట్ పరీక్ష పాత తేది:** 10 మే 2020
- **క్లాట్ పరీక్ష కొత్త తేది:** 24 మే 2020
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.clat.ac.in

ఎంసెట్ ప్రత్యేకం
- స్టడీమెటీరియల్
- బిట్ బ్యాంక్
- ఆన్‌లైన్ టెస్టులు
- మోడల్ పేపర్స్
- ప్రీవియస్ పేపర్స్

విద్య, ఉద్యోగ సమాచారం కోసం
WWW.SAKSHIEDUCATION.COM
SAKSHI CURRENT AFFAIRS
యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి

వైద్య సేవల్లో ముందుండే.. పారామెడికల్!



పారామెడికల్ సిబ్బంది.. రోగ నిర్ధారణలో, చికిత్సలో, వ్యాధిని తగ్గించి రోగికి ఉపశమనం కల్పించడంలో వీరి పాత్ర ఎంతో కీలకం. ఈసీజీ, స్కానింగ్‌లు, రక్త పరీక్షలు వంటి అనేక రకాల పరీక్షలు నిర్వహించి డాక్టర్లకు రిపోర్టులు ఇస్తారు. తద్వారా వ్యాధి నిర్ధారణలో వైద్యులకు సహాయపడతారు. సంబంధిత పారామెడికల్ కోర్సులను పూర్తిచేయడం ద్వారా ఆయా నైపుణ్యాలు సొంతం చేసుకుంటారు. వాస్తవానికి ఇంటర్ బైపీసీ విద్యార్థులు ఎంబీబీఎస్/ బీడీఎస్/ బీహెచ్ఎంఎస్/ నర్సింగ్/ బీవీఎస్‌సీ/ఫార్మసీ/ఆయూష్ కోర్సులను లక్ష్యాలుగా చేసుకుంటారు. వీటితోపాటు 'పారామెడికల్ కోర్సుల'నూ ఎంపికచేసుకోవచ్చు. తద్వారా తక్షణం ఉపాధికి మార్గం వేసుకోవచ్చు. పదో తరగతి, ఇంటర్మీడియెట్ పూర్తిచేసుకున్న అభ్యర్థులకు అందుబాటులో ఉన్న పారామెడికల్ కోర్సుల గురించి తెలుసుకుందాం...

పారా మెడికల్ కోర్సులు

పారామెడికల్‌కు సంబంధించి డిగ్రీ స్థాయి కోర్సులు » డిప్లొమా కోర్సులు » సర్టిఫికేట్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

డిగ్రీ స్థాయి పారామెడికల్ కోర్సులు

బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ, బ్యాచిలర్ ఆఫ్ ఆక్యుపేషనల్ థెరపీ, ఓటీటీ (ఆపరేషన్ థియేటర్ టెక్నాలజీ)లో బీఎస్సీ; డయాలసిస్ టెక్నాలజీలో బీఎస్సీ; ఎంఎల్‌టీ(మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ)లో బీఎస్సీ; ఎక్స్-రే టెక్నాలజీలో బీఎస్సీ; రేడియోగ్రఫీలో బీఎస్సీ; మెడికల్ ఇమేజింగ్ టెక్నాలజీలో బీఎస్సీ; మెడికల్ రికార్డ్ టెక్నాలజీలో బీఏఎస్ఎల్పీ; ఆప్తాల్మిక్ టెక్నాలజీలో బీఎస్సీ; బీఎస్సీ ఆడియాలజీ; స్పీచ్ థెరపీలో బీఎస్సీ; ఆప్టోమెట్రీలో బీఎస్సీ; అనస్తీషియా టెక్నాలజీలో బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశం పొందొచ్చు.

- పైన పేర్కొన్న పలు బ్యాచిలర్ డిగ్రీ కోర్సుల కాల వ్యవధి 3 ఏళ్లు. వీటిల్లో కొన్ని కోర్సుల కాల వ్యవధి 4 ఏళ్లుగా ఉంది.
- **అర్హత:** బయాలజీ సబ్జెక్టుతో 10+2 ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు డిగ్రీ స్థాయి పారామెడికల్ కోర్సుల్లో చేరేందుకు అర్హులు.

పారామెడికల్ డిప్లొమా కోర్సులు

ఫిజియోథెరపీలో డిప్లొమా, ఆక్యుపేషనల్ థెరపీలో డిప్లొమా, డాట్(డిప్లొమా ఇన్ ఆపరేషన్ థియేటర్ టెక్నాలజీ), డయాలసిస్ టెక్నాలజీలో డిప్లొమా; డీఎంఎల్‌టీ(డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ), ఎక్స్-రే టెక్నాలజీలో డిప్లొమా, రేడియోగ్రఫీలో డిప్లొమా, డిప్లొమా ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నాలజీ, డిప్లొమా ఇన్ మెడికల్ రికార్డ్ టెక్నాలజీ, డిప్లొమా ఇన్ నర్సింగ్ కేర్ అసిస్టెంట్, ఏఎన్ఎం, జీఎన్ఎం, ఆప్తాల్మిక్ టెక్నాలజీలో డిప్లొమా, డీహెచ్ఎల్ఎస్ (డిప్లొమా ఇన్ హియరింగ్ అండ్ లాంగ్వేజ్ అండ్ స్పీచ్), అనస్తీషియా టెక్నాలజీలో డిప్లొమా, డిప్లొమా ఇన్ డెంటల్ హైజినిస్ట్, గ్రామీణ ఆరోగ్య సంరక్షణలో డిప్లొమా, కమ్యూనిటీ హెల్త్‌కేర్‌లో డిప్లొమా కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

- పారామెడికల్ డిప్లొమా కోర్సుల కాల వ్యవధి ఒక ఏడాది నుంచి 3 ఏళ్ల మధ్య ఉంటుంది.
- **అర్హత:** డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు పదో తరగతి, ఇంటర్ చదివిన విద్యార్థులు అర్హులు.

సర్టిఫికేట్ పారామెడికల్ కోర్సులు

ఎక్స్-రే టెక్నీషియన్‌లో సర్టిఫికేట్, ల్యాబ్ అసిస్టెంట్/టెక్నీషియన్‌లో సర్టిఫికేట్, డెంటల్ అసిస్టెంట్‌లో సర్టిఫికేట్, ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్‌లో సర్టిఫికేట్, నర్సింగ్ కేర్ అసిస్టెంట్‌లో సర్టిఫికేట్, ఈసీజీ, సీటీ స్కాన్ టెక్నీషియన్లలో సర్టిఫికేట్, డయాలసిస్ టెక్నీషియన్‌లో సర్టిఫికేట్, గృహ ఆధారిత ఆరోగ్య సంరక్షణలో సర్టిఫికేట్, గ్రామీణ ఆరోగ్య సంరక్షణలో సర్టిఫికేట్,హెచ్ఐవీ, కుటుంబ విద్యలో సర్టిఫికేట్, న్యూట్రీషన్, పిల్లల సంరక్షణలో సర్టిఫికేట్ కోర్సుల్లో ప్రవేశం పొందొచ్చు. • సర్టిఫికేట్ పారామెడికల్ కోర్సుల కాల వ్యవధి 6నెలల నుంచి 2 ఏళ్ల మధ్య ఉంటుంది. వీటికి కనీస అర్హత పదో తరగతి.

ప్రవేశాలు

బైపీసీ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ, నిమ్స్, ఆయా రాష్ట్రీయ, కేంద్రీయ యూనివర్సిటీలు ప్రతిఏటా విడుదల చేసే నోటిఫికేషన్‌లకు అనుగుణంగా దరఖాస్తు చేసుకోవచ్చు. సంబంధిత ప్రవేశ పరీక్షల్లో అర్హత సాధించడం ద్వారా తమకు నచ్చిన పారామెడికల్ కోర్సుల్లో చేరే వీలుంది. పలు పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు విద్యార్హతలో సాధించిన మెరిట్‌ను పరిగణనలోకి తీసుకుంటారు.

వేతనాలు

పారామెడికల్ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు కెరీర్ ప్రారంభ దశలో.. పారామెడికల్ టెక్నీషియన్లుగా పనిచేయాలి. వారికి జీతం సుమారు రూ.5,000 నుంచి రూ.8,000 ఉంటుంది. కార్పొరేట్ ఆసుపత్రులలో పనిచేస్తే జీతం రూ.8000 నుంచి రూ.12,000 వరకు ఉంటుంది. అనుభవం, నైపుణ్యం ఆధారంగా నెలవారీ జీతం రూ. 30,000 వరకు ఉండవచ్చు.

ఉపాధి మార్గాలు

- ఈ కోర్సులు పూర్తిచేసినవారు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు, ప్రభుత్వ విభాగాలు, ఆరోగ్య సంబంధిత కార్యకలాపాలలో నిమగ్నమైన సంస్థలలో ఉద్యోగాలు పొందవచ్చు.
- పారామెడికల్ కోర్సులు చేసినవారికి ఉపాధి అవకాశాలు మెరుగవుతున్నాయి. దేశంలోనే కాకుండా..యూఎస్ఎ, యూఎఈ, యూకె, కెనడా వంటి విదేశాలలో కూడా డిమాండ్ పెరుగుతోంది. నర్సింగ్ హోమ్, హాస్పిటల్, క్లినిక్‌లు, ఆరోగ్య విభాగాల్లో ఉద్యోగాలతోపాటు సొంతంగా క్లినిక్‌లను ఏర్పాటు చేసుకోవచ్చు.

కౌలాలంపూర్ నుంచి అంటుకుందా?

నిజాముద్దీన్ మసీదుకు జమాత్ కోసం వచ్చిన వారిని ఆస్పత్రికి తరలిస్తున్న అధికారులు

అక్కడ తబ్లిగి జమాత్ సదస్సుకు హాజరైన వారికి కరోనా పాజిటివ్

- అక్కడి నుంచి నిజాముద్దీన్ మర్కజ్‌కు ఇండోనేసియన్లు, ఇతర దేశస్తులు
- నిజాముద్దీన్ నుంచి దేశం నలుమూలలా పాకిన వైరస్: కేంద్ర హోం శాఖ

సాక్షి, న్యూఢిల్లీ: మలేసియా రాజధాని కౌలాలంపూర్‌లో జరిగిన ఒక్క సదస్సు దక్షిణాసియాలోని అనేక దేశాలు ఇప్పుడు వణికిపోయేలా చేస్తోంది. దక్షిణాసియాలోని పలు దేశాల్లో కరోనా సోకిన వారిలో అత్యధికులు తబ్లిగి జమాత్ సదస్సులకు హాజరైన వారే ఉన్నారు. నిజాముద్దీన్ మర్కజ్ కేంద్రంగా అంతర్జాతీయంగా ఇస్లాం మత బోధన చేస్తున్న తబ్లిగి జమాత్ సంస్థకు వందేళ్ల చరిత్ర ఉంది. ప్రవక్త చెప్పిన ఇస్లాం జీవనశైలి కలిగి ఉండాలని బోధిస్తుంది. ఈ సంస్థ కౌలాలంపూర్‌లోని పెటాలింగ్ మసీదులో ఫిబ్రవరి 27 నుంచి మార్చి 1 వరకు 16 వేల మందితో సదస్సు నిర్వహించింది. దీనికి 1500 మంది విదేశీయులు హాజరయ్యారు. సదస్సుకు హాజరైన 34 ఏళ్ల మలేసియన్ 17న మృతిచెందాడు. అక్కడి పాజిటివ్ కేసుల్లో మూడోవంతు కేసులు జమాత్‌తో సంబంధాలు ఉన్న వ్యక్తులవేనని వార్తలొచ్చాయి. సదస్సుకు హాజరైన ప్రతినిధులు తమ సొంత దేశాల్లో, ఇతర దేశాల్లో ఆ వైరస్ వ్యాప్తికి కారణమయ్యారు. కౌలాలంపూర్ సదస్సుకు హాజరైన ఇండోనేసియన్లలో 31 మంది ఢిల్లీలోని నిజాముద్దీన్ సమావేశాల్లో పాల్గొన్నారు.

నిజాముద్దీన్ మర్కజ్‌కు ఇలా..

ఢిల్లీలోని నిజాముద్దీన్‌లో ఉన్న తబ్లిగి జమాత్ మర్కజ్‌కు దేశ, విదేశాల నుంచి ప్రతినిధులు వచ్చి దేశవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఇది ఏడాది పొడవునా జరుగుతుంది. తబ్లిగి జమాత్ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు జనవరి 1 నుంచి మన దేశానికి 2,100 మంది ప్రతినిధులు రాగా.. మార్చి 21 నాటికి 1040 మంది ప్రతినిధులు దేశంలోనే ఉన్నారని, మిగిలిన వారు లాక్ డౌన్‌కు ముందే వెళ్లిపోయి ఉంటారని కేంద్ర హోం శాఖ తెలిపింది. మార్చి 21 నాటికి దేశవ్యాప్తంగా 824 మంది విదేశీ ప్రతినిధులు దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఉండగా.. మర్కజ్‌లో 216 మంది ఉన్నారని ప్రకటించింది. 1500 మంది స్వదేశీ ప్రతినిధులు మర్కజ్‌లో ఉన్నట్టు తెలిపింది. 2,100 మంది స్వదేశీ ప్రతినిధులు దేశవ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహించే పనిలో ఉన్నట్టు తెలిపింది. ఢిల్లీలో మార్చి 13–15తేదీల్లో 'ఇజ్తెమా' పేరుతో జరిగిన సమావేశాలకు నాలుగైదు వేల మంది స్వదేశీ, విదేశీ ప్రతినిధులు హాజరైనట్టు తెలుస్తోంది. ఈ సమావేశాలకు ముందే కౌలాలంపూర్ సదస్సులో పాల్గొన్న 31 మంది ఇండోనేసియా దేశస్తులు, ఇతర దేశస్తులు ఢిల్లీ చేరుకుని మర్కజ్‌లో సమావేశాలకు హాజరైనట్టు తెలుస్తోంది.

దేశం నలుమూలలకు.. : 'ఇజ్తెమా' ముగిసిన తరువాత మార్చి 16 నుంచి అనేకమంది తమ స్వస్థలాలకు వెళ్లడం ప్రారంభించారు. మార్చి 22 నాటి జనతా కర్ఫ్యూ అనంతరం మార్చి 23న 1500 మంది స్వస్థలాలకు వెళ్లిపోయారని, లాక్‌డౌన్ ప్రకటనతో సమావేశాలు నిలిపి వేశామని, కానీ విధిలేని పరిస్థితుల్లో వెయ్యి మంది అందులోనే ఉండిపోవాల్సి వచ్చిందని తబ్లిగి జమాత్ వెల్లడించింది. వీరిని స్వస్థలాలకు చేర్చేందుకు వాహనాలను అనుమతించాల్సిందిగా తాము సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్‌కు లేఖ రాశామని, ఇదే విషయాన్ని హజ్రత్ నిజాముద్దీన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో ఇచ్చిన నోటీస్‌కు జవాబులో తెలిపామని వివరించింది. చట్టబద్ధమైన ఆదేశాలను తాము ఉల్లంఘించలేదని పేర్కొంది. అయితే తాజాగా వీరిలో 24 మందికి కరోనా పాజిటివ్ తేలిందని, కరోనా లక్షణాలు ఉన్న 411 మందిని ఆసుపత్రులకు పంపామని ఢిల్లీ సీఎం ప్రకటించారు. ఢిల్లీలో ఇప్పటివరకు 1339 మంది జమాత్ ప్రతినిధులను క్వారంటైన్‌కు తరలించామని హోం శాఖ ప్రకటించింది. టూరిస్ట్ వీసాపై వచ్చి మతపరమైన మిషనరీ పనుల్లో పాల్గొనరాదని ఇదివరకే హోం శాఖ ఆదేశాలు ఉన్నాయని, వాటిని ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకునేందుకు వీలుగా ఆయా ప్రతినిధుల వీసా కేటగిరీని తనిఖీ చేయాలని రాష్ట్రాల పోలీస్ యంత్రాంగానికి సూచనలు ఇచ్చామని తెలిపింది. దేశవ్యాప్తంగా పనిచేస్తున్న 824 మంది విదేశీ ప్రతినిధులను, వారికి జిల్లాల వారీగా, స్థానికంగా సమన్వయం చేస్తున్న 2,137 మంది స్వదేశీ ప్రతినిధులను స్క్రీనింగ్ చేసి క్వారంటైన్‌కు తరలించినట్టు తెలిపింది. వీరందరూ ఎక్కడెక్కడ తిరిగారో వారి కదలికలను గుర్తించాలని రాష్ట్రాలను మార్చి 29న ఆదేశించినట్టు తెలిపింది.

పాజిటివ్ కేసులు ఇలా వెలుగులోకి..

నిజాముద్దీన్ సమావేశాలకు హాజరై స్వస్థలాలకు వెళ్లిన వారిలో పలువురికి కరోనా సోకింది. ఢిల్లీ నుంచి సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్‌లో రామగుండంకు వచ్చిన ఇండోనేసియన్లలో 10 మందికి మార్చి 20నే పాజిటివ్ అని తేలింది. ఈ సదస్సుకు హాజరైన కశ్మీర్‌కు చెందిన ఓ వ్యక్తి మార్చి 26న తన స్వస్థలంలో కరోనాతో మరణించారు. మార్చి 27న మర్కజ్ నుంచి ఆరుగురిని, 28న 33 మందిని క్వారంటైన్‌కు తరలించారు. ఈ సమావేశాలకు హాజరైన వారిలో ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 9 మంది చనిపోయినట్టు తెలుస్తోంది. అండమాన్‌లో బయటపడ్డ పాజిటివ్ కేసులకు మర్కజ్ సమావేశాలకు సంబంధం ఉన్నట్టు తేలింది.

ఇతర దేశాల్లోనూ ఇదే తీరు..

దక్షిణాసియాలోని వివిధ దేశాల్లో కేసులకు కౌలాలంపూర్ సదస్సుకు లింక్ ఉన్నట్టు స్పష్టమవుతోంది. మలేషియాలో 2,400 కేసుల్లో మూడోవంతు కేసులకు ఈ సదస్సుకు సంబంధం ఉందని అక్కడి వార్తా సంస్థలు చెబుతున్నాయి. లాహోర్ సమీపంలో గల రాయ్‌విండ్‌లో తబ్లిగీ జమాత్ అక్కడి మర్కజ్‌లో వార్షిక సదస్సు నిర్వహించినట్టు తెలుస్తోంది. దీంతో అక్కడ సభ్యులు 27 మంది కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది.

ఏ ప్రాంతాల వారు హాజరయ్యారు

మర్కజ్‌కు గడిచిన రెండు నెలలుగా ఇండోనేసియా, నేపాల్, మలేసియా, థాయ్‌లాండ్, శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్, మయన్మార్, అల్జీరియా, కిర్గిస్తాన్, ఇంగ్లండ్, సింగపూర్ దేశాలకు చెందిన 2,100 మంది ప్రతినిధులు హాజరయ్యారు. అలాగే మన దేశం నుంచి 20కి పైగా రాష్ట్రాలకు చెందిన దాదాపు ఐదారు వేలకు మందికి పైగా ప్రతినిధులు హాజరైనట్టు ప్రాథమిక అంచనా. తబ్లిగి సమావేశాలకు హాజరైన వారిని గుర్తించేందుకు పశ్చిమ బెంగాల్, అసోం, మణిపూర్‌లతోపాటు కర్ణాటక, గుజరాత్ ప్రభుత్వాలు ప్రయత్నాలు ప్రారంభించాయి. కర్ణాటక నుంచి 54 మంది పాల్గొనగా 13 మందిని గుర్తించామని వీరందరికీ వైరస్ సోకలేదని పరీక్షల ద్వారా స్పష్టమైందని ఆ రాష్ట్రం తెలిపింది.హిమాచల్ ప్రదేశ్ నుంచి 17 మంది ఈ సమావేశాలకు హాజరయ్యారని అంచనా. కాగా దేశవ్యాప్తంగా తబ్లిగి జమాత్ సంస్థ కార్యక్రమాలు నిర్వహిస్తున్న 824 మంది విదేశీ ప్రతినిధుల వివరాలను కేంద్రం సేకరించింది. ఇలా తెలంగాణలో 82 మంది, ఆంధ్ర ప్రదేశ్‌లో 24 మంది విదేశీ ప్రతినిధులు ఉన్నట్టు తెలిపింది.

మే చివరి వారంలో జేఈఈ మెయిన్స్ !

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా పలు ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశం కల్పించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ జేఈఈ మెయిన్స్ పరీక్ష మే నెల చివరి వారంలో నిర్వహించే అవకాశం ఉందని మానవ వనరుల అభివృద్ధి శాఖకు చెందిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ మంగళవారం తెలిపింది. ఈ పరీక్షలు ఏప్రిల్ 5–11 వరకు జరగాల్సి ఉంది. రానున్న వారాల్లో పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేస్తామని తెలిపింది. ఏప్రిల్ 15 తర్వాత అప్పటి పరిస్థితులను బట్టి అడ్మిట్ కార్డులు విడుదల చేస్తామంది. ఐఐటీలు, ఎన్ఐటీల్లో ప్రవేశాలకు జేఈఈ పరీక్ష రాయాల్సి ఉంటుంది.

రిటైర్మెంట్ గడువు పెంచం: కేంద్రం

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ ప్రక్రియ యథావిధిగా కొనసాగుతుందని, గడువు పొడిగించే ప్రతిపాదనేదీ లేదని కేంద్రం స్పష్టం చేసింది. పదవీ విరమణ వయస్సు ముగిసిన వారు నిబంధనల మేరకు మార్చి 31వ తేదీన రిటైర్ కావాల్సిందేనని తెలిపింది. దేశవ్యాప్తంగా అసాధారణ పరిస్థితులున్నప్పటికీ ఉద్యోగుల పదవీ కాలాన్ని పెంచడం లేదని సిబ్బంది శాఖ వివరించింది. లాక్‌డౌన్ కారణంగా వారు ఇంటి వద్ద నుంచి పనిచేస్తున్నా లేదా కార్యాలయానికి హాజరవుతున్నా నిబంధన –56 ప్రకారం మార్చి 31, 2020న రిటైర్ కావాల్సిందేనని పేర్కొంది.

ప్రభుత్వం ఆ రోజులను లెక్కించదు

న్యూఢిల్లీ గడువు ముగిసేలోగా సస్పెన్షన్ ఉత్తర్వులను సమీక్షించడం, ప్రభుత్వాధికారులు స్వచ్ఛంద పదవీ విరమణ నోటీసులను అంగీకరించడం వంటివి లాక్ డౌన్ సమయంలో పరిగణించబోమని కేంద్ర సిబ్బంది శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పలు విధుల గడువు కాలాన్ని పెంచనున్నట్లు తెలిపింది. ఉదాహరణకు ఒక పనిని పూర్తి చేయడానికి ప్రభుత్వం 20 రోజుల గడువు విధిస్తే, లాక్ డౌన్ మధ్యలో రావడం వల్ల ఆ పని ఆగిపోతుంది. ఈక్రమంలో లాక్‌డౌన్ కాలాన్ని ప్రభుత్వం పరిగణించదు. లాక్‌డౌన్ ఎత్తివేశాక ఆ పనిని పూర్తి చేసేందుకు మళ్లీ 20 రోజుల కాలం ఉంటుంది. విధిని పూర్తి చేసేందుకు 15 రోజుల కంటే తక్కువ సమయం ఉంటే, లాక్ డౌన్‌తర్వాత దాన్ని పూర్తి చేసేందుకు 15 రోజుల వరకూ గడువు ఉంటుంది.

రైలు బోగీల్లో 3.2 లక్షల ఐసోలేషన్ బెడ్లు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 16 రైల్వే జోన్లలోని 20 వేల బోగీలను ఐసోలేషన్ వార్డులుగా మార్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు రైల్వే శాఖ తెలిపింది. వీటితో కరోనా బాధితుల కోసం సుమారు 3.2 లక్షల ఐసోలేషన్ బెడ్లు సిద్ధమవుతాయని పేర్కొంది. ఐసోలేషన్ బెడ్లు ఏర్పాటు చేసేందుకు సికింద్రాబాద్ కేంద్రంగా ఉన్న దక్షిణమధ్య రైల్వేకు అత్యధికంగా 486 కోచ్‌లు, ఆ తర్వాత మహారాష్ట్రలోని సెంట్రల్ రైల్వే 482 కోచ్‌లను అప్పగించినట్లు వెల్లడించింది. బోగీకి 16 చొప్పున 5 వేల బోగీల్లో 80 వేల బెడ్ల ఏర్పాటు ఇప్పటికే మొదలైందని వెల్లడించింది.

ఔషధాల కొరత లేదు

న్యూఢిల్లీ: కరోనా వైరస్‌పై పోరుకు సంబంధించి అవసరమైన ఔషధాల విషయంలో ఎలాంటి కొరత లేదని కేంద్రం స్పష్టం చేసింది. కేంద్ర ఔషధ విభాగం మందుల ఉత్పత్తి, సరఫరాను నిత్యం సమీక్షిస్తోందని పేర్కొంది. కరోనా నేపథ్యంలో తలెత్తుతున్న సమస్యలను రాష్ట్రాలు, ఇతర విభాగాల సాయంతో వెంటనే పరిష్కరిస్తోందని వివరించింది. అన్ని అత్యవసర ఔషధాలను అవసరమైన స్థాయిలో సిద్ధంగా ఉంచాలని ఔషధ తయారీ సంస్థలను నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ ఆదేశించింది.

విదేశాల్లోనూ టీకాను పరీక్షిస్తాం: చైనా

బీజింగ్: కరోనాను నిర్మూలించే టీకాను రూపొందించే పనిలో ఉన్న చైనా.. ఆ వ్యాక్సిన్‌ను కరోనా తీవ్ర ప్రభావం చూపిన దేశాల్లోనూ పరీక్షించాలనుకుంటోంది. వుహాన్‌లో నిర్వహిస్తున్న పరీక్షల్లో ఆ టీకా సురక్షితమేనని, ప్రభావవంతమేనని తేలితే విదేశాల్లోనూ ట్రయల్స్ నిర్వహించే అవకాశముందని చైనీస్ అకాడెమీ ఆఫ్ ఇంజినీరింగ్‌లో శాస్త్రవేత్తగా పనిచేస్తున్న చెన్ వీ వెల్లడించారు. టీకా ప్రాథమిక స్థాయి క్లినికల్ ట్రయల్స్ మార్చి 16న వుహాన్‌లో ప్రారంభమయ్యాయన్నారు. చైనాలోని విదేశీయులపై టీకాను పరీక్షిస్తామన్నారు. చాలా దేశాలు తాము పరీక్షిస్తున్న టీకాపై ఆసక్తి చూపాయని ఆమె తెలిపారు. వ్యాక్సిన్ రూపకల్పనలో విదేశీ సంస్థలకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

పుతిన్‌ను కలిసిన డాక్టర్‌కు..

మాస్కో: గతవారం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను కలిసిన ఒక డాక్టర్‌కు కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. మాస్కోలోని ప్రత్యేక కరోనా ఆసుపత్రి చీఫ్‌గా పనిచేస్తున్న డెనిస్ ప్రాట్సెంకొ గత మంగళవారం పుతిన్ కొమునార్క ఆసుపత్రిని సందర్శించిన సమయంలో పుతిన్‌తో పాటు ఉన్నారు. ఆ డాక్టర్‌కు కరోనా సోకినట్లుగా తాజాగా నిర్ధారణ అయింది. అయితే, హాస్పిటల్‌కు వెళ్లిన సమయంలో పుతిన్ హజ్మత్ సూట్‌ను ధరించి ఉన్నారు. పుతిన్‌కు ఆరోగ్య పరీక్షలు జరిగాయని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రష్యా ప్రకటించింది.

చైనా అడవుల్లో మంటలు: 19 మంది మృతి

బీజింగ్: చైనాలోని సిచువాన్ ప్రావిన్స్ పరిధిలోని అడవుల్లో సోమవారం ఉదయం మంటలు చెలరేగాయి. ఈ దుర్ఘటనలో 19 మంది మృతి చెందారని జిన్హువా వార్తా సంస్థ తెలిపింది. మరణించిన వారిలో 18 మంది అగ్నిమాపక సిబ్బంది కాగా, వారికి దారి చూపిన స్థానిక వ్యవసాయ కూలీ ఒకరు ఉన్నారు. ప్రస్తుతం మంటలను అదుపులోకి తెచ్చేందుకు 300 మంది అగ్నిమాపక సిబ్బంది, 700 మంది మిలిటరీ సిబ్బంది శ్రమిస్తున్నారు.

వైరస్ హాట్ స్పాట్స్ పెరుగుతున్నాయి

లాక్‌డౌన్‌ను ఉల్లంఘిస్తే కరోనా మహమ్మారి కాటేస్తుందంటూ పౌరులను వినూత్నరీతిలో హెచ్చరిస్తున్న బెంగళూరు పోలీసులు. - బసశంకరి (బెంగళూరు)

- కేంద్రం ఆందోళన; కరోనా కట్టడికి ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి
- 1397కి చేరిన కేసుల సంఖ్య; 35కు పెరిగిన మరణాలు

న్యూఢిల్లీ: మహారాష్ట్ర, కేరళ, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, ఢిల్లీ, గుజరాత్, జమ్మూ కశ్మీర్, బీహార్‌లతోపాటు కొన్ని ఇతర ప్రాంతాల్లోనూ మంగళవారం కొత్తగా కోవిడ్ కేసులు బయటపడ్డాయి. దీంతో దేశవ్యాప్తంగా ఈ వ్యాధి బారిన పడ్డ వారి సంఖ్య 1397కు, మరణాల సంఖ్య 35కు చేరుకుందని కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. దేశవ్యాప్తంగా గత 24 గంటల్లో 146 కొత్త కేసులు నమోదయ్యాయని తెలిపింది. ప్రజలు సహకరించకపోవడంతో దేశవ్యాప్తంగా కరోనా వైరస్ హాట్‌స్పాట్స్ పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. వైరస్ బారిన పడ్డవారు సన్నిహితంగా మెలిగిన వారిని గుర్తించేందుకు, ఈ హాట్‌స్పాట్స్‌ను దిగ్బంధించేందుకు వేగంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రటరీ లవ్ అగర్వాల్ మంగళవారం తెలిపారు. అయితే, ఈ విషయంలో ప్రజలు మరింత సహకారం అందించాలని కోరారు. మహారాష్ట్రలో గత 24 గంటల్లో 72 కొత్త కేసులు నమోదు కాగా ఇందులో 59 ముంబైలోనే ఉన్నట్లు ఆ రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. కేరళలోనూ ఏడు కొత్త కేసులు నమోదు కావడంతో ఆ రాష్ట్రంలో ఈ వ్యాధి బారిన పడ్డ వారి సంఖ్య 215కు చేరుకుంది. కోవిడ్ కారణంగా కేరళలో మంగళవారం మరొకరు చనిపోయారు. పశ్చిమ బెంగాల్, పంజాబ్‌లలోనూ మరణాలు సంభవించాయి. కోవిడ్ బారిన పడ్డ వారికి సేవలందిస్తున్న వైద్యులు, సిబ్బందికి తగినన్ని రక్షణ పరికరాలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని, విదేశీ వ్యవహారాల శాఖ దక్షిణ కొరియా, టర్కీ, వియత్నాంల్లో సరఫరాదారులను గుర్తించిందని లవ్ అగర్వాల్ తెలిపారు. కోవిడ్ ఆసుపత్రులను సిద్ధం చేయాల్సిన అవసరముందని కేంద్ర మంత్రుల బృందం నిర్ణయించిందన్నారు. ఏ రాష్ట్రమైనా విజ్ఞప్తి చేస్తే లాక్‌డౌన్ నిబంధనలను అమలు చేసేందుకు పారామిలటరీ బలగాలను దింపే విషయంపై ఆలోచిస్తామని హోంశాఖ జాయింట్ సెక్రటరీ శ్రీవాస్తవ తెలిపారు. తమిళనాడులో మంగళవారం ఒక్కరోజే 57 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. వీటిలో ఢిల్లీలోని నిజాముద్దీన్‌లో జరిగిన మతప్రార్థనలకు హాజరైన వారు 50 మంది ఉన్నారు.

వీసా నిబంధనలను అతిక్రమిస్తే..

భారతీయ వీసా నిబంధనలను అతిక్రమించిన వారిపై చర్యలుంటాయని కేంద్రం హెచ్చరించింది. వీసా నిబంధనలను అతిక్రమించి భారత్‌కు వచ్చిన వారిపై కఠిన చర్యలుంటాయని, వారిని బ్లాక్ లిస్ట్‌లో పెడతామని పేర్కొంది.

ఇంటి మాస్క్‌లకు మార్గదర్శకాలు

న్యూఢిల్లీ: మాస్క్‌ల కొరతని అధిగమించేందుకూ, నాణ్యమైన మాస్క్‌లను ఇంటిలోనే తయారుచేసుకునేందుకు ప్రభుత్వ శాస్త్రీయ సలహాదారు కొన్ని మార్గదర్శకాలను విడుదల చేశారు. ఇంట్లోనే అందుబాటులో ఉండే టీ షర్టు, బనియన్, చేతిరుమాళ్ళ లాంటి, వాడిన గుడ్డలతో నాణ్యమైన మాస్క్‌లను తయారుచేయవచ్చునని, ఇవి 70 శాతం ప్రభావవంతంగా పనిచేస్తాయనీ, కరోనా వ్యాప్తిని అడ్డుకోవడానికి ఉపకరిస్తాయని ప్రభుత్వ శాస్త్రీయ సలహాదారు కార్యాలయం వెల్లడించింది. మాస్క్‌లను నీళ్ళు, సబ్బు, ఆల్కహాల్‌లలో శుభ్రపరిచి, ఎండలో ఆర బెట్టాక వాడాలన్నారు. నూలువస్త్రంతో, రెండు పొరలతో తయారుచేసిన మాస్క్ సూక్ష్మ పదార్థాలను సైతం శరీరంలోకి ప్రవేశించనివ్వదు. ఈ మాస్క్‌లను తయారుచేసే ముందు గుడ్డలను శుభ్రంగా ఉతికి, ఉప్పు కలిపిన నీటిలో ఐదు నిమిషాల పాటు ఉడికించి మాస్క్‌లుగా తయారుచేసుకోవాలి.

కరోనాపై వదంతులు వద్దు

న్యూఢిల్లీ: సంబంధిత ప్రభుత్వ సంస్థల ద్వారా నిజానిజాలను నిర్ధారించుకోకుండా ఏ మీడియా సంస్థ కూడా కరోనా సంబంధిత సమాచారాన్ని ప్రచురించడం కానీ, టెలీకాస్ట్ చేయడంకానీ చేయకుండా ఆదేశాలు జారీ చేయాలని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును కోరింది. 'తప్పుడు వార్త ప్రజల్లోకి వెళ్తే దాని పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. అందుకే వాస్తవాలను నిర్ధారించుకున్నాకే కోవిడ్ వార్తలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రింట్, ఎలక్ట్రానిక్, వెబ్, సోషల్ మీడియాను కోర్టు ఆదేశించాలి' అని కేంద్రం మంగళవారం సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొంది. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ యాక్ట్ ప్రకారం ప్రజల్లో భయాందోళనలు కల్గించడం నేరమని అందులో గుర్తు చేసింది. కరోనా వైరస్ కట్టడికి ప్రభుత్వం తీసుకున్న చర్యలను కోర్టుకు వివరించింది. 'హోం శాఖ తక్షణ చర్యలు చేపట్టింది' అని పేర్కొంది. వలస కూలీల మూకుమ్మడి ప్రయాణాలను నిరోధించేందుకు తీసుకున్న చర్యలను కోర్టు దృష్టికి కేంద్రం తెచ్చింది.'కేంద్రం ఆదేశాల మేరకు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఇప్పటివరకు 21,064 రిలీఫ్ క్యాంప్‌లను ఏర్పాటు చేశాయి. గ్రామీణ ప్రాంతాలకు ఈ వైరస్ సోకకుండా జాగ్రత్త పడుతున్నాయి' అని అఫిడవిట్‌లో వివరించింది.

వలసలను తక్షణం ఆపాలి

- కరోనాపై 24 గంటల్లోగా వెబ్‌సైట్ ఏర్పాటు చేయాలి
- కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ: కరోనా వ్యాప్తిపై ఫేక్ న్యూస్‌తో ప్రజలు భయాందోళనలకు గురికాకుండా నివారించాలని, కచ్చితమైన సమాచారంతో కూడిన వెబ్‌సైట్‌ను 24 గంటల్లోగా ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. లాక్‌డౌన్ అనంతరం వలస కార్మికులు పెద్ద సంఖ్యలో నగరాల నుంచి ఇళ్లకు మరలడంపై దాఖలైన రెండు పిల్‌లను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బాబ్డే, జస్టిస్ నాగేశ్వర రావుల బెంచ్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం..'శిక్షణపొందిన కౌన్సెలర్లను రప్పించి షెల్టర్ హోమ్‌లలో ఉన్న వలస కార్మికుల్లో ఆందోళనను పోగొట్టాలి. పోలీసులకు బదులుగా వలంటీర్లకే షెల్టర్ల నిర్వహణ బాధ్యతలు చూడాలి. కార్మికులకు పరీక్షలు చేపట్టి, అవసరమైతే క్వారంటైన్‌లో ఉంచాలని ఉత్తర్వులు జారీ చేసింది. విచారణను ఏప్రిల్ 7వ తేదీకి వాయిదా వేసింది. ఈ సందర్భంగా కేంద్రం.. సత్వర చర్యలతో దేశంలో కరోనా వైరస్ వ్యాప్తికి అడ్డుకట్టవేశామని, ఫేక్‌న్యూస్ కారణంగా ప్రజల్లో తలెత్తిన భయాందోళనలతో పరిస్థితులు నియంత్రించలేనంతగా చేయిదాటి పోయాయని తెలిపింది. ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాల్లో వైరస్ జాడలు కనిపించలేదని, నగరాలు, పట్టణాల్లో ఉండే ప్రతి 10 మంది వలస కార్మికుల్లో ముగ్గురు సొంతూళ్లకు వెళ్లడంతో వైరస్ వ్యాప్తి చెందే అవకాశాలున్నాయని సొలిసిటర్ జనరల్ తెలిపారు.

ఉచితంగా కోవిడ్ పరీక్షకు ఆదేశించండి

దేశంలోని పౌరులందరికీ కోవిడ్ వ్యాధి నిర్ధారణ పరీక్ష ఉచితంగా చేయాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఉచితంగా పరీక్ష చేసేలా కేంద్ర ప్రభుత్వానికి, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలంటూ లాయర్ శశాంక్ డియో సుధి పిటిషన్ దాఖలు చేశారు. తమకున్న రోగాన్ని నిర్ధారణ చేసుకొనేందుకు సాధారణ పౌరులు ప్రైవేటు ఆస్పత్రులకు వెళితే అక్కడ భారీగా ఫీజు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఇది రాజ్యాంగానికి వ్యతిరేకమని స్పష్టంచేశారు.

60 కాదు.. 180 రోజుల వెసులుబాటు ఇవ్వాలి

అమెరికా ప్రభుత్వానికి హెచ్-1బీ వీసాదారుల వినతి

వాషింగ్టన్: హెచ్–1బీ వీసాతో అమెరికా వెళ్లిన భారతీయ వృత్తి నిపుణులకు కరోనా కారణంగా కొత్త చిక్కు వచ్చిపడింది. వైరస్ వ్యాప్తి భయంతో అక్కడి పలు సంస్థలు మూతబడటంతో వారిలో చాలామంది దిక్కుతోచని పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఉద్యోగాలు కోల్పోయిన హెచ్–1బీ వీసాదారులు.. పరిస్థితులు తిరిగి చక్కబడేదాకా అమెరికాలోనే ఉండేందుకు ప్రస్తుతం ఉన్న 60 రోజుల గడువును 180 రోజులకు పెంచాలని ట్రంప్ ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఐటీ తదితర కంపెనీలు భారత్, చైనా వంటి దేశాలకు చెందిన వేలాది మంది నిపుణులను హెచ్1బీ వీసాపై ఉద్యోగాల్లో నియమించుకుంటున్నాయి. నిబంధనల ప్రకారం హెచ్–1బీ వీసాదారు తన ఉద్యోగం కోల్పోయిన 60 రోజుల్లోగా వేరే ఉద్యోగం చూసుకోవాలి లేదా కుటుంబం సహా అమెరికా విడిచి వెళ్లాల్సి ఉంటుంది. సామాజిక భద్రత కింద వీరి వేతనాల్లో కోత విధించినా నిరుద్యోగ భృతి వంటి ప్రభుత్వ సదుపాయాలకు అర్హులు కారు. కరోనా తాకిడితో ఉద్యోగాలు కోల్పోయిన 33 లక్షల మంది ప్రభుత్వానికి ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నారు. అన్ని రంగాలకు కలిపి 4.70 కోట్ల మంది వరకు ఉద్యోగాలు కోల్పోయే అవకాశాలున్నాయని అంచనాలు చెబుతున్నాయి. అయితే, ముందుగా ఉద్వాసనకు గురయ్యేది మాత్రం హెచ్–1బీ వీసాదారులేనని నివేదికలు చెబుతున్నాయి.

అమెరికాలో అసాధారణం

మన్‌హట్టన్ నుంచి న్యూయార్క్‌కు వెళ్తున్న అమెరికా నేవీకి చెందిన యూఎస్ఎన్ఎస్ కంఫర్ట్ హాస్పిటల్ షిప్

ప్రపంచవ్యాప్తంగా 8 లక్షలు దాటిన కరోనా బాధితులు

- 40 వేలు దాటిన మరణాల సంఖ్య

వాషింగ్టన్/ప్యారిస్/రోమ్/మాడ్రిడ్: ప్రపంచవ్యాప్తంగా 185 దేశాలు, ప్రాంతాల్లో కోవిడ్ కరాళ నృత్యం కొనసాగుతోంది. మంగళవారం నాటికి 40,673 మంది ఈ మహమ్మారితో ప్రాణాలు కోల్పోగా 8,19,038 మంది వ్యాధి బారినపడ్డారు. అమెరికాలో తీవ్ర పరిస్థితులు నెలకొంటున్నాయి. యుద్ధ సమయాల్లో కనిపించే క్షేత్రస్థాయి ఆసుపత్రులు న్యూయార్క్ సెంట్రల్ పార్క్‌లో ఏర్పాటయ్యాయి. మన్‌హట్టన్ సమీపంలో ఓ యుద్ధ నౌకలో వెయ్యి పడకల ఆస్పత్రిని సిద్ధం చేశారు. ఉపాధి కోల్పోయిన పలువురు నగరంలోని ఫుడ్‌బ్యాంకుల్లో ఆహారం కోసం క్యూ కడుతున్నారు. వెంటిలేటర్లు, వ్యక్తిగత రక్షణ పరికరాల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రజలకు హామీ ఇచ్చినప్పటికీ రానున్న నెల రోజులు అమెరికా అతిపెద్ద సవాలు ఎదుర్కోబోతోందన్న ఆయన హెచ్చరిక అందరిలోనూ ఆందోళన రేకెత్తిస్తోంది. అమెరికాలో 3,400 మంది కోవిడ్‌కు బలికాగా, 1,74,665 మందికి వైరస్ సోకింది.

**ఖండాలు,

సాక్షి 24|7
నల్లగొండ

NALGONDA DISTRICT

బుధవారం, 1, ఏప్రిల్, 2020

నేటినుంచి రేషన్ పంపిణీ

నల్లగొండ : రేషన్ సరుకులను బుధవారంనుంచి అందజేయనున్నారు. ఈ మేరకు పౌరసరఫరాలశాఖనుంచి తహసీల్దార్లకు ఉత్తర్వులు అందాయి. మూడు నెలలనుంచి రెగ్యులర్‌గా రేషన్‌తీసుకుంటున్న వారికి ఈపాస్ ద్వారాకాకుండా వీఆర్ఓ, సర్పంచ్, డీటీ(సీఎస్)ల బయోమెట్రిక్ ద్వారా 12 కిలోల బియ్యం ఇవ్వాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మూడు నెలలుగా తీసుకోని వారికి మాత్రం ఈ-పాస్ ద్వారా ఇవ్వాలని తెలిపారు. ఇప్పటివరకు టోకెన్‌లు అందజేయనిపక్షంలో వెంటనే సమయం, తేదీ రాసిన టోకెన్లను అందజేస్తారు.

నల్లగొండలో.. అటెన్షన్!

- జిల్లానుంచి వంద మంది వరకు ప్రార్థనలకు వెళ్లి వచ్చినట్లు అనుమానాలు
- ఇప్పటివరకు 30మందికిపైగా హైదరాబాద్‌కు తరలింపు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 54మందిని గుర్తించినట్లు మంత్రి ప్రకటన
- ఇప్పటివరకు పరీక్షలు చేసినవారికి నెగిటివ్ రిపోర్టు
- ఊపిరిపీల్చుకున్న అధికారులు
- ఏడు రోజులు చాలా జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యాధికారులు

ఢిల్లీలోని నిజాముద్దీన్‌కు వెళ్లొచ్చిన నల్లగొండ వాసులను ప్రత్యేక అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలిస్తున్న వైద్యాధికారులు

నిజాముద్దీన్‌కు వెళ్లొచ్చిన వారి వివరాలను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి కొండల్‌రావు

అధికారిక లెక్కల ప్రకారం..
నల్లగొండ-31 సూర్యాపేట -11, యాదాద్రి - 12

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : నల్లగొండలో మరోమారు టెన్షన్ మొదలైంది. మత కార్యక్రమాల కోసం జిల్లానుంచి ఢిల్లీలోని నిజాముద్దీన్‌కు వెళ్లివచ్చిన వారిని గుర్తించారు. వీరంతా ఇన్నాళ్లు తాము ఢిల్లీ వెళ్లివచ్చిన విషయాన్ని బయటపెట్టలేదు. వివిధ ప్రాంతాల్లో సంచరించారు. పలువురిని కలిశారు. వీరికి కరోనా వైరస్ సోకినా.. సోకకున్నా.. వైరస్ సోకిన ప్రాంతాలకు వెళ్లివస్తే కనీసం పద్నాలుగు రోజులపాటు క్వారంటైన్‌లో ఉండాలన్న నిబంధనను పాటించలేదు. నిజాముద్దీన్‌లో ప్రార్థనలకు వెళ్లివచ్చిన వారిలో హైదరాబాద్, గద్వాల, నిజామాబాద్‌లలో మొత్తంగా ఆరుగురు మృతిచెందడంతో అన్ని జిల్లాల్లో ఇలా వెళ్లివచ్చిన వారిని గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించడంతో జిల్లా అధికారులు వేగంగా కదిలారు. ఢిల్లీకి ఉమ్మడి జిల్లా నుంచి సుమారు నూరు మంది దాకా వెళ్లివచ్చి ఉంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. రాష్ట్ర మంత్రి జగదీశ్‌రెడ్డి మంగళవారం మూడు జిల్లాల కలెక్టర్లతో పరిస్థితిని సమీక్షించాక మొత్తంగా 54మందిని గుర్తించినట్లు ప్రకటించారు. నల్లగొండనుంచి 31 మంది, సూర్యాపేట జిల్లానుంచి 11మంది, యాదాద్రినుంచి 12మందిని గుర్తించి పరీక్షల కోసం తరలించినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి.

అనుమానితులను హైదరాబాద్ తరలింపు

జిల్లా కేంద్రంలో మత ప్రచారానికి వచ్చిన వియత్నాం దేశీయులను ఇలాగే ఆలస్యంగా గుర్తించి పరీక్షలకు పంపించారు. వీరిలో ఎవరికీ కరోనా వైరస్ సోకకపోవడంతో జిల్లా అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. తాజాగా, మంగళవారం ఢిల్లీ నిజాముద్దీన్‌కు వెళ్లి వచ్చిన వారు నల్లగొండలో 31 మంది, మిర్యాలగూడలో 10 మంది, దేవరకొండలో ఇద్దరు, దామరచర్లలో ఇద్దరు ఉన్నట్లు గుర్తించడంతో జిల్లా ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. నల్లగొండ పట్టణం నుంచి మత కార్యక్రమాల కోసం వెళ్లి వచ్చిన వారిని గుర్తించాక వారిని పరీక్షల కోసం హైదరాబాద్‌కు తరలించారు. మిర్యాలగూడలో 10 మందిని కూడా హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి పరీక్షలకు పంపించారు. త్రిపురారం మండలం పెద్దదేవులపల్లి గ్రామంనుంచి నిజాముద్దీన్ వెళ్లివచ్చిన వారికి గుర్తించారు. వీరికి క్వారంటైన్ గడువు పూర్తి కావడంతో ఇంటినుంచి బయటికి రావద్దని పోలీసులు హెచ్చరించారు. దేవరకొండ నుంచి ఇద్దరు వెళ్లి వచ్చినట్లు తేలడంతో వారిని కూడా హైదరాబాద్‌కు పంపించారు.

ఈ ఏడు రోజులు అతి కీలకం

జిల్లాలో ఇతర దేశాలు, రాష్ట్రాలనుంచి వచ్చిన వారికి ఇప్పటివరకు నిర్వహించిన పరీక్షల్లో ఎలాంటి కరోనా లక్షణాలు లేవని తేలింది. ఢిల్లీ నిజాముద్దీన్‌కు వెళ్లి వచ్చిన వారిని పరీక్షల కోసం పంపించారు. వారి రిపోర్టుల కోసం ఎదురు చూస్తున్నారు. వీరిలో ఏ ఒక్కరికి పాజిటివ్ వచ్చినా పరిస్థితి ఇబ్బందికరంగా మారే ముప్పు ఉందని అధికార యంత్రాంగం ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఒకవేళ నెగిటివ్ వస్తే మాత్రం వారిని మరికొన్ని రోజులు గృహ నిర్బంధంలోనే పెట్టనున్నారు. క్వారంటైన్ గడువు పూర్తయ్యాక ఎలాంటి లక్షణాలు కనిపించకుంటే 80 శాతం మంచిగా ఉన్నట్లేనని, మిగిలిన మూడవ వారం పూర్తయిందంటే ఇక కరోనా లేనట్లేనని భావించవచ్చని ఒక వైద్యాధికారి వివరించారు. ఇతర దేశాలకు, రాష్ట్రాలకు వెళ్లి వచ్చిన వారు పాజిటివ్ లక్షణాలు లేకున్నా.. క్వారంటైన్ గడువు పూర్తయినా ఇళ్లకే పరిమితం కావాలని, భౌతిక దూరం పాటించాలని, చేతులు ఎప్పటికప్పుడు శానిటైజేషన్ చేసుకోవాలని వైద్యాధికారులు సూచించారు.

ఇంకా ఎవరైనా ఉంటే తెలియజేయాలి

ఇతర దేశాలు, రాష్ట్రాలనుంచి వచ్చినవారు ఎవరు ఉన్నా తమకు తెలపాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఎస్పీ ఏవీ రంగనాథ్ కోరారు. వారికి ప్రభుత్వ పరంగానే వైద్య సేవలు అందిస్తామని చెప్పారు. పరీక్షలు చేసుకోకుండా ఇంట్లోనే ఉంటే ఒకవేళ పాజిటివ్ అయితే.. వారి సొంత కుటుంబాల తోపాటు బయట కలిసిన వ్యక్తులకు కూడా ఆ వైరస్ సోకే ముప్పు ఉందని, ఎవరికి వారు స్వచ్ఛందంగా తెలపాలని కోరుతున్నారు. ఎవరైనా బయటికి వెళ్లి వచ్చినవారు ఉంటే పోలీసులు ఇతర అధికారుల దృష్టికి తీసుకు రావాలని ప్రజలకు పిలుపు ఇచ్చారు.

అనుమానితులను హైదరాబాద్‌కు తరలించాం

ఢిల్లీలోని నిజాముద్దీన్‌కు వెళ్లి వచ్చిన వారిని గుర్తించాం. గుర్తింపు ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. జిల్లా కేంద్రంనుంచి వీరందరినీ పరీక్షల కోసం ప్రత్యేక అంబులెన్సుల్లో హైదరాబాద్‌కు తరలించాం. ఎవరూ ఆందోళన చెందకుండా ఎవరికి వారు ఇళ్లకు పరిమితం కావాలి.

- డాక్టర్ అనిమళ్ల కొండల్‌రావు, జిల్లా వైద్యాధికారి

న్యూస్‌రీల్

వదంతులు నమ్మొద్దు
- మంత్రి జగదీశ్‌రెడ్డి

నల్లగొండ : ఢిల్లీలోని మర్కజ్ ప్రార్థన మందిరంలో జరిగిన ప్రార్థనలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలనుంచి పాల్గొన్న వారందరూ క్షేమంగా ఉన్నారని, దీనిపై వస్తున్న వదంతులు నమ్మొద్దని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రార్థనలో పాల్గొన్న వారందరూ వైద్య ఆరోగ్య శాఖ పర్యవేక్షణలోనే ఉన్నారని ఆయన పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం మూడు జిల్లాల కలెక్టర్లతో మంత్రి ఫోన్‌లో పరిస్థితులను సమీక్షించి మాట్లాడారు. నల్లగొండ జిల్లా నుంచి 31 మంది, యాదాద్రి జిల్లా నుంచి 12 మంది సూర్యాపేట జిల్లా నుంచి 11 మంది ఢిల్లీలోని ప్రార్థన మందిరంలో జరిగిన ప్రార్థనలో పాల్గొన్న మాట నిజమేనని, అధికారులు కూడా ధ్రువీకరించారని తెలిపారు. వారందరూ కూడా వైద్య ఆరోగ్య శాఖ చేపట్టిన క్వారంటైన్‌లో ఉన్నారని పేర్కొన్నారు.

రైతులు పండించిన ప్రతి వరి గింజను కొనుగోలు చేస్తాం
- ఎమ్మెల్యే రవీంద్రకుమార్

కొండమల్లేపల్లి : దేవరకొండ నియోజకవర్గంలో రైతులు పండించిన ప్రతి వరి గింజను కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ పేర్కొన్నారు. మంగళవారం దేవరకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి 14 ఐకేపీ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రైతులు గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని అమ్ముకోవాలని కోరారు. ఎన్నడూ లేని విధంగా ధాన్యం కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.25వేల కోట్లను కేటాయించిందన్నారు.

భౌతిక దూరం పాటించాలి
- అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

మిర్యాలగూడ : కరోనా వైరస్ (కోవిడ్ -19) వ్యాప్తి నియంత్రణలో భాగంగా నిత్యావసర సరుకులు, కూరగాయల కొనుగోలుదారులు భౌతిక దూరం పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ కోరారు. మంగళవారం మిర్యాలగూడలోని ఎన్ఎస్‌పీ క్యాంపులో ఏర్పాటు చేసిన కూరగాయల మార్కెట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ధరల పట్టికను పరిశీలించడంతో పాటు కూరగాయల దుకాణాల వద్ద భౌతిక దూరం పాటించేలా బాక్స్‌లలో నిలబడి కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీఓ రోహిత్‌సింగ్, మున్సిపల్ కమిషనర్ చీమ వెంకన్న తదితరులు ఉన్నారు.

మార్కెట్‌ను సందర్శించిన డీసీసీ అధ్యక్షుడు

పట్టణంలోని ఎన్ఎస్‌పీ క్యాంపు గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన కూరగాయల మార్కెట్‌ను మంగళవారం డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ సందర్శించారు. భౌతిక దూరం పాటించి కూరగాయలు కొనుగోలు చేయాలని కోరారు.

'వేతనాల్లో కోత సరికాదు'

నల్లగొండ టూటౌన్ : ఉద్యోగ, ఉపాధ్యాయుల వేతనాల్లో రాష్ట్ర ప్రభుత్వం కోత విధించడం సరైంది కాదని ఎస్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కందిమళ్ల నరేందర్‌రెడ్డి, గణపురం భీమయ్య, డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. సోమయ్య, జిల్లా బాధ్యులు ఎండీ. ఖుర్షిద్‌మియా, పి. వెంకులు, పి. ఏడుకొండలు, బీసీటీయూ జిల్లా బాధ్యులు పూస నర్సయ్య, కొన్నె శంకర్‌గౌడ్ మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. కరానా వైరస్ కారణంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని ఉద్యోగులు, ఉపాధ్యాయుల వేతనాల్లో కొత విధిస్తే వారి కుటుంబాల జీవన పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. వేతనాల కోతపై ప్రభుత్వం ఆలోచన చేయాలని డిమాండ్ చేశారు.

విరాళాల అందజేత

నకిరేకల్/నార్కట్‌పల్లి/కట్టంగూర్ : సీఎం సహాయనిధికి స్వచ్ఛందంగా విరాళాలు అందజేయాలని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నకిరేకల్ పట్టణానికి చెందిన టీఆర్ఎస్ నాయకులు సీఎం రిలీఫ్ ఫండ్‌కు మంగళవారం తమ వంతు సహకారం అందజేశారు. అదే విధంగా సీఎం సహాయనిధికి మంగళవారం మాజీ ఎంపీపీ, చెర్వుగట్టు దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి రూ. 51వేలతోపాటు మరికొందరు అందజేశారు. సీఎం సహాయ నిధికి కట్టంగూర్ మండల ప్రజాప్రతినిధులు మంగళవారం నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు రూ. మూడున్నర లక్షల విలువ చేసే చెక్కులను అందజేశారు.

వలస కూలీలను ఆదుకుంటాం

ఎమ్మెల్యే భాస్కర్‌రావు

బియ్యం, నగదు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ : కరోనా వైరస్ కారణంగా సొంత గ్రామాలకు వెళ్లలేక, పనులు లేక ఇబ్బందులు పడుతున్న వలస కూలీలను ప్రభుత్వం ఆదుకుంటుందని మిర్యాలగూడ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు తెలిపారు. మిర్యాలగూడ మండలంలోని కొత్తగూడెంలో ఇటుక బట్టీల్లో పనిచేసే 131 మంది వలస కూలీలకు మంగళవారం బియ్యం, నగదును ఆయన అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఇటుక బట్టీలు, రైస్ మిల్లుల్లో పనిచేసే కార్మికులు ఎలాంటి ఆందోళన చెందొద్దన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, జెడ్పీటీసీ తిప్పన విజయసింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ సరళ, ఆర్డీఓ రోహిత్‌సింగ్, తహసీల్దార్ గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

వలస కార్మికులకు ప్రభుత్వం చేయూత

నకిరేకల్‌లో వలస కార్మికులకు బియ్యం, నగదు పంపిణీ చేస్తున్న నేతి, ఎమ్మెల్యే చిరుమర్తి

నకిరేకల్/కేతేపల్లి/కట్టంగూర్/నార్కట్‌పల్లి : లాక్‌డౌన్ నేపథ్యంలో ఉపాధి కోల్పోయిన వలస కార్మికులకు ప్రభుత్వం చేయూతనందిస్తుందని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నకిరేకల్ మండల కేంద్రంలో 790 మంది వలస కార్మికులకు మంగళవారం నిత్యావసర సరుకులు, ఒక్కొక్కరికి రూ.500 చొప్పున పంపిణీ చేసి మాట్లాడారు. కేతేపల్లి మండలం ఇనుపాముల గ్రామంలో వలస కార్మికులకు ప్రభుత్వం తరుపున ఒక్కొక్కరికి 12 కేజీల బియ్యం, రూ.500 నగదును మంగళవారం ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. ఇతర రాష్ట్రాల నుంచి ఉపాధి నిమిత్తం కట్టంగూర్ మండలానికి వచ్చిన 1418 మంది వలస కార్మికులకు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన నిత్యావసర వస్తువులను, రూ.500 నగదును నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మంగళవారం మండల కేంద్రంలో అందజేశారు. నార్కట్‌పల్లి మండలవ్యాప్తంగా ఉన్న సుమారు 926 మంది కూలీలకు ఒక్కొక్కరికి 12 కేజీల బియ్యం, రూ.500 చొప్పున పంపిణీ చేశారు.

వలస కార్మికులకు ఇబ్బందులు కలిగించొద్దు
- పరిశ్రమల యాజమాన్యాలకు కలెక్టర్ ఆదేశం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నల్లగొండ : వలస కార్మికులకు ఇబ్బందులు కలగకుండా పరిశ్రమల యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ మీటింగ్ హాల్లో దామరచర్ల, యాదాద్రి పవర్‌ప్లాంట్‌కు సంబంధించి జెన్‌కో, బెల్, ఆర్‌వీపీఆర్ కంపెనీలు, ఇండిగల్, ఎస్‌వీఐపీఎల్, ఈపీఐఎల్, బ్రదర్స్ ఇంజనీరింగ్, గజ ఇంజనీరింగ్ తదితర 12 పరిశ్రమల ప్రతినిధులతో వారి ఆధీనంలో ఉన్న 1,571 మంది వలస కార్మికుల వసతులపై కలెక్టర్ సమీక్షించారు. లాక్‌డౌన్‌తో వలస కార్మికుల ఆహారానికి ఇబ్బంది కలగకుండా వారికి తప్పకుండా రేషన్ అందించాలన్నారు. మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, నిత్యావసర వస్తువులు, అత్యవసర పరిస్థితులకు సంబంధించి తహసీల్దార్లు, పోలీస్ వారు అనుమతిస్తారన్నారు. కంపెనీ కాంపౌండ్‌లో పనిచేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెన్‌కో ఈఈ గడ్డం బుచ్చయ్య, బెల్ కంపెనీ ఏజీఎం కురియన్ వర్గీన్, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

కరోనా కట్టడికి సహకరించాలి

శాసనమండలి చైర్మన్ గుత్తా

కూలీలకు బియ్యం, నగదును పంపిణీ చేస్తున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

వేములపల్లి(మిర్యాలగూడ) : కరోనా వైరస్‌ను నిర్మూలించాలంటే ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కోరారు. మంగళవారం మాడ్గులపల్లి మండలం మాడ్గులపల్లి, తోపుచర్ల, గండ్రవానిగూడెం గ్రామాల్లోని ఇటుకబట్టీల్లో పనిచేసే వలస కూలీలకు తెలంగాణ ప్రభుత్వం అందించే బియ్యం, నగదును పంపిణీ చేసి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన లాక్‌డౌన్‌లో భాగంగా రాష్ట్రంలో ఉన్న వలస కూలీలు ఆకలితో అలమటించవద్దన్న ప్రభుత్వ నిర్ణయంతో ప్రతి వలస కార్మికుడికి 12 కిలోల బియ్యంతోపాటు రూ.500నగదును అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లోని 787మంది కూలీలకు 12కిలోల చొప్పున 94.44 క్వింటాళ్ల బియ్యంతోపాటు రూ.3,93,500 నగదును అందచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, మిర్యాలగూడ ఆర్డీఓ రోహిత్‌సింగ్, జెడ్పీటీసీ పుల్లెంల సైదులు, జెడ్పీ, మండల కోఆప్షన్ సభ్యులు ఎం డీ.మోసిన్‌అలి, షేక్ మౌలాలి, సర్పంచ్‌లు మంగా యాదయ్య, చింతకుంట్ల శ్రీనివాస్‌రెడ్డి, అలుగుబెల్లి గోవిందర్‌రెడ్డి, ఎంపీటీసీ కత్తి కనకారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జెర్రిపోతుల రాములుగౌడ్, తహసీల్దార్ చల్లా సునంద, ఎంపీడీఓ దండా జితేందర్‌రెడ్డి, ఎస్ఐ నాగరాజుగౌడ్, నాయబ్ తహసీల్దార్ యశ్వంత్, ఎంపీఓ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాల్వలో పడి బాలుడి మృతి

నిడమనూరు : పక్కింటి మిత్రులకు వారి తాత ఈత నేర్పిస్తానని తీసుకెళ్తుంటే సరదాగా వారి వెంట వెళ్లిన ఓ బాలుడు ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని బొక్కమంతులపాడ్‌లో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన వెంకటరెడ్డి తన మనవరాలు, మనవడిని ఈత నేర్పిస్తా అని గ్రామం పక్కనే ఉన్న సాగర్ ఎడమకాల్వ వద్దకు మంగళవారం మధ్యాహ్నం తీసుకెళ్లాడు. వారి ఇంటి పక్కనే ఉన్న కుంటిగొర్ల లోకేష్(9) అది విని వారి వెంట వెళ్లాడు. వెంకటరెడ్డి మనవడు, మనవరాలికి కాలువలో మెట్ల వద్ద దిగి ఈత నేర్పిస్తున్నాడు. అదే సమయంలో లోకేష్ కాలువలోకి దిగి మునిగిపోయాడు. వెంకటరెడ్డి కాలువ పక్కనే ఉన్న ఇళ్ల వద్దకు వచ్చి బాలుడు కాలువలో పడ్డాడని చెప్పాడు. గ్రామస్తులు కొంత మంది వెళ్లి పడ్డచోట వెతకగా కాలువ అడుగు భాగంలో లోకేష్ అచేతనంగా ఉన్నాడు. అతడిని బయటకు తీసుకువచ్చి చూడగా అప్పటికే ప్రాణాలు విడిచినట్లు భావించి తల్లిదండ్రులకు అప్పగించారు.

ప్రజల ఇంటి వద్దకే కూరగాయలు

సంచార రైతు బజార్ వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, వలస కార్మికులకు సరుకులు, డబ్బులు పంపిణీ..

నల్లగొండ టూటౌన్ : కరోనా వైరస్ నియంత్రణలో భాగంగా చేపట్టిన లాక్‌డౌన్ సందర్భంగా ప్రజల ఇంటి వద్దకే కూరగాయలను అందించేందుకు సంచార రైతు బజార్‌లను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ డాక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక బీట్ మార్కెట్‌లో సంచార రైతు బజార్ వాహనాలను ఆయన ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డిలతో కలిసి జెండాను ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ప్రజలు ఎక్కువ సంఖ్యలో గుమికూడవద్దనే ఉద్దేశ్యంతో ఇళ్ల వద్దకు కూరగాయలను విక్రయించడానికిగాను సంచార రైతుబజార్‌లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. బత్తాయి, నిమ్మ పండ్లను కూడా సంచార రైతు బజార్ వాహనాల్లో విక్రయించనున్నామన్నారు. ప్రస్తుతం రెండు వాహనాలను ఏర్పాటు చేశామని, ప్రతి నాలుగు వార్డులకు ఒక వాహనం తిరిగే విధంగా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ కరోనా వైరస్ నియంత్రణకు అందరూ స్వీయ నియంత్రణలో ఉండాలని కోరారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఏడీ అలీం, డీఎస్పీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఆర్‌డీఓ జగదీశ్వర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ దేవ్‌సింగ్ పాల్గొన్నారు.

నల్లగొండలో..

నల్లగొండ టూటౌన్ : నల్లగొండలోని వలస కార్మికులకు నిత్యావసర సరుకులు, డబ్బులను మంగళవారం కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డిలు అందజేశారు. కార్యక్రమంలో నల్లగొండ ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ దేవ్‌సింగ్, ఏసీపీ నాగిరెడ్డి, నల్లగొండ డీఎస్పీ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనగల్‌లో

కనగల్(నల్లగొండ) : మండలంలోని పలు గ్రామాల్లో ఇటుక బట్టీలు, రైస్ మిల్లుల్లో పనిచేయడానికి వచ్చిన 137 మంది వలస కూలీలను గుర్తించి ఒక్కొక్కరికి 12 కిలోల బియ్యం, రూ. 500లను మంగళవారం పర్వతగిరిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కరోనా మహమ్మారిని నియంత్రించేందుకు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.

సాక్షి హాయ్... మీరేం చేస్తున్నారు?

పిల్లల ఇండోర్ గేమ్స్, పెద్దవాళ్ల కబుర్లు, హోమ్ మేడ్ ఫుడ్, హౌస్ ఫుల్ టైమ్.. మన కోసం.. మన చేత.. మన వల్ల అన్నట్లుగా మారేందుకు వచ్చిన అరుదైన అవకాశం లాక్‌డౌన్. ఈ సమయంలో యాక్టివిటీస్ డౌన్ కావడంతో అనుబంధాలు ఆన్ అవుతున్నాయి. వంటలు చేసే మగవాళ్లు, ఆడవాళ్లు, పిల్లలతో కలిసి ఆటలాడుతున్న పెద్దవాళ్లు, ఇలాంటి అరుదైన, అపురూపమైన దృశ్యాలు ఆవిష్కృతమవుతున్నాయి. మరి మీరేం చేస్తున్నారు? మీ ఇంట్లో ఎంత ఫన్ సృష్టిస్తున్నారు? నేడు ఎలా సందడి చేస్తున్నారు? రేపటికి ఎలా ప్రిపేర్ అవుతున్నారు? తదితర ఆసక్తికర విషయాలు 'సాక్షి'తో పంచుకోండి... గృహమే కదా స్వర్గసీమ అనే స్ఫూర్తిని అందరితోనూ పంచుకోండి. ఆయా అంశాలను మేము ప్రచురిస్తాం.

సాక్షితో పంచుకోండి...

మీ విశేషాలు పంపాల్సిన వాట్సప్ నంబర్ : 9963823329

మెయిల్ ఐడీ: nalgondasakshidesk@gmail.com

ఇంట్లో సరదాగా..!

కరోనా వైరస్ కారణంగా దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించిన నేపథ్యంలో ప్రజలంతా ఇంటికే పరిమితమయ్యారు. కాలక్షేపం కోసం చిన్నారులు చెస్, క్యారమ్స్, అష్టాచమ్మా లాంటి ఇంట్లోనే ఉండే ఆటలు ఆడుతూ సందడి చేస్తున్నారు. పెద్దలు టీవీ చూస్తూ, పిల్లలతో సరదాగా గడుపుతున్నారు. ఇలాంటి ఎన్నో అపురూప దృశ్యాలు లాక్‌డౌన్ కారణంగా ఆవిష్కృతమవుతున్నాయి. ఈ దృశ్యాలను పలువురు 'సాక్షి హాయ్ మీరేం చేస్తున్నారు'తో పంచుకున్నారు.

నల్లగొండలోని శివరాంనగర్ కాలనీలో క్యారమ్స్ ఆడుతూ...

నల్లగొండలోని శ్రీనగర్ కాలనీలో అష్టాచమ్మా ఆడుతున్న కుటుంబ సభ్యులు

నల్లగొండలోని మాన్యంచెల్కలో టంబ్లిన్ మంకీస్ ఆడుతున్న ఆనమ్ ఫాతిమా, మునమ్ ఫాతిమా

కోదాడలోని లక్ష్మీపురంలో ఇంట్లో సరదాగా గడుపుతూ...

లూడో గేమ్ ఆడుతున్న వంగాల సంధ్య, ఆకాశ్, ఉదయ్

నల్లగొండలో అష్టాచమ్మా ఆడుతూ...

కోదాడలో సాక్షి ఫజిల్స్ చేస్తున్న చిన్నారులు

చిన్నారులతో సరదాగా...

మాన్యంచెల్కలో క్యారమ్స్ ఆడుతున్న చిన్నారులు

సొంతగూటికి చేరిన కూలీలు

గ్రామానికి చేరుకున్న వలస కూలీలు

చివ్వెంల (సూర్యాపేట) : చివ్వెంల మండలంలోని పాశ్చానాయక్‌తండాకు చెందిన 26 మంది ఆంధ్రప్రదేశ్‌లోని పులిచింతల ప్రాజెక్టు నిర్మాణ పనులకు 20 రోజుల క్రితం వెళ్లారు. కాగా కరోనా వైరస్ విస్తరిస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఇటీవల దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ ప్రకటించడంతో ప్రాజెక్టు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. దీంతో కూలీలు కాలినడకన తమ స్వ గ్రామానికి బయలుదేరగా ఆంధ్ర-తెలంగాణ సరిహద్దులో అధికారులు అడ్డుకున్నారు. అధికా రులను ఎంత వేడుకున్నా.. నిబంధనలు ఒప్పుకోవు అంటూ అక్కడే నిలిపివేశారు. వారిలో కొందరు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డికి ఫోన్‌లో తమ బాధలు వివరించారు. స్పందించిన మంత్రి వెంటనే సూర్యాపేట కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. అదేవిధంగా కోదాడ ఆర్డీఓతో మాట్లాడి కూలీలు స్వగ్రామానికి చేరుకునే విధంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కూలీలకు ప్రాథమిక పరీక్షలు నిర్వహించి స్వగ్రామాలకు వెళ్లేవిధంగా చూడాలని కోదాడ ఆర్‌డీఓను కలెక్టర్ ఆదేశించారు. ఆర్‌డీఓ స్థానిక అధికారులను సమన్వయం చేసుకుని ఆదివారం సాయంత్రం వరకు కూలీలకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి సోమవారం స్వగ్రామానికి చేరుకునేలా చేశారు.

బందోబస్తులో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి

విధులు నిర్వర్తిస్తున్న రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి

కొండమల్లేపల్లి(దేవరకొండ) : లాక్ డౌన్ నేపథ్యంలో దేశ సేవ చేయడానికి నేను సైతం అంటూ దేవరకొండ పట్టణానికి చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి వరికుప్పల శ్రీను ముందుకు వచ్చాడు. పట్టణ సీఐ ఆదిరెడ్డి అనుమతితో మంగళవారం పోలీసులతో క లిసి పట్టణంలో బందోబస్తు విధులు నిర్వర్తించాడు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

కోదాడ : పట్టణ పరిధిలోని బాలాజీనగర్‌లో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మంగళవారం ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూక్యా సీతారాం తన కుమారుడు భూక్యాజగన్(18)తో కలిసి పొలం వద్దకు వెళ్లాడు. పొలానికి నీరు పెట్టడానికి మోటార్ ఆన్ చేస్తుండగా వైర్ తెగి జగన్ మీద పడింది. అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువెళ్లగా అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

తిరుమలగిరి (తుంగతుర్తి) : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన తిరుమలగిరి మున్సిపాలిటీ కేంద్రంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి గ్రామానికి చెందిన హమాలీ వనగండ్ల యాదగిరి (47) టీవీఎస్ మోపెడ్‌పై భార్యతో కలిసి వెళ్తుండగా.. జనగామ నుంచి తిరుమలగిరి వైపు వ స్తున్న కారు వేగంగా ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో యా దగిరి మృతి చెందాడు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

శాలిగౌరారం (నకిరేకల్) : కుటుంబ తగాదాల నేపథ్యంలో ఇంట్లో ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శాలిగౌరారం మండలంలోని ఊట్కూరులో మంగళవారం జరిగింది. ఎస్ఐ హరిబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఊట్కూరుకు చెందిన వరికుప్పల వెంకన్న(45) కూలి పనులు చేస్తూ జీవనం గడుపుతున్నాడు. కొంతకాలంగా కల్లు తాగుతూ కుటుంబ సభ్యులతో గొడవలు పడుతున్నాడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత ఇంటికి వచ్చిన అతడి భార్య, కుమారుడికి వెంకన్న ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. వెంకన్నను కిందకు దించి చూసేసరికి మృతి చెంది ఉన్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారుడు రూబెన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ వ్యక్తిగత, వ్యవసాయం, ప్రాపర్టీ, బిజినెస్, టేకోవర్, ప్రాజెక్ట్ మరియు సిబిల్ కేసులు వంటి అన్ని రకముల రుణములు ఇవ్వబడును. సంప్ర।। 7838016584.
[W-723337]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతిఒక్కరూ భౌతిక దూరం పాటించాలి

• ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య

హాలియా/నాగార్జునసాగర్/ తిరుమలగిరి : కరోనా వైరస్‌ను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ భౌతిక దూరాన్ని పాటించాలని నాగార్జున సాగర్ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య అన్నారు. లాక్‌డౌన్ నేపథ్యంలో విధులు నిర్వహిస్తున్న పోలీసులు, పారిశుద్ధ్య కార్మికులు, రెవెన్యూ, వైద్య సిబ్బందికి అనుముల మండల జర్నలిస్టులు సంఘం (ప్రింట్ మీడియా) ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన కూరగాయల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన రేషన్ బియ్యం కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదే విధంగా నందికొండ మున్సిపాలిటీలోని 28 మంది వలస కూలీలకు ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య, చైర్ పర్సన్ కర్ణ అనూష రెడ్డిలు మంగళవారం ఒక్కొక్కరికి 25 కిలోల బియ్యం, రూ. 500చొప్పున పంపిణీ చేశారు. తిరుమలగిరి మండలంలోని శ్రీరాంపల్లి,అల్వాల గ్రామంలోని వలసకూలీలకు

కూరగాయల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య

రూ. 500లతోపాటు 12కేజీల బియ్యాన్ని అందించే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ లాక్‌డౌన్‌ను పాటించాలని అన్నారు.

ఆంధ్రాకూలీలను అడ్డుకున్న ఏపీ పోలీసులు

నాగార్జునసాగర్ : కరోనా వైరస్‌ను కట్టడి చేసేందుకు దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించడంతో పాటు రాష్ట్రాల సరిహద్దులను మూసివేశారు. దీంతో బతుకు దెరువు కోసం ఆంధ్రా ప్రాంతంనుంచి హైదరాబాద్‌కు వెళ్లిన పలువురు కూలీలు, భవన నిర్మాణ కార్మికులు తమ స్వంత గ్రామాలకు కాలినడకన వెళ్తుండగా సరిహద్దులోని ఆంధ్రాపోలీసులు వారిని నిలిపివేశారు. దీంతో నాగార్జునసాగర్‌లోని కృష్ణా నదీతీరంలో సేద తీరుతున్న కూలీలందరిని మంగళవారం తెలంగాణ పోలీసులు పైలాన్‌లో గల పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌కు తరలించారు. సీఐ గౌరునాయుడు ఎస్ఐ సీనయ్యలు వారికి భోజనాలు పెట్టించారు. హైదరాబాద్‌లో ఉండలేకనే తమ ఇళ్లకు వెళ్తున్నామని తమను క్వారంటైన్‌కు పంపిన వెళ్తామని పలువురు కూలీలు తెలిపారు. కాగా కూలీలందరికీ ఈ రోజు రాత్రి బీసీ గురుకుల పాఠశాలలో వసతి కల్పిస్తున్నట్లు పెద్దవూర తహసీల్దార్ సైదులు గౌడ్ తెలిపారు.

తెలంగాణ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌కు వస్తున్న ఆంధ్రాకూలీలు

వలస కూలీలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

కొండమల్లేపల్లి : వలస కూలీలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. మంగళవారం దేవరకొండ మండల పరిధిలోని కొర్రోనితండాలో వలస కూలీలకు 12 కేజీల చొప్పున బియ్యం, రూ.500 నగదును వారు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఆర్డీఓ వాసుచంద్ర, ఎంపీపీ నల్లగాసు జాన్‌యాదవ్, జెడ్పీటీసీ మారుపాకుల అరుణ, సర్పంచ్ దీప్లానాయక్, ఎంపీటీసీ కొర్ర గౌతమిరాంసింగ్, తహసీల్దార్ వెంకటేశ్, బొడ్డుపల్లి కృష్ణ, సీత్యనాయక్, పాండు తదితరులున్నారు.

వలస కూలీలకు బియ్యాన్ని అందజేస్తున్న అడిషనల్ కలెక్టర్, ఎమ్మెల్యే రవీంద్రకుమార్

మద్యం పట్టివేత

మునుగోడు : మునుగోడులోని ఓ బెల్టు దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన 11 ఫుల్ బాటిళ్లు, 40 క్వాటర్ బాటిళ్ల మద్యాన్ని సోమవారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్ఐ కె.రజినీకర్ తెలిపారు. దుకాణం నిర్వాహకుడు నర్సింహపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

చండూరు : దోనిపాముల గ్రామానికి చెందిన చిట్టయ్య ఇంట్లో మంగళవారం పోలీసులు దాడి చేసి.. 75 కింగ్ ఫిషర్ బీరు బాటిళ్లు, హాయ్ వార్స్ 500 బీరు బాటిళ్లు, 28, కర్జూర బీరు బాటిళ్లు 19, ఆఫీసర్స్ చాయిస్ క్వాటర్లు 97 బాటిళ్లు పట్టుకున్నారు.

కొండమల్లేపల్లి : దేవరకొండ మండల పరిధిలోని వైదోనివంపు గ్రామంలో ఉన్న ఓ షాపులో అక్రమంగా నిల్వ ఉంచిన 21 మద్యం ఫుల్ బాటిళ్లను మంగళవారం దేవరకొండ సీఐ ఆదిరెడ్డి సీజ్ చేశారు.

నాంపల్లి : లాక్‌డౌన్ నేపథ్యంలో సివిల్, ఎక్సైజ్ పోలీసులు నిర్వహించిన దాడుల్లో మంగళవారం మండలంలోని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ మాధవయ్య, ఎస్ఐ రాంబాబు తెలిపారు. పెద్దాపురం, మేళ్లవాయి, నర్సింహలగూడెం గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తుండడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

పక్క మండలాల నుంచి మద్యం సరఫరా..

సమీప మండలాల నుంచి నాంపల్లికి గుట్టుగా మద్యం సరఫరా అవుతోందని సమాచారం. ఈ మేరకు మంగళవారం నిర్వహించిన దాడుల్లో పెద్దాపురంలో చండూరు పద్మావతి వైన్స్‌కు సంబంధించిన మద్యం బాటిళ్లు బయటపడినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు.

ఐదుగురికి క్వారంటైన్ పూర్తి

యాదగిరిగుట్ట (ఆలేరు): వివిధ దేశాలు, రాష్ట్రాల నుంచి యాదగిరిగుట్ట పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలకు వచ్చిన 58మందిని వ్యక్తులను వైద్య ఆరోగ్య శాఖ, పోలీస్, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో గుర్తించి వారిని క్వారంటైన్‌కు పంపారు. ఇందులో 5గురికి మంగళవారం హోం క్వారంటైన్ పూర్తియిందని యాదగిరిపల్లి పీహెచ్‌సీ వైద్యులు తెలిపారు. హోంక్వారంటైన్ పూర్తయిన వారిలో చొల్లేరుకు చెందిన ముగ్గురు, యాదగిరిగుట్టకు చెందిన ఇద్దరు వ్యక్తులున్నట్లు పేర్కొన్నారు. ఇక మరో ఇద్దరు న్యూఢిల్లీ నుంచి యాదగిరిగుట్టకు 21న, చొల్లేరుకు సోమవారం వచ్చారని, వీరిద్దరిని గుర్తించి చేతికి స్టాంప్ వేసి హోం క్వారంటైన్‌లో పెట్టినట్లు తెలిపారు. ఈ ఇద్దరితో కలిపి ప్రస్తుతం 55మంది హోంక్వారంటైన్‌లో ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

విదేశాలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారికి జియో ట్యాగింగ్

చింతలపాలెం (హుజూర్‌నగర్) : కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టే చర్యల్లో భాగంగా విదేశాలు, ఇతర రాష్ట్రాల నుంచి మండలానికి వచ్చిన వారికి జియో ట్యాగింగ్ చేసినట్లు ఎస్ఐ నవీన్ మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ విదేశాల నుంచి మండలానికి వచ్చిన వారు నలుగురు ఉండగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలు 268 మంది ఉన్నారని, వారందరికీ జియో ట్యాగింగ్ చేశామని ఆయన పేర్కొన్నారు.

భద్రతను వదిలేసి.. స్వయంగా కారు నడిపిన కర్నె

చౌటుప్పల్ (మునుగోడు) : కరోనా వైరస్‌ను కట్టడి చేయడంలో భాగంగా దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో శాసనమండలి విప్ కర్నె ప్రభాకర్ కఠిన నిర్ణయం తీసుకున్నారు. తనకు ఉన్న భద్రతను, ఎస్కార్ట్ వాహనాన్ని పక్కన పెట్టారు. డ్రైవర్‌ను సైతం ఇంటి వద్దే ఉండమని చెప్పారు. హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమాలతో పాటు మునుగోడు పర్యటనకు వ చ్చిన సందర్భంలో స్వయంగా తానే కారును డ్రైవ్ చేసుకుంటూ వెళ్తున్నారు. అందులో భాగంగా మంగళవారం మండల పరిధిలోని లక్కారం గ్రామంలో జరిగిన ఓ అధికారిక కార్యక్రమానికి స్వయంగా తానే కారును నడుపుకుంటూ హాజరయ్యారు.

కాలినడకనే సొంతూరికి ...

చౌటుప్పల్ (మునుగోడు) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లాక్‌డౌన్ ప్రకటించడంతో పలువురు కూలీలు సొంతూర్లకు కాలినడకనే పయనమవుతున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఒంగోలు పట్టణానికి చెందిన చాలా మంది కూలీలు రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లో తాపి పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటారు. కాగా వారిలో ముస్తఫా, అబ్రహం, వీరయ్యలు తమ సొంతూర్లకు వెళ్లేందుకు రవాణా సౌకర్యం లేకపోవడంతో హయత్‌నగర్ నుంచి 35కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ మంగళవారం సాయంత్రానికి చౌటుప్పల్ చేరుకున్నారు. పంతంగి గ్రామంలో ఉన్న టోల్‌ప్లాజా వద్ద ఏదేని వాహనం ఎక్కి వెళ్లిపోతామని వారు తెలిపారు.

కాలినడకన వెళ్తున్న కూలీలు

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

యాదగిరిగుట్ట(ఆలేరు) : కరోనా వైరస్‌ను కట్టడి చేయాలంటే వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, టెస్కాబ్ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. కరోనా వైరస్ వ్యాపించకుండా తీసుకుంటున్న చర్యల్లో భాగంగా మాసాయిపేట, వంగపల్లి గ్రామాల్లో మంగళవారం బ్లీచింగ్ ఫౌడర్, హైడ్రో క్లోరైడ్ ద్రావణాన్ని ఫైరింజన్‌లో మిక్సింగ్ చేసి వీధుల్లో పిచికారీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా వైరస్‌ను కట్టడి చేయాలంటే ప్రతి ఒక్కరూ లాక్ డౌన్ పాటించడంతో పాటు భౌతికదూరం పాటించాలన్నారు. అనంతరం రామాజీపేట గ్రామ పరిధిలో ఉన్న వలస కూలీలు 7మందికి ఒక్కొక్కరి 12కిలోల బియ్యం, రూ.500 పంపిణీ చేశారు.

రసాయన ద్రావణాన్ని పిచికారీ చేస్తున్న గొంగిడి సునీత

స్వీయ నిర్బంధమే 'శ్రీరామ రక్ష'

రాజాపేట(ఆలేరు) : కరోనా వైరస్ నివారణకు స్వీయ నిర్బంధమే శ్రీరామరక్ష అని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, టెస్కాబ్ సహకార కేంద్రబ్యాంక్ రాష్ట్ర వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, డీసీపీ నారాయణ రెడ్డిలు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా కోశాధికారి సంతోష్ గుప్తా, జిల్లా కెమిస్ట్, డ్రగ్గిస్టు ఈసీ మెంబర్ నంగునూరి కృష్ణ మరి కొంతమంది దాతల సహకారంతో పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర వస్తువులు, కూరగాయలను, గ్లౌజులు పంపిణీ చేశారు. అనంతరం వలస కార్మికులు ఒక్కొక్కరికి రూ. 500, రేషన్ బియ్యం పంపిణీ చేశారు .

భౌతిక దూరం పాటించడం ఒక్కటే మార్గం

• ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడ : కరోనా వైరస్ నివారణకు ప్రతిఒక్కరూ భౌతిక దూరం పాటించడం ఒక్కటే మార్గమని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని 19వ వార్డులో ఉచితంగా కూరగాయల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం తన నివాసంలో నియోజకవర్గంలోని సహకార సంఘాల చైర్మన్లతో సమావేశం నిర్వహించి ధాన్యం కొనుగోళ్లపై చర్చించారు. అదేవిధంగా 16వ వార్డులో కౌన్సిలర్ కల్లూరి పద్మజ, కోదాడ మాజీ సర్పంచ్ ఏర్నేని బాబు ఆధ్వర్యంలో పలు వార్డుల్లో రసాయన మందులను పిచికారీ చేయించారు. రాష్ట్ర సరిహద్దులో బందోబస్త్ నిర్వహిస్తున్న పోలీసులకు కోదాడకు చెందిన ఓరుగంటి పాండు ఉచితంగా ఆహారాన్ని అందించారు. వాసవీ క్లబ్ వారు మున్సిపాలిటీ కేంద్రంలో పలువురికి ఉచితంగా కూరగాయలను అందించారు.

కూరగాయలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

లాక్‌డౌన్ పకడ్బందీగా అమలు చేయాలి

• ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

చింతలపాలెం (హుజూర్‌నగర్) : అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సమన్వయంతో పని చేస్తూ లాక్‌డౌన్ మరింత పకడ్బందీగా అమలు చేయాలని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టే చర్యలను, తీసుకోవాల్సిన జాగ్రత్తలను మంగళవారం నియోజకవర్గంలోని అధికారులు, ప్రజాపతినిధులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలన్నారు. ప్రజలంతా లాక్‌డౌన్‌తోపాటు భౌతిక దూరం పాటించి కరోనా వైరస్‌వ్యాప్తిని అరికట్టాలని కోరారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న వారిపై, నిబంధనలు ఉల్లఘించి రోడ్లపై తిరుగుతున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని ఎక్సైజ్ అధికారులను, పోలీసు అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

సాక్షి బిజినెస్
బుధవారం
1-4-2020
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
1028	317
29,468	8,598

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్	7,760	14
డోజోన్స్	22,173	154
ఎఫ్‌టీఎస్‌ఈ 100	5,672	108
డాక్స్	9,936	120
షాంఘై	2,750	3
నికాయ్	18,917	168

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఫామ్‌కుకి	73.19	78.15
£	బ్రిటన్ పౌండ్	ఫామ్‌కుకి	91.00	95.88
€	యూరో	ఫామ్‌కుకి	80.25	85.52
¥	జపాన్ ఎన్ (100)	ఫామ్‌కుకి	59.00	77.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఫామ్‌కుకి	44.17	48.49
S$	సింగపూర్ డాలర్	ఫామ్‌కుకి	51.34	55.20
SAR	సౌదీ రియాల్	ఫామ్‌కుకి	19.10	20.97
UAE D	యూఏఈ దిర్హామ్	ఫామ్‌కుకి	19.24	21.88
¥	చైనా యువాన్	ఫామ్‌కుకి	9.51	11.28

మీ ఈఎంఐ కట్ చేయొద్దా?

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో

- ఆటోమేటిగ్గానే 3 నెలల మారటోరియం వర్తింపు
- వద్దనుకుంటే మాత్రం మీ బ్యాంకుకు తెలియజేయాలి
- ఈసీఎస్ ద్వారా చెల్లించేవారు మాత్రం ఆప్షన్ అడగాలి
- మారటోరియం కాలానికి వడ్డీ వర్తిస్తుంది
- క్రెడిట్ కార్డు బిల్లుల చెల్లింపులోనూ వడ్డీ తప్పనిసరి

శ్రీనివాస్‌కు ఎస్‌బీఐ బ్యాంక్‌లో వాహన రుణం ఉంది. ప్రతి నెల లాగే రూ.6,150 ఈఎంఐ వాయిదా గడువు ఏప్రిల్ 6. కాబట్టి మీ బ్యాంక్ ఖాతాలో సరిపడా నగదు నిల్వ ఉంచుకోవాలని సందేశం వచ్చింది''

కిషోర్‌కు హెచ్‌డీఎఫ్‌సీలో పర్సనల్ లోన్ ఉంది. తనక్కూడా ఖాతాలో తగిన నిల్వ ఉంచుకోవాలని మెసేజ్ వచ్చింది.

అయినా అదేంటి? ఆర్‌బీఐ మూడు నెలల మారటోరియం ప్రకటించిందిగా.. మళ్లీ ఈ మెసేజ్ ఏంటని శ్రీనివాస్, కిషోర్ సందేహం.

నిజానికిది వీళ్లిద్దరి సందేహమే కాదు. క్రెడిట్ కార్డ్స్‌తో సహా పర్సనల్ లోన్, వెహికల్ లోన్, హౌసింగ్ లోన్... ఇలా అన్ని రకాల రుణ ఖాతాదారులదీనూ!!.

కరోనా వైరస్ నేపథ్యంలో దేశంలో నెలకొన్న ఆర్థిక అనిశ్చితి కారణంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నెలవారీ రుణ వాయిదా (ఈఎంఐ) చెల్లింపుల మీద మూడు నెలల మారటోరియం విధించిన సంగతి తెలిసిందే. మన దేశంలో చాలా వరకు ఈఎంఐలు ప్రతి నెలా మొదటి వారంలో ఆటోమేటిక్‌గా కస్టమర్ బ్యాంక్ ఖాతా నుంచి కట్ అవుతుంటాయి. ఈఎంఐను దృష్టిలో పెట్టుకొని ఖాతాలో నగదు నిల్వ ఉంచుకుంటారు. అయితే ఆర్‌బీఐ మారటోరియం నేపథ్యంలో సిస్టమ్ సాఫ్ట్‌వేర్‌లో మూడు నెలల మారిటోరియంను లాక్ చేశామని, దీంతో ఆటోమేటిక్‌గా ఈఎంఐ నిలిచిపోతుందని ఎస్‌బీఐకి చెందిన సీనియర్ అధికారి ఒకరు 'సాక్షి'కి తెలియజేశారు. ఒకవేళ ఈఎంఐ కట్ అయితే గనక ఆందోళన చెందవద్దని.. సంబంధిత మొబైల్ సందేశాన్ని బ్యాంక్ శాఖకు మెయిల్ ద్వారా తెలియజేస్తే.. తిరిగి ఖాతాలో సొమ్ము జమ అవుతుందని వెల్లడించారు.

ఈఎంఐ వాయిదా వద్దా?

ఒకవేళ ఎవరైనా రుణ ఖాతాదారులు మూడు నెలల మారటోరియాన్ని వద్దనుకుంటే మాత్రం ఖాతాదారులే స్వయంగా లేదా మెయిల్ ద్వారా సంబంధిత బ్యాంక్ శాఖను సంప్రదించాల్సి ఉంటుంది. ఏ బ్యాంక్ నుంచైతే ఈఎంఐ కట్ అవుతుందో ఆ బ్యాంక్ శాఖకు సమాచారం అందించాలి. ఉదాహరణకు బ్యాంక్ అకౌంట్ ఎస్‌బీఐలో ఉండి, వాహన రుణం హెచ్‌డీఎఫ్‌సీలో ఉందనుకుందాం. అలాంటప్పుడు ఈఎంఐ కట్ అవుతుంది ఎస్‌బీఐలోనే కనక.. రుణ వాయిదాను నిలుపుదల చేయాల్సిన అవసరం లేదని సంబంధిత ఎస్‌బీఐ శాఖకు మెయిల్ చేయాల్సి ఉంటుంది. ఈ పద్ధతిలో ఎవరైనా కస్టమర్లు మూడు నెలల పాటు కాకుండా ఒకటి లేదా రెండు నెలలు మాత్రమే మారటోరియం కావాలన్నా కూడా ఎంపిక చేసుకునే వీలుంటుందని బ్యాంక్ అధికారులు తెలియజేశారు.

ఈసీఎస్ పరిస్థితేంటి?

ఎలక్ట్రానిక్ క్లియరింగ్ సర్వీసెస్ (ఈసీఎస్), డిమాండ్ డ్రాఫ్ట్, (డీడీ), ఓవర్ డ్రాఫ్ట్ (ఓడీ) వంటి ద్వారా ఈఎంఐ ఉపసంహరణ ఉన్న ఖాతాదారులు మారటోరియం ఆప్షన్‌ను ఎంచుకోవాలనుకుంటే మాత్రం వ్యక్తిగతంగా గానీ మెయిల్ లేదా ఇతర డిజిటల్ మాధ్యమాల ద్వారా గానీ సంబంధిత బ్యాంక్ శాఖను సంప్రదించాలి. అంతే తప్ప భవిష్యత్తులో న్యాయపరమైన సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉన్నందువల్ల బ్యాంకే స్వయంగా ఈసీఎస్‌ను నిలుపుచేసే నిర్ణయాన్ని తీసుకోబోదని ఎస్‌బీఐకి చెందిన సీనియర్ అధికారి ఒకరు తెలియజేశారు. క్రెడిట్ కార్డ్ బాకీలు, ఈఎంఐలకు కూడా ఈ మారటోరియం వర్తిస్తుంది. మూడు నెలల తర్వాత కట్టవచ్చు. కాకపోతే ఈ మూడు నెలల సమయానికి అసలుపై వడ్డీ భారం పడుతూనే ఉంటుంది.

ఎలాంటి రుణాలకు మారటోరియం?

క్రెడిట్ కార్డ్ చెల్లింపులతో సహా కార్పొరేట్, ఎంఎస్‌ఎంఈ, రిటైల్, వ్యవసాయ, వాహన, విద్య, గృహ, వ్యక్తిగత అన్ని రకాల రుణాలకు ప్రిన్సిపల్ అమౌంట్, వడ్డీ రెండింటికీ కూడా మూడు నెలల మారటోరియం వర్తిస్తుంది. ఈ మారటోరియం సమయాన్ని డిఫాల్ట్‌గా, మొండి బకాయిలుగా పరిగణించరు.

మారటోరియం వినియోగించిన కస్టమర్ల సిబిల్ స్కోర్ మీద ఎలాంటి ప్రభావం లేకుండా బ్యాంక్‌లు సంబంధిత వివరాలను క్రెడిట్ ఇన్ఫర్మేషన్ కంపెనీలకు (సీఐసీ) అందించాలని ఆర్‌బీఐ ఆదేశించింది.

ఏయే బ్యాంక్‌లంటే..

అన్ని కమర్షియల్ బ్యాంకులు, ప్రాంతీయ, గ్రామీణ, స్మాల్ ఫైనాన్స్, లోకల్ బ్యాంకులు, సహకార బ్యాంకులు, ఆల్ ఇండియా ఫైనాన్షియల్ బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలలో మార్చి నుంచి మే మధ్య అన్ని రుణ చెల్లింపులకు ఈ మారటోరియం వర్తిస్తుంది.

రిలీఫ్ ర్యాలీ..!

- మార్చిలో పుంజుకున్న చైనా తయారీ రంగం
- లాభాల బాటలో ప్రపంచ మార్కెట్లు
- మన మార్కెట్లో కూడా రిలీఫ్ ర్యాలీ
- 1,028 పాయింట్ల లాభంతో 29,468కు సెన్సెక్స్
- 317 పాయింట్లు పెరిగి 8,598కు నిఫ్టీ

గత ఆర్థిక సంవత్సరం (2019-20) చివరి రోజైన మంగళవారం నాడు స్టాక్ మార్కెట్ మాంచి లాభాలతో ముగిసింది. కానీ పూర్తి ఆర్థిక సంవత్సరం పరంగా చూస్తే, ఇన్వెస్టర్లకు భారీ నష్టాలనే మిగిల్చింది. సోమవారం భారీగా పతనమైన సెన్సెక్స్, నిఫ్టీలు మంగళవారం ఒకింత ఊపిరి పీల్చుకున్నాయి. సోమవారం అమెరికా స్టాక్‌సూచీలు 3-4 శాతం లాభాల్లో ముగియడం, మార్చి నెలలో చైనా తయారీ రంగం అంచనాలను మించి పుంజుకోవడంతో ఆసియా, యూరప్ మార్కెట్లు లాభపడటం, డాలర్‌తో రూపాయి మారకం విలువ స్వల్పంగా కోలుకోవడం... సానుకూల ప్రభావం చూపించాయి. సెన్సెక్స్ 1,028 పాయింట్లు పెరిగి 29,468 పాయింట్ల వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 317 పాయింట్ల లాభంతో 8,598 పాయింట్ల వద్ద ముగిశాయి. శాతం పరంగా చూస్తే, సెన్సెక్స్ 3.6 శాతం, నిఫ్టీ 3.8 శాతం చొప్పున లాభపడ్డాయి.

కరోనా కల్లోలమున్నా... రోజంతా లాభాలే...

కరోనా కల్లోలం కొనసాగుతున్నా స్టాక్ మార్కెట్ రోజంతా లాభాల్లోనే ట్రేడైంది. లాభాల్లోనే ఆరంభమై, రోజంతా అదే జోరు చూపించింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 1,331 పాయింట్లు, నిఫ్టీ 397 పాయింట్ల మేర లాభపడ్డాయి. కాగా భారత్‌లో కరోనా కేసుల సంఖ్య 1,200కు, మరణాల సంఖ్య 32కు చేరగా, రికవరీ అయిన వారి సంఖ్య వందకు పెరిగింది. ఇక ప్రపంచవ్యాప్తంగా కరోనా కేసుల సంఖ్య 8 లక్షలకు, మరణాలు 39,000కు చేరాయి. సోమవారం భారీగా క్షీణించిన ముడిచమురు ధరలు కోలుకున్నాయి. బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ధర 3.6% ఎగసి 27.37 డాలర్లకు పెరిగింది.

ప్రపంచ మార్కెట్ల పరుగులు...

సోమవారం అమెరికా స్టాక్‌సూచీలు 2-3 శాతం రేంజ్‌లో లాభపడ్డాయి. ఈ జోష్‌తో ఆసియా మార్కెట్లు 2-3 శాతం రేంజ్‌లో పెరగ్గా, యూరప్ మార్కెట్లు కూడా లాభాలతోనే మొదలయ్యాయి. మరోవైపు ఈ ఏడాది ఫిబ్రవరిలో 35.7 ఉన్న చైనా తయారీ రంగ పీఎమ్ఐ(పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్) ఈ ఏడాది మార్చిలో 52కు పెరగడం... ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌కు జోష్‌నిచ్చింది.

మరిన్ని విశేషాలు..

- ఐటీసీ 8 శాతం లాభంతో రూ.172 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో బాగా లాభపడిన షేర్ ఇదే.
- 30 సెన్సెక్స్ షేర్లలో నాలుగు షేర్లు-ఇండస్ఇండ్ బ్యాంక్, మారుతీ సుజుకీ, బజాజ్ ఫైనాన్స్, టైటాన్ నష్టపోగా, మిగిలిన 26 షేర్లు లాభపడ్డాయి.
- గత ఆర్థిక సంవత్సరం మూడో క్వార్టర్లో డిపాజిట్లు 10-11 శాతం తగ్గాయన్న వార్తల కారణంగా ఇండస్ఇండ్ బ్యాంక్ షేర్ 15 శాతం నష్టంతో రూ.351 వద్ద ముగిసింది.
- మార్చిలో చైనా తయారీ రంగం పుంజుకోవడంతో లోహ షేర్లు జోరుగా పెరిగాయి. సెయిల్, టాటా స్టీల్, వేదాంత, హిందుస్తాన్ కాపర్, హిందాల్కో నాల్కో షేర్లు 13 శాతం వరకూ పెరిగాయి.

మార్చిలో మరింతగా పతనం...

కరోనా వైరస్ కల్లోలంతో ప్రపంచ మార్కెట్లతో పాటే మన మార్కెట్ కూడా గత ఆర్థిక సంవత్సరంలో భారీగా నష్టపోయింది. సెన్సెక్స్9,204 పాయింట్లు(23.8%), నిఫ్టీ 3,026 పాయింట్లు (26%) పతనమయ్యాయి. ఒక్క మార్చిలోనే సెన్సెక్స్ 8,829 పాయింట్లు నష్టపోయింది. సెన్సెక్స్, నిఫ్టీలు ఒక్క రోజులో అత్యధిక పాయింట్లు నష్టపోయింది ఈ ఏడాది మార్చిలోనే. స్టాక్ సూచీలు చరిత్రాత్మక గరిష్ట స్థాయిలను దాటింది కూడా ఈ ఆర్థిక సంవత్సరంలోనే. ఈ ఏడాది జనవరిలో సెన్సెక్స్ 40,000 పాయింట్లు, నిఫ్టీ 12,000 పాయింట్లపైకి ఎగబాకాయి. స్టాక్ మార్కెట్ అత్యధికంగా నష్టపోయింది కూడా గత ఆర్థిక సంవత్సరంలోనే. ఇన్వెస్టర్ల సంపద రూ.37.59 లక్షల కోట్లు ఆవిరైంది.

రూ. 4 లక్షల కోట్లు పెరిగిన సంపద

స్టాక్ మార్కెట్ భారీ లాభాల కారణంగా ఇన్వెస్టర్ల సంపద రూ.4 లక్షల కోట్లు పెరిగింది. బీఎస్ఈలో లిస్టైన మొత్తం కంపెనీల మార్కెట్ క్యాప్ విలువ రూ.4 లక్షల కోట్లు పెరిగి రూ.113.50 లక్షల కోట్లకు ఎగసింది.

ఆర్థిక సంవత్సరం పొడిగింపు... నిజంకాదు!

ఆర్థికశాఖ వివరణ

న్యూఢిల్లీ: ఏప్రిల్ 2019 నుంచీ ప్రారంభమై మార్చి 2020తో ముగిసే 2019-2020 ఆర్థిక సంవత్సరం మరో మూడు నెలలు అంటే జూన్ నెలాంతం వరకూ పొడిగించినట్లు సోమవారం వచ్చిన వార్తల్లో నిజం లేదని తేలింది. ఆర్థిక మంత్రిత్వశాఖ ఈ మేరకు ఒక వివరణాత్మక ప్రకటన చేసింది. ఆర్థిక సంవత్సరం పొడిగింపు జరిగినట్లు వచ్చిన వార్తల్లో నిజం లేదని స్పష్టం చేసింది. దీని ప్రకారం ఆర్థికశాఖ కింద పనిచేస్తున్న రెవెన్యూ శాఖ 30వ తేదీన ఇండియన్ స్టాంప్స్ యాక్ట్‌లో కొన్ని సవరణలకు సంబంధించి ఒక నోటిఫికేషన్‌ను జారీ చేసింది. దీనిని కొన్ని మీడియా వర్గాలు తప్పుగా అర్థం చేసుకున్నాయి. ''స్టాక్ ఎక్స్ఛేంజీలు లేదా క్లీనింగ్ కార్పొరేషన్‌ల ద్వారా జరిగే సెక్యూరిటీ మార్కెట్ ఇన్‌స్ట్రుమెంట్ల లావాదేవీలపై స్టాంప్ డ్యూటీ వసూళ్లకు 2020 ఏప్రిల్ 1 నుంచీ పటిష్ట యంత్రాంగం అమల్లో ఉంటుందని గత నోటిఫికేషన్ ఒకటి తెలిపింది. అయితే ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఈ యంత్రాగం అమలును 2020 జూలై 1వ తేదీ వరకూ వాయిదా వేయడం జరిగిందని రెవెన్యూ శాఖ మార్చి 30వ తేదీన ఒక ప్రకటన ఇచ్చింది. దీనిని కొన్ని మీడియా వర్గాలు తప్పుగా అర్థం చేసుకున్నాయి'' అని ఆర్థికశాఖ ప్రకటన మంగళవారం వివరణ ఇచ్చింది.

సహజ వాయువు రేటు 26 శాతం కట్

న్యూఢిల్లీ: సహజ వాయువు ధరను ఏకంగా 26 శాతం తగ్గిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. దీనితో ఇకపై ఒక యూనిట్ (మిలియన్ బ్రిటీష్ థర్మల్ యూనిట్) గ్యాస్ ధర 2.39 డాలర్లుగా ఉండనుంది. ప్రస్తుతం ఇది 3.23 డాలర్లుగా ఉంది. కొత్త రేట్లు ఏప్రిల్ 1 నుంచి ఆరు నెలల పాటు అమల్లో ఉంటాయి. గడిచిన ఆరు నెలల్లో సహజ వాయువు రేట్లు తగ్గించడం ఇది రెండోసారి. అటు సంక్లిష్టమైన క్షేత్రాల నుంచి ఉత్పత్తి చేసే గ్యాస్ రేటును కూడా యూనిట్‌కు 8.43 డాలర్ల నుంచి 5.61 డాలర్లకు తగ్గిస్తున్నట్లు చమురు శాఖలో భాగమైన పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలిసిస్ సెల్ (పీపీఏసీ) వెల్లడించింది. రేట్ల తగ్గుదలతో గ్యాస్‌ను ముడివనరుగా ఉపయోగించే ఎరువులు, విద్యుత్ ఉత్పత్తి భారం తగ్గనుంది. వీటితో పాటు వాహనాల్లోనూ, గృహాల్లోనూ వినియోగించే సీఎన్‌జీ తదితర ఇంధనాల ధర తగ్గుతుంది. అయితే, సహజ వాయువు ఉత్పత్తి చేసే ఓఎన్‌జీసీ, రిలయన్స్ వంటి సంస్థల ఆదాయాలకు గండి పడనుంది. ఓఎన్‌జీసీ ఆదాయం సుమారు రూ. 3,000 కోట్లు తగ్గవచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి. 2014 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త ఫార్ములా ప్రకారం ఏటా రెండు సార్లు (ఆరు నెలలకోసారి) గ్యాస్ రేట్లను ప్రభుత్వం సవరిస్తోంది.

కోడిగుడ్లు

(హోల్‌సేల్-నెక్/100కు రూ.లలో) 1-4-2020

విశాఖ	345-00
చిత్తూరు	353-00
వరంగల్	338-00
గోదావరి	345-00
విజయవాడ	345-00
31-3-2020 ఫామ్ ధర...	
హైదరాబాద్	335-00

ట్రేడింగ్ గంటలు తగ్గించండి.. సెబీని కోరిన ఏఎన్ఎమ్ఐ

కరోనా లాక్‌డౌన్ నేపథ్యంలో ఈక్విటీ, డెరివేటివ్స్ సెగ్మెంట్లకు సంబంధించి ట్రేడింగ్ వేళలను కుదించాలని సెబీని ఏఎన్ఎమ్ఐ(అసోసియేషన్ ఆఫ్ నేషనల్ ఎక్స్ఛేంజీస్ మెంబర్స్ ఆఫ్ ఇండియా) కోరింది. ప్రస్తుతం స్టాక్ మార్కెట్ ఉదయం 9.15కు మొదలై సాయంత్రం 3.30కు ముగుస్తోంది. ఈ వేళలను ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకే పరిమితం చేయాలని ఏఎన్ఎమ్ఐ విజ్ఞప్తి చేసింది. కమోడిటీ మార్కెట్ ట్రేడింగ్‌ను సాయంత్రం 5కే పరిమితం చేసిన సంగతి తెలిసిందే.

మౌలిక రంగం 5.5 శాతం వృద్ధి

ఎనిమిది పరిశ్రమలతో కూడిన మౌలిక రంగం ఫిబ్రవరిలో 5.5 శాతం వృద్ధిరేటును నమోదుచేసుకుంది. ఏప్రిల్ నుంచి ఫిబ్రవరి మధ్య ఈ విభాగం వృద్ధి రేటు కేవలం 1 శాతం.

కట్టుతప్పిన ద్రవ్యలోటు: ప్రభుత్వ ఆదాయం-వ్యయాలకు మధ్య నికర వ్యత్యాసం(ద్రవ్యలోటు) ద్రవ్యలోటు బడ్జెట్ లక్ష్యానికి మించి ఫిబ్రవరి నాటికే రూ.10,36,485 కోట్లకు చేరింది. అంటే లక్ష్యంలో 135.2%కి పెరిగిందన్నమాట. 2019-20 లో రూ.7.66 లక్షల కోట్లుగా ఉండాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఇది 2019-20 జీడీపీ అంచనాల్లో దాదాపు 3.8 శాతం.

లాక్‌డౌన్ ఎఫెక్ట్... జియో ఉచిత టాక్‌టైమ్

హైదరాబాద్: లాక్‌డౌన్ నేపథ్యంలో సెల్‌ఫోన్ వినియోగదారులకు ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా టెలికం కంపెనీలు ప్రీపెయిడ్ గడువు పొడిగింపు, ఉచిత టాక్‌టైమ్ ఆఫర్ చేస్తున్నాయి. ఇప్పుడు ఈ జాబితాలో రిలయన్స్ జియో చేరింది. తన ఖాతాదారులకు 100 నిమిషాల ఉచిత టాక్‌టైమ్, 100 ఉచిత ఎస్ఎంఎస్‌లను అందిస్తున్నట్లు రిలయెన్స్ జియో తెలిపింది. ఏప్రిల్ 17 వరకు ఈ సేవలను వినియోగించుకోవచ్చని పేర్కొంది. లాక్‌డౌన్ నేపథ్యంలో గడువు పూర్తయిన జియో ఫోన్లు, రీచార్జ్ చేయలేని అన్ని రకాల జియో ఫోన్ల వినియోగదారులకు ఇన్‌కమింగ్ కాల్స్‌లో ఎలాంటి అంతరాయం ఉండదని తెలిపింది. ఎయిర్‌టెల్, బీఎస్ఎన్ఎల్ ఇప్పటికే గడువు పొడిగింపును ప్రకటించిన సంగతి తెలిసిందే.

సైయంట్ ప్లాంటులో వైద్య పరికరాలు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కంపెనీకి చెందిన మైసూరు ప్లాంటులో వైద్య పరికరాల తయారీకి అనుమతి లభించినట్టు ఇంజీరింగ్ టెక్నాలజీ సంస్థ సైయంట్ మంగళవారం వెల్లడించింది. కరోనా వైరస్‌పై పోరాటానికి ఇవి కీలకమని కంపెనీ తెలిపింది. ఎక్స్‌రే జనరేటర్లు, డయాగ్నోసిస్ యూనిట్లలో వాడే విడిభాగాలను ఇక్కడ రూపొందిస్తారు. మైసూరు ప్లాంటులో కంపెనీ ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్స్, కేబుల్ హార్నెసెస్, బాక్స్ బిల్డ్స్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను తయారు చేస్తోంది.

బీపీసీఎల్ ప్రైవేటీకరణ గడువు పొడిగింపు

న్యూఢిల్లీ: బీపీసీఎల్ ప్రైవేటీకరణకు సంబంధించి బిడ్డింగ్ గడువును కేంద్ర ప్రభుత్వం మరో నెల రోజుల పాటు పొడిగించింది. దేశంలో రెండో అతి పెద్ద రిఫైనరీ సంస్థ, బీపీసీఎల్‌లో 52.98 శాతం వాటాను ప్రభుత్వం విక్రయించనున్నది. ఈ వాటా విక్రయం కొనుగోలు చేయడానికి ఆసక్తి గల సంస్థల నుంచి ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్(ఈఓఐ)లను ఆహ్వానించింది. దీనికి గడువును మే 2గా గతంలో నిర్ణయించింది. ప్రస్తుతం ఈ గడువును జూన్13కు పొడిగించింది. కరోనా వైరస్ కల్లోలం కారణంగా ఈ గడువును పొడిగిస్తున్నట్లుగా కేంద్ర ప్రభుత్వం వివరించింది. మంగళవారం నాటికి బీపీసీఎల్ మార్కెట్ విలువ రూ.68,223 కోట్లుగా ఉంది.

విత్‌హోల్డింగ్ ట్యాక్స్ ఆదేశాల పొడిగింపు

తక్కువ స్థాయి విత్‌హోల్డింగ్ ట్యాక్స్ పరిధిలోకి వచ్చే ట్యాక్స్‌పేయర్లకు ఊరటనిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన ఆదేశాలు మరో మూడు నెలల దాకా వర్తిస్తాయని కేంద్ర ఆర్థిక శాఖ తెలిపింది.

డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యం మిస్

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం గత ఆర్థిక సంవత్సరం (2019-20)డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. గత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ సంస్థల వాటాల విక్రయం ద్వారా రూ.1.05 లక్షల కోట్లు సమీకరించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఆ తర్వాత ఈ లక్ష్యాన్ని రూ.65,000 కోట్లకు తగ్గించుకుంది. కానీ ఈ సవరించిన లక్ష్యాన్ని కూడా అందుకోలేకపోయింది. మొత్తం మీద గత ఆర్థిక సంవత్సరంలో రూ.50,299 కోట్లు మాత్రమే సమీకరించగలిగింది. లక్ష్య సాధనకు రూ.14,700 కోట్ల మేర గండి పడింది.

ఈ ఏడాది రూ.2.10 లక్షల కోట్లు

నేటి (ఏప్రిల్ 1)నుంచి మొదలయ్యే 2020-21 ఏడాదికి గాను డిజిన్వెస్ట్‌మెంట్ ద్వారా రూ.2.10 లక్షల కోట్లు సమీకరించాలనేది ప్రభుత్వ లక్ష్యం. కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో వాటా విక్రయం ద్వారా రూ.1.20 లక్షల కోట్లు, ప్రభుత్వ బ్యాంక్‌లు, ఆర్థిక సంస్థల్లో వాటా విక్రయం, ఎల్ఐసీ ఐపీఓతో సహా రూ.90,000 కోట్లు సమీకరించాలని ప్రభుత్వం నిర్ధేశించుకుంది.

రేటు కోత వరుసలో పీఎన్‌బీ, ఐఓబీ

ముంబై: ప్రభుత్వ రంగ బ్యాంకులు పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ), ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ (ఐఓబీ)లు రుణ రేట్లను 75 బేసిస్ పాయింట్లు (0.75 శాతం) తగ్గించాయి. ఏప్రిల్ 1 నుంచీ కొత్త రేట్లు అమల్లోకి వస్తాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) శుక్రవారం బ్యాంకులకు తానిచ్చే రుణ రేటు-రెపోను 0.75 బేసిస్ పాయింట్లు (రెపో ప్రస్తుతం 4.4 శాతం) తగ్గించిన నేపథ్యంలో ఈ ప్రయోజనం మొత్తాన్ని కస్టమర్లకు బదలాయిస్తున్నట్లు ఇప్పటికే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ), యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ)లు ప్రకటించాయి.

భారత్, చైనా మినహా... మాంద్యంలోకి ప్రపంచం!

ఐరాస అంచనా

ఐక్యరాజ్యసమితి: కరోనా ప్రభావం నేపథ్యంలో భారత్, చైనా మినహా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మొత్తం ఈ ఏడాది మాంద్యంలోకి వెళుతుందని ఐక్యరాజ్యసమితి (ఐరాస) తాజా వాణిజ్య నివేదిక అంచనావేసింది. ప్రపంచ ఆదాయానికి ట్రిలియన్ డాలర్ల నష్టం వస్తుందని విశ్లేషించింది. అభివృద్ధి చెందుతున్న దేశాలకు 2.5 ట్రిలియన్ డాలర్ల సహాయక ప్యాకేజ్ అవసరమని సూచించింది.

పేదరికంలోకి ప్రజలు: ప్రపంచబ్యాంక్

తూర్పు ఆసియా, పసిఫిక్ ప్రాంతాల్లో కరోనా వల్ల దాదాపు 1.1 కోట్ల మంది పేదరికంలోకి వెళ్లిపోయే అవకాశం ఉందని ప్రపంచబ్యాంక్ తాజా నివేదికలో హెచ్చరించింది.

వేతనాల్లో 30 శాతం వరకు కోత: స్పైస్‌జెట్

ముంబై: మార్చి నెల ఉద్యోగుల వేతనంలో 10-30 శాతం వరకు కోత విధించాలని బడ్జెట్ క్యారియర్ స్పైస్‌జెట్ నిర్ణయించింది. ఈ విషయాన్ని ఉద్యోగులకు ఈ-మెయిల్ ద్వారా తెలిపింది. కార్యకలాపాల నిలిచివేత కారణంగా మార్చి 25 నుంచి 31 వరకు వేతనం లేని సెలవులుగా పరిగణిస్తున్నట్టు వివరించింది. తప్పని పరిస్థితుల్లో తాము సైతం ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని ఉద్యోగులకు పంపిన లేఖలో స్పష్టం చేసింది. సీఎండీ అజయ్ సింగ్ తన వేతనంలో 30 శాతం కోతకు అంగీకరించారని తెలిపింది.

నేడే మెగా విలీనం

- పీఎస్‌యూ బ్యాంకుల విలీనం అమల్లోకి
- 6 బ్యాంకులు కనుమరుగు
- ఆంధ్రా బ్యాంకు కూడా...



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని పది బ్యాంకుల భారీ విలీనం బుధవారం నుంచి అమల్లోకి రానుంది. దీంతో ఆంధ్రా బ్యాంకు సహా ఆరు బ్యాంకులు కనుమరుగు కానున్నాయి. దేశవ్యాప్తంగా కోవిడ్ 19 మహమ్మారిని కట్టడి చేసేందుకు లాక్‌డౌన్ అమలవుతున్నప్పటికీ విలీన ప్రక్రియను ప్రణాళిక ప్రకారంగానే అమలు చేస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రస్తుత తరుణంలో విలీన ప్రక్రియ అంత సజావుగా జరగకపోవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే, యాంకర్ బ్యాంకుల చీఫ్‌లు మాత్రం ఎలాంటి సమస్యలూ ఉండబోవని ధీమా వ్యక్తం చేశారు. 'అంతా ప్రణాళిక ప్రకారమే జరుగుతోంది. సమస్య లేమీ తలెత్తే అవకాశం లేదు. ప్రస్తుత పరిస్థితులను కూడా సమీక్షించే నిర్ణయం తీసుకున్నాం. ఉద్యోగులు, ఖాతాదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నాం' అని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ రాజ్‌కిరణ్ రాయ్ జి తెలిపారు. పరిస్థితులు సాధారణ స్థాయికి వచ్చే దాకా రుణ మంజూరు తదితర ప్రక్రియల్లో ఎలాంటి మార్పులు లేకుండా యథాప్రకారమే కొనసాగిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అన్ని విభాగాల అనుసంధానికి తమ బ్యాంక

కరోనా వైరస్ తీవ్రతను జనాలకు తెలియజెప్పాలని నిర్ణయించిన హైదరాబాద్ పోలీసులు.. ఇందుకోసం ఏకంగా కరోనా అవతారమెత్తారు.. మంగళవారమిలా కరోనా థీమ్ హెల్మెట్లు ధరించి, ప్రజలకు వైరస్‌పై అవగాహన కల్పించారు.

పేషెంట్ జీరో ఎవరు?

చైనాలోని వూహాన్ నగరంలో పుట్టి.. ఒక్కో దేశాన్నీ చుట్టబెట్టేసింది కరోనా. లక్షల్లో బాధితులు.. వేలల్లో మృతులు. అగ్రరాజ్యమైనా.. అభివృద్ధి చెందుతున్న దేశమైనా.. **అన్నింటా మరణ మృదంగమే!.**

ఇదంతా పక్కనపెడితే.. ఈ విలయం మొట్టమొదట అందరికంటే ముందు తాకింది ఎవరిని?. అంటే తొట్టతొలి కరోనా రోగి.. వైద్య పరిభాషలో చెప్పాలంటే **'పేషెంట్ జీరో' ఎవరు?**

ప్రపంచవ్యాప్తంగా కరోనా బాధితుల పేర్లు గోప్యంగా ఉంచుతున్నారు. పేషంట్లను 'నంబర్లు' గా వ్యవహరిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఏడు లక్షలకుపైగా రోగులు ఉండగా, వీరిలో 'పేషెంట్ జీరో' ఎవరన్నది తెలుసుకోవడం కష్టమే. అయినా.. శాస్త్రవేత్తలు, సాంక్రమిక వ్యాధి నిపుణులు ఇప్పుడు అదేపనిలో ఉన్నారు. గతేడాది డిసెంబరులో చైనాలో మొదలైన కరోనా మూలాలను వెతికే ప్రయత్నం చేస్తున్నారు. కొంత విజయం సాధించారు కూడా. ఇటలీ, ఇరాన్, అమెరికాల్లోనూ 'పేషెంట్ జీరో' గుర్తింపునకు చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తే భవిష్యత్తులో ఇలాంటి విపత్తు సంభవించినప్పుడు మెరుగైన చికిత్స, నియంత్రణ చర్యలకు వీలుంటుందన్నది శాస్త్రవేత్తల అంచనా.

పరిశోధనలకు కీలకం: పేషెంట్ జీరో ఎవరో తెలుసుకోవడమనేది వ్యాధులపై పరిశోధనలు చేసే వారికి కీలకం. వైరస్ లేదా సూక్ష్మజీవి ఎంతమందికి సోకే అవకాశముందో సూచించేందుకు 'ఆర్-నాట్' అనే పదాన్ని వాడుతుంటారు. కరోనా విషయంలో ఆర్-నాట్ 2.5గా ఉంది. అంటే పది మందికి వైరస్ సోకితే వారి నుంచి కనీసం 25 మంది దాని బారిన పడతారన్నమాట. పేషెంట్ జీరో ఎవరనేది తెలుసుకుంటే వైరస్ ఎక్కడ పుట్టింది? ఎలా విస్తరించింది? ఎంత మేరకు నియంత్రణ చర్యలు చేపట్టాలనేది తెలుస్తుందని హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) మాజీ డైరెక్టర్ సీహెచ్.మోహన్‌రావు 'సాక్షి'కి తెలిపారు. వైరస్ జన్యుక్రమంలో మార్పులను గుర్తించడం చికిత్సను అభివృద్ధి చేసేందుకు అవసరమని ఆయన చెప్పారు. ఈ నేపథ్యంలోనే చైనాతోపాటు ఇతర దేశాలూ పేషెంట్ జీరోను గుర్తించేందుకు శ్రమిస్తున్నాయి. కాకపోతే కొన్ని రోజులపాటు వైరస్ లక్షణాలేవీ కనిపించకపోవడం వల్ల చాలామంది అన్ని రకాల నియంత్రణలు, పరీక్షలను దాటుకుని తమకు తెలియకుండానే కరోనాను వ్యాప్తి చేశారు కాబట్టి.. పేషెంట్ జీరోను గుర్తించడం సులువు కాదు.

కరోనా మొదట సోకిందెవరికి?
గుర్తించే పనిలో శాస్త్రవేత్తలు
చైనా, అమెరికా, ఇరాన్, ఇటలీలో తొలి కేసు గుర్తింపునకు యత్నాలు

చైనాలో 'పేషెంట్ జీరో' ఆమె?

వూహాన్ నగరంలో ఉండే సముద్ర జంతువుల మార్కెట్లోనే కరోనా వైరస్ మనుషులకు సోకిందనే అనుమానాలున్నాయి. ఇదే మార్కెట్లో రొయ్యల వ్యాపారి వీ గుయిక్సియాన్ (57) అనే మహిళ చైనా వరకు పేషెంట్ జీరో కావచ్చని అంచనా. చైనా డిజిటల్ వార్తా పత్రిక 'ద పేపర్' కథనం ప్రకారం.. ఈమె గతేడాది డిసెంబరులో అస్వస్థతతో ఆసుపత్రిలో చేరింది. ఏటా శీతాకాలంలో జలుబు చేయడం సాధారణమే అనుకుని చాలాకాలం ఆసుపత్రికి వెళ్లలేదని, లక్షణాలు బాగా ముదిరాక చేరానని ఆమె చెప్పింది. మార్కెట్లోని మూత్రశాలల ద్వారా తనకు వైరస్ సోకి ఉండొచ్చనేది ఆమె అంచనా. ప్రభుత్వం కొంచెం ముందుగానే మేల్కొని చర్యలు తీసుకుని ఉంటే ఈ స్థాయిలో మరణాలు ఉండేవి కాదని తెలిపింది. కరోనా లక్షణాలతో ఆసుపత్రిలో చేరిన తొలి 24 మందిలో ఈమె ఒకరని వూహాన్ మున్సిపల్ ఆరోగ్య కమిషన్ కూడా నిర్ధారించింది. అయితే గతేడాది డిసెంబరు 1న చైనా శాస్త్రవేత్తలు ఒక ప్రకటన చేస్తూ.. కరోనా బారినపడ్డ తొలి వ్యక్తికి సముద్రజీవుల మార్కెట్‌తో సంబంధం లేదని చెప్పారు. కాబట్టి వీ గుయిక్సియాన్ పేషెంట్ జీరో అయినప్పటికీ జంతువుల నుంచి వైరస్ సోకిన తొలి మనిషి మాత్రం కాకపోవచ్చు.

సాక్షి, హైదరాబాద్

ఇటలీలో మ్యూనిచ్ వాసి!

యూరోపియన్ దేశాల్లో కరోనాతో తీవ్రంగా నష్టపోయిన దేశాల్లో ఇటలీ ఒకటి. వైరస్ వ్యాప్తితో ఈ దేశం జనవరి చివరిలో అన్ని విమాన సర్వీసులను రద్దు చేసింది. రోమ్‌లో ఇద్దరు చైనీయులకు వైరస్ సోకడం దీనికి కారణమైంది. అయితే నిపుణుల అంచనాల మేరకు ఈ వైరస్ విమాన సర్వీసుల రద్దుకు ముందే ఇటలీలోకి ప్రవేశించింది. ఫిబ్రవరి 21న ఇటలీ ఉత్తర ప్రాంతంలోని లాంబార్డీలో కరోనా వైరస్ సామాజిక స్థాయిలో విస్తరించడం మొదలైంది. మిలాన్ సమీపంలోని కొడోగ్నో పట్టణంలో మటియాస్ అని పిలిచే 38 ఏళ్ల వ్యక్తిని వైద్యులు 'పేషెంట్ వన్'గా గుర్తించారు. ఈ వ్యక్తి ఇటీవల చైనాకు వెళ్లిన దాఖలాల్లేవు. కాకపోతే అతడి సహోద్యోగి ఒకరు చైనా నుంచి కొంతకాలం క్రితమే తిరిగి వచ్చాడు. ఈ వ్యక్తే పేషెంట్ జీరో కావచ్చునని అనుకున్నా.. అతడిలో వైరస్ లేనట్లు పరీక్షల్లో తేలింది. మటియాస్ వ్యాధిబారిన పడక ముందే ఇటలీలోకి వైరస్ వచ్చిందని, జన్యుక్రమాన్ని బట్టి చూస్తే జనవరి 19 -22 మధ్య మ్యూనిచ్ ప్రాంతంలో వైరస్ అంటించుకున్న వారెవరో ఇటలీకి దాన్ని మోసుకొచ్చి ఉండాలని బయోమెడికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ మసీమో గల్లీ అంటున్నారు.

అమెరికాలో వాషింగ్టన్ స్టేట్ వ్యక్తి..

అమెరికాలో తొలి కరోనా కేసు జనవరి 20న నమోదైంది. వూహాన్ నుంచి తిరిగొచ్చిన వాషింగ్టన్ స్టేట్ వ్యక్తి (35)లో లక్షణాలు కనిపించాయి. వూహాన్ నుంచి తిరిగొచ్చిన 4 రోజులకు అంటే జనవరి 19న అతడు సియాటెల్‌లోని చికిత్స కేంద్రాన్ని సందర్శించినట్లు బూల్మ్‌బర్గ్ ఒక కథనంలో పేర్కొంది. ఎయిర్‌పోర్ట్ నుంచి ఇంటికి ఇతడు మరికొందరితో కలిసి ప్రయాణించాడని తెలుస్తోంది.

ఇరాన్‌లో..

చైనాకు తరచూ ప్రయాణించే కోమ్ ప్రాంతపు వ్యాపారి నుంచి కరోనా వైరస్ ఇరాన్‌లోకి ప్రవేశించి ఉంటుందని శాస్త్రవేత్తల అంచనా. అతడే ఇరాన్ ఆరోగ్య శాఖ మంత్రి సయీద్ నమాకీ. నేరుగా చైనాకు వెళ్లే విమానాలను ప్రభుత్వం రద్దు చేసిన సందర్భంలో ఈయన ఇతర మార్గాల ద్వారా చైనా వెళ్లివచ్చినట్లు తెలుస్తోంది. వ్యాధి లక్షణాలతో ఈ వ్యక్తి మరణించారు కూడా.

వేతనాల్లో శాతాల వారీ కోత

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల జీతాలలో కోత విధిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేయడంపై ఆర్థిక శాఖ మంగళవారం స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. ఉద్యోగుల పూర్తి వేతనాన్ని శాతాల వారీగా వాయిదా వేయనున్నారు. ఈ మేరకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. జీవో నం. 27లో పేర్కొన్న విధంగా ప్రభుత్వ ఉద్యోగులకు మార్చికి సంబంధించి ఏప్రిల్‌లో రావాల్సిన పూర్తి వేతనంలో కోత విధించనున్నారు. ఈ కోత వాయిదా మాత్రమేనని, ప్రభుత్వం నిర్ణయించిన విధంగా వేతన వ్యత్యాసాన్ని వాయిదా రూపంలో అమలు చేయాలని స్పష్టం చేశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించిన జీతాల బిల్లులు ఈ పాటికే ఈ కుబేర్‌లో సమర్పించి ఉంటే ఈ వ్యత్యాసాన్ని ఐఎఫ్ఎంఐఎస్ ద్వారా వర్తింపజేయాలని, ఇప్పటివరకు సమర్పించని బిల్లులను జీవోలో పేర్కొన్న వ్యత్యాసాన్ని వర్తింపజేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనంలో 10% వేతనాన్ని వాయిదా వేయాలని, హోంగార్డులు, అంగన్ వాడీ కార్యకర్తలు/హెల్పర్లు, వీఆర్ఏలు, విద్యావాలంటీర్లు తదితరులకిచ్చే గౌరవ వేతనానికీ ఈ వాయిదా వర్తిస్తుందన్నారు. నాలుగో తరగతి పెన్షనర్లకు 10%, ఇతర ప్రభుత్వ ఉద్యోగుల పింఛన్‌లో 50%, అఖిల భారత సర్వీసు ఉద్యోగుల పింఛన్‌లో 60% వాయిదా వేయాలన్నారు. గ్రాంట్ ఇన్ ఎయిడ్ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల వేతనాలకు సంబంధించి ఇప్పటికే జారీ చేసిన బిల్లులు, చెక్కులను వెనక్కు తీసుకోవాలని, ప్రభుత్వ నిర్ణయం ప్రకారం వ్యత్యాసాన్ని వర్తింపజేసి వేతనాన్ని వాయిదా వేయాలని, ఆ మేరకు మళ్లీ బిల్లులు, చెక్కులు మంజూరు చేయాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

- హోంగార్డులు, అంగన్‌వాడీలు, వీఆర్ఏల గౌరవ వేతనాలకూ వర్తింపు
- గ్రాంట్ ఇన్ ఎయిడ్ సంస్థల సిబ్బంది జీతాల చెక్కులు, బిల్లులు వెనక్కి

లాక్‌డౌన్ ముగియగానే వేతనాల విడుదల

సాక్షి, హైదరాబాద్

'ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగుల వేతనాలు తగ్గించి ఇవ్వాల్సి వచ్చింది.. అదేమీ పూర్తి స్థాయి కోత అని భావించవద్దు.. విపత్కర పరిస్థితుల్లో ప్రభుత్వానికి సహకరించినట్టుగా భావించాలి. అది రిజర్వు ఫండ్ కిందే పెడతాం.. ఆపత్కాలంలో ఇబ్బంది ఉండకూడదనే ఆ నిర్ణయం తీసుకున్నాం. లాక్‌డౌన్ ముగియగానే ఆ నిధులను విడుదల చేస్తాం'అని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ హామీ ఇచ్చారు. ఉద్యోగుల వేతనాల్లో కోత విషయంపై ఉద్యోగ సంఘాల జేఏసీ మంగళవారం టీఎన్ జీవో భవన్ లో అత్యవసరంగా సమావేశమైంది. జీవో 27 జారీ తర్వాత తలెత్తిన పరిణామాలపై చర్చించారు. అనంతరం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌తో జేఏసీ చైర్మన్ కారెం రవీందర్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ మమత మాట్లాడారు. కరోనా డ్యూటీ చేస్తున్న ఉద్యోగులను జీవో 27 నుంచి మినహాయించి వారికి పూర్తి వేతనం చెల్లించాలని కోరారు. చాలా తక్కువ స్థాయిలో పింఛను పొందుతున్న పెన్షనర్లకు కోత లేకుండా చెల్లించాలని కోరారు. అలాగే మార్చి నెలలో పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు పూర్తి వేతనం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలపై సీఎంతో చర్చించి పరిష్కారం అయ్యేలా చూస్తానని ఈ సందర్భంగా సీఎస్ హామీ ఇచ్చినట్లు వారు వెల్లడించారు. జేఏసీ సమావేశంలో టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్, టీజీవో ప్రధాన కార్యదర్శి ఎనుగుల సత్యనారాయణ, ట్రెస్సా అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

- రిజర్వు ఫండ్‌గానే ఆ మొత్తాన్ని ఉంచుతాం
- ఉద్యోగులతో సీఎస్ సోమేశ్‌కుమార్

వేతనాల కోతపై ఆందోళన

- ప్రభుత్వ నిర్ణయం సరికాదు
- ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగులు, పెన్షనర్ల వేతనాల్లో కోత విషయంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాలు తీవ్ర ఆందోళనలో పడ్డాయి. ప్రభుత్వ నిర్ణయం సరికాదని పేర్కొన్నాయి. ఏకపక్షంగా వేతనాల్లో కోత వల్ల రాష్ట్రంలో ఉద్యోగుల కొనుగోలు శక్తి దెబ్బతింటుందని ఇంటర్ విద్యా జేఏసీ చైర్మన్ డాక్టర్ పి.మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం వేతనాల కోత కోసం జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేసిన వారిలో తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ (టీఈఏ) అధ్యక్షుడు చిలగాని సంపత్‌కుమారస్వామి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎ.నర్సిరెడ్డి, యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జంగయ్య, చావ రవి, ఎస్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సదానంద్‌గౌడ్, పర్వతరెడ్డి, టీపీటీఎఫ్ నేతలు మైస శ్రీనివాస్, కె.రమణ, పీఆర్‌టీయూ-తెలంగాణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అంజిరెడ్డి, చెన్నయ్య, తెలంగాణ రాష్ట్ర ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్ (టీఎస్‌టీటీఎఫ్) అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్ , తెలంగాణ రాష్ట్ర ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, పబ్లిక్‌సెక్టార్-కాంట్రాక్ట్ ఉద్యోగుల ఐక్య వేదిక వేదిక, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్), టీఎస్‌టీయూ, ఎస్‌జీటీ ఫోరం, టీఎస్‌పీటీఏ, జీసీటీఏ, టీఎస్‌జీహెచ్ఎంఏ, ఎస్‌జీటీయూ, ఆర్‌యూపీటీ, పీఎంటీఏ, ఎస్ఎల్‌టీఏ, టీటీఎఫ్, తల్లిదండ్రుల సంఘాలు ఉన్నాయి.

వేతనంలో కోత ఉద్యోగులకు అశనిపాతం

సీఎంకు వివిధ రాజకీయ పక్షాల లేఖ

సాక్షి,హైదరాబాద్: సగం జీతమివ్వాలనే నిర్ణయం ఉద్యోగులకు అశనిపాతంగా ఉందని, ఈ ప్రభావం ప్రైవేట్ ఉద్యోగులు, కార్మికులపై పడనున్నందున దీనిని ఉపసంహరించుకోవాలని సీఎం కేసీఆర్‌కు వివిధ రాజకీయ పార్టీలు విజ్ఞప్తి చేశాయి. ఇది ఉద్యోగుల జీతాల సమస్యగా చూడకుండా సామాజిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని సీఎంకు రాసిన లేఖలో చాడ వెంకటరెడ్డి (సీపీఐ), తమ్మినేని వీరభద్రం (సీపీఎం), ప్రొ.కోదండరాం (టీజేఎస్), ఎల్.రమణ (టీటీడీపీ), సాధినేని వెంకటేశ్వరరావు, పోటురంగారావు (న్యూడెమొక్రసీ రెండు గ్రూపులు), తాండ్రకుమార్ (ఎంసీపీఐ-యూ), జానకిరాములు (ఆర్ఎస్‌పీ), ప్రసాద్ (సీపీఐ-ఎంఎల్), బి.సురేందర్‌రెడ్డి (ఫార్వర్డ్‌బ్లాక్), ఎం.రాజేశ్ (లిబరేషన్) కోరారు.

కిలకిలారావాలు

పట్టణవాసులకు ఆహ్లాదాన్ని పంచుతున్న పక్షులు
వాహనాల రద్దీ, కాలుష్యం తగ్గడంతో నగరాల్లో పెరిగిన సంచారం
పిట్టలు, రామచిలుకలు, గువ్వల సంచారం పెరిగిందంటున్న పర్యావరణవేత్తలు

సాక్షి, హైదరాబాద్: నగరవాసులు ఇప్పుడు మళ్లీ పక్షుల కిలకిలా రావాలతో తమ నిద్ర లేస్తున్నారు. వివిధ రకాల పక్షుల శబ్దాలు ఇంటికే పరిమితమైన ప్రజలకు ఆహ్లాదాన్ని నింపుతున్నాయి. 21 రోజుల లాక్‌డౌన్ నగర వాసుల్లో కొత్త అనుభవాలను నింపుతోంది. ఎప్పుడో కొన్నేళ్ల క్రితం నగరాల్లో, పట్టణాల్లో ఉన్న పరిస్థితులను గుర్తుకు తెచ్చేలా పిట్టలు, రామచిలుకలు, గువ్వలు, కోయిలలు, వలస పక్షులు దర్శనమిస్తున్నాయి. లాక్‌డౌన్ కారణంగా అన్నిరకాల వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోవడం.. వాటి శబ్దాలు, కాలుష్యానికి ఫుల్‌స్టాప్ పడటంతో పక్షులతో పాటు ప్రజలు స్వచ్ఛమైన గాలి పీల్చుకుంటున్నారు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలతో సహా పట్టణ ప్రాంతాల్లోనూ వాతావరణ, పర్యావరణపరంగా పరిస్థితులు మెరుగుపడటంతో వన్య ప్రాణులు, పక్షులు స్వేచ్ఛగా తిరుగుతూ తాము చేసే శబ్దాలతో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. సిద్దిపేట జిల్లాలోని దుబ్బాక మండలంలో పాంగోలిన్ వంటి అరుదైన జంతువులు పగటిపూట దర్శనమిచ్చాయి. పట్టణప్రాంతాల్లో పక్షుల సంచారం బాగా పెరిగిందని, ప్రస్తుతం లాక్‌డౌన్‌తో పర్యావరణం మెరుగవుతుందని పక్షి ప్రేమికులు, పర్యావరణ వేత్తలు అభిప్రాయపడుతున్నారు.

సంఖ్య వృద్ధి

పక్షులు ఆహ్లాదం నింపేలా చేస్తున్న శబ్దాలతో పొద్దున్నే నిద్రలేవడం, గతంతో పోల్చితే మా ఇంటి చుట్టుపక్కల వివిధ రకాల పక్షుల సంఖ్య కనిపించడం చాలా ఆనందంగా ఉంది. వాహనాలు ఆగి శబ్దాలు నిలిచిపోవడం, కాలుష్యం తగ్గడంతో పక్షులు హాయిగా అటూ ఇటూ తిరుగుతున్నాయి. నగరంలో సన్ బర్డ్స్, బరోలిన్ పక్షులతో పాటు పిట్టలు, రామచిలుకలు, గువ్వలు, కోయిలలు కనిపిస్తున్నాయి.

– హరికృష్ణ ఆడేపు, హైదరాబాద్ బర్డింగ్ పాల్స్ సంస్థ అధ్యక్షుడు

జీవవైవిధ్యం సురక్షితం

లాక్‌డౌన్‌తో జీవవైవిధ్యం సురక్షితంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా మునుపటి కంటే వన్యప్రాణులు, పశుపక్షాదులు ఎక్కువగా కనిపిస్తున్నట్లుగా సమాచారం రావడం మంచి సంకేతం. హైదరాబాద్‌లో రోసీ స్టార్లింగ్ అనే మైగ్రేటరీ బర్డ్స్ లాంటివీ కనిపిస్తున్నాయి. సరుకు, ధాన్యం రవాణా నిలిచిపోవడంతో పరోక్షంగా పక్షులకు దొరికే ఆహారం నిలిచిపోవడం ఇబ్బందిగా ఉన్నా.. కాలుష్యం తగ్గడంతో సంతోషంగా ఉన్నాయి.

–జి.సాయిలు, బయోడైవర్సిటీ ఎక్స్‌పర్ట్, ఫారెస్ట్ 2.0 రీజినల్ డైరెక్టర్

స్వేచ్ఛగా సంచారం

వన్యప్రాణులు స్వేచ్ఛగా సంచరించే వాతావరణం ఏర్పడటంతో తరచుగా అడవుల్లోని రోడ్ల దగ్గరకు జంతువులు రావడం పెరిగింది. లాక్‌డౌన్ కారణంగా పర్యావరణం, అడవులకు మంచి జరుగుతోంది. నగరాల్లో వివిధ రకాల పక్షుల శబ్దాలు వినిపిస్తున్నాయని మిత్రులు చెబుతున్నారు, ఉదయం సమయాల్లో ఇళ్ల కిటికీలు తెరవగానే రకరకాల పక్షులు కనిపించి కనువిందు చేస్తున్నాయి. ప్రకృతికి, పర్యావరణానికి నష్టం కలగజేసే చర్యలకు పాల్పడితే మానవాళికి ఎదురయ్యే నష్టాలు, సమస్యలను ప్రస్తుతం మనం చవిచూస్తున్నాం.'

– ఎ.శంకరన్, వైల్డ్‌లైఫ్ విభాగం ఓఎస్డీ

కోత నిర్ణయాన్ని పునఃసమీక్షించండి

కాంగ్రెస్ డిమాండ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నెలకొన్న ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగుల వేతనాల్లో కోత విధిస్తూ సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ తప్పుపట్టింది. వెంటనే ఈ నిర్ణయంపై పునఃసమీక్ష జరపాలని, ఉద్యోగుల వేతనాలను యథాతథంగా ఇవ్వాలని పలువురు కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మల్కాజ్‌గిరి ఎంపీ రేవంత్‌రెడ్డి, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి , ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వేర్వేరుగా సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. టీపీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి, మండలిలో మాజీ ప్రతిపక్ష నేత షబ్బీర్‌అలీ, ఏఐసీసీ అధికార ప్రతినిధి డాక్టర్. దాసోజు శ్రవణ్‌కుమార్, టీపీసీసీ అధికార ప్రతినిధి ఇందిరా శోభన్ కూడా వేర్వేరు ప్రకటనల్లో కేసీఆర్ జీతాల నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని కోరారు.

ప్రైవేటు కంపెనీలు కోత విధించే ప్రమాదం!

సీఎం కేసీఆర్‌కు బండి సంజయ్ లేఖ

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుత పరిస్థితుల్లో అందరిలో భరోసా కల్పించేందుకు చర్యలు చేపట్టాల్సిన సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సంఘాలతో చర్చించకుండా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల నెల జీతాల్లో 50 శాతం కోత పెట్టే అంశంపై పునరాలోచించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె.,చంద్రశేఖర్‌రావుకు మంగళవారం లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సాకుగా చేసుకొని ప్రైవేట్ కంపెనీలు, వ్యాపారులు తమ వద్ద పని చేసే ఉద్యోగులు, కార్మికుల జీతాల్లో కోతలు విధించే ప్రమాదం ఉందన్నారు.

ప్రత్యేక విమానంలో జర్మన్ల తరలింపు

- హైదరాబాద్ నుంచి బయలుదేరిన 38 మంది జర్మన్ దేశస్తులు
- విమానాశ్రయం నుంచి కొనసాగుతున్న అత్యవసర సేవలు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లో చిక్కుకున్న 38 మంది జర్మన్ దేశస్తులను తిరిగి ఆ దేశానికి పంపించేందుకు జర్మనీ కాన్సులేట్ తెలంగాణ ప్రభుత్వం సమన్వయంతో చేసిన ప్రయత్నాలు ఫలించాయి. దీంతో మంగళవారం శంషాబాద్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానం ద్వారా వారిని జర్మనీకి తీసుకెళ్లారు. వీరిలో 19 మంది మహిళలు, 17 మంది పురుషులు, మరో ఇద్దరు పిల్లలు ఉన్నారు. జర్మన్లను తరలించేందుకు చెన్నై నుంచి వచ్చిన ఎయిర్ ఇండియాకు చెందిన డ్రీమ్ లైనర్ (బోయింగ్ బీ787-8) విమానం ఏఐ- 3005 ఉదయం 7.32 గంటలకు హైదరాబాద్ విమానాశ్రయానికి చేరుకుంది. విమానాశ్రయానికి చేరుకున్న జర్మన్లకు థర్మల్ స్క్రీనింగ్ నిర్వహించారు. ఆ విమానంలో చెన్నై నుంచి వచ్చిన మరికొందరు జర్మన్లు ఉన్నారు. ఉదయం 9.22 గంటలకు ఈ ప్రత్యేక విమానం హైదరాబాద్ నుంచి ముంబైకు బయల్దేరింది. అక్కడ మరికొంత మంది ప్రయాణికులను తీసుకుని జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌కు వెళ్లనుంది.

ఇండిగో మెడికల్ ఎవాక్యుయేషన్ విమానం

హైదరాబాద్‌లో చిక్కుకుపోయిన ఇండిగో విమాన సిబ్బందిని తరలించేందుకు వచ్చిన ప్రత్యేక రెస్క్యూ విమానాన్ని కూడా ఇదే విమానాశ్రయం నుంచి పంపించారు. మార్చి 28 మధ్యాహ్నం ముంబై నుంచి వచ్చిన ఇండిగో మెడికల్ ఎవాక్యుయేషన్ విమానంలో ఎనిమిది మంది ఇండిగో సిబ్బంది ఇక్కడ దిగారు. హైదరాబాద్‌లో చిక్కుకున్న ఐదుగురు ఇండిగో సిబ్బంది చెన్నైకు బయల్దేరి వెళ్లారు. విమానాశ్రయంలో ఇండిగో సిబ్బందికి స్క్రీనింగ్ నిర్వహించి, వారి సమాచారాన్ని తెలంగాణ ఆరోగ్య శాఖకు సమర్పించినట్లు అధికారులు తెలిపారు. దేశవ్యాప్తంగా నిత్యావసర వస్తువుల సరఫరాకు ఎలాంటి ఆటంకాలూ లేకుండా కొనసాగేందుకు కృషి చేస్తున్నారు. అత్యవసర వస్తువులైన ఔషధాలు, వ్యాక్సిన్లు, మెడికల్ ఎక్విప్ మెంట్, ఫార్మా ముడి పదార్థాలు, రక్షణ పరికరాలు, బ్యాంకు సంబంధిత వస్తువులతో నగరంనుంచి కార్గో సేవలు కొనసాగుతున్నట్లు జీఎమ్మార్ అధికారులు తెలిపారు.

ప్రత్యేక విమానంలో బయలుదేరుతున్న జర్మన్‌లు

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

epaper.sakshi.com